UNIVERSAL LIBRARY

OU_204260

UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T84 M94S  Accession No. T 3902

Author ముదిగొండ వీరనాథ శాస్త్రి

Title సంగ్రహము తాక...? 1952

This book should be returned on or before the date last marked below.

# సంతోషము లేక.......?

రచయిత

ముదిగంటి జగ్గన్నశాస్త్రి

ప్రకాశకులు:

వల్లమాంబ గ్రంథమండలి

తణుకు (ప. గోదావరిజిల్లా)

1952

కాపీ స్వామ్యములు గ్రంథకర్తవి.

వెల: రు
1—8—0

అజంతా ప్రెస్, రాజమండ్రి.

# విషయసూచిక.


| | | పేజీ |
|---|---|---|
| 1. | సంతోషము | 1 |
| 2. | ప్రసన్నత | 15 |
| 3. | అంతరంగమే బహిరంగమగును | 27 |
| 4. | మైత్రి | 36 |
| 5. | స్త్రీ-గృహము | 46 |
| 6. | వివాహము-ప్రేమ | 65 |
| 7. | శిల్పము-నైట్టి | 81 |
| 8. | కోపము | 95 |
| 9. | కవిత సౌరభము | 101 |
| 10. | మహాదానోదయము | 109 |
| 11. | అప్రధానములు | 119 |
| 12. | వాక్చాతుర్యము | 127 |
| 13. | ముక్తసరి | 135 |
| 14. | కృపణత్వము-ఆత్మదైన్యము | 142 |

# పీఠిక.

ఈపుస్తకమునకేపేరు పెట్టుట యనుశంక నాకే కలిగెను. ఏలనన యిది కథకాదు. పురాణముకాదు. నవలకాదు. ప్రేమ గాథ, నాటకముకాదు. ప్రబంధము, హరికథ కాదు. చరిత్ర కాని శాస్త్రముకాని కాదు. కావ్యముకాదు పద్యముకాదు. జయిలు జీవితము గడుపుదినములలో జీవితమునకు సంబంధించిన కొన్ని యంశములను తీసికొని వ్యాసములను వ్రాయవలెనను తలంపు కలిగెను. ఇది యట్టి వ్యాసముల సంపుటి. ఇట్టి వ్యాసములు వ్రాయుట ఆంగ్ల సాహిత్యములో సాంప్రదాయముగ నున్నట్లు కన్పడుచున్నది. కాని తెనుగులో నెచ్చటను లేదు. ఉన్నను అతి తక్కువగ నున్నవేమో.

ఈ వ్యాసములును కొంచె మించు మించు దేనికవే స్వతంత్రములుగ నుండి యొకదానితో నొకటి సంబంధములేక యేవ్యాసము చదివినను దానికదే పూర్తియగు చుండును. ఈపుస్తకమునకేయొక వ్యాసము పేరో పెట్టుటయు నంత తృప్తిగా కనపడలేదు. ఏలనన ప్రతి వ్యాసమునకేదోయొక ప్రాధాన్యత లేక ప్రయోజనము కన్పించుచున్నది.

అయినను ఈ యన్ని వ్యాసములకును నిత్యజీవితముతో నెంతేని సంబంధ ముండుటచేతను, ఇవి దానిని గురించియే చర్చించు వ్యాసములగుటచేతను, మొదటి వ్యాసము సంతోష

ముసు గురించిన దగుటచేతను, ఈ విషయము జీవిత సర్వస్వానే యగుటచేతను, ఈ పేరు వీనికి తగియుండునని తోచుచున్నది.

ఆంగ్లకవి సార్వభౌముడగు షేక్స్పియరుకవి తన నాటకములలో నొకదానికి 'పన్నెండవరాత్రి లేక మీయిష్టము' అని పేరుపెట్టి పాఠకుల నిర్ణయమునకు కూడ కొంత విడిచిపెట్టెను. కనుక ఈ వ్యాసావళికి నేను పెట్టినపేరు కాక, పాఠకులే తమ యిష్టమువచ్చినపేరు పెట్టుకొనెదరుగాక.

ముదిగంటి జగ్గన్నశాస్త్రి.

# సంతోషము

'సంతోషము సగముబలము' అను సామెత కలదు. అది జీవిత ఔషధము. "సంతోషామృత పాన తృప్తులైన శాంత చేతస్కులకుండు సుఖము ధనలుబ్ధులై కాలుగాలిన పిల్లివలె నిటు నటు పరుగులిడువారి కెట్లు లభ్యముకాగలదు?" సంతోష రహిత జీవితము బూడిదలో పోసిన పన్నీరువంటిది. సంతోషమే జీవిత పరమార్థము. సంతోషముచే నుమనలు కిచకిచలాడుచు, గంతులు వేయును. పక్షులు సంతోష రసముచే కిలకిలలాడుచు నవ్యక్త మనుగానములు చేయుచుండును. సంతోషముచేతనే నదీనదము లుప్పొంగుచుండును. సంతోషముచేతనే సముద్రుడు మేరలు మీరును. రాళ్లుకూడ సంతోషముచేతనే ద్రవించు చుండును.

ఇట్లు సమస్త జీవరాసులు, ప్రకృతి యంతయు సంతోష మునే వెలిబుచ్చుచుండ వెఱ్ఱిమానవు డొక్కడే దానిని కోల్పో వుట నాగరిక లక్షణమా? సంతోషము నార్జించుటకు ధన మక్కరలేదు. కుల మక్కరలేదు. బలమక్కరలేదు. విద్య కూడ నుండనక్కరలేదు. ఇవియున్నను లేకున్నను దాని నార్జింప వచ్చునని ప్రకృతియే చాటుచున్నది. సంతోషమొక గుణము. గుణములలోని కెల్ల గొప్పగుణము. తక్కిన యన్ని గుణములకు వన్నెయిచ్చు గుణము. మానవుని యన్ని వేళల కాపాడి

పోషించు గుణము. ఒకరిని పాడుచేయని గుణము. ఆ గుణము కల వానినేగాక నితరులమీదగూడ దాని ప్రభావమును విరజిమ్మ చల్లని గుణము. ఉదారులకే గాని చిక్కని చక్కని గుణము. జీవిత మైశ్వర్యమును పోషించు కళ్యాణగుణము. సంతోష మన్ని ధనములలోనికి గొప్పధనము. ఆరోగ్యమును పెంచుట కది పెట్టని కోట. సంతోషహీనునకు సరియైన యారోగ్య ముండనేరదు. నిత్యరోగులను పరీక్షించుచో నీ సత్యము బోధపడగలదు.

ఉల్లాసమును, సంతోషమును, వికాసమును ప్రకటించు మనఃప్రవృత్తి వారి హుటాహుటి శరీర చేష్టల యందే కానగును. భయము, దుఃఖము, క్లేశము, ద్వేషము, యీర్ష్య, కోపము, సంకోచము, మొదలగు నుద్విగ్న మనఃప్రవృత్తిగల వారి శరీరమే వారిని బయటపెట్టగలదు. అవి శరీర సామరస్య మును బోగొట్టి వ్యాధిని తెచ్చిపెట్టును.

"శుభవార్తలు, కంటికింపగు పరిసరములు, సహజమగు నాకలిని గలుగజేయును. దుర్వార్తలు, హేయమగు పరిసరములు ఆకలిని పోగొట్టును. ఇంపైన వంటకములపేరు విని నంత మాత్రముచేతనే నోరూరుచుండును. ఉద్విగ్నభావములు రక్తప్రసారముపై ప్రభావము కలిగి తద్వారా శరీరములోని ప్రతి యవయవముపై ప్రతిఫలించి వానిని శోషింపజేయును. దుఃఖభావముల ఫలితముగా ఆకలి చెడి శరీరము తగిన పోషణ పొందక రక్తము క్షీణించిపోవుచుండును. ఉల్లాసవంతము, సంతోషప్రదమునగు భావము జీర్ణశక్తిని పెంపొం

దించును. ఆకలిని వృద్ధిజేయును. రక్తప్రసారము నినుమడింప జేయును. యథార్థమున కది శరీరముపై యోషధరాజమువలె పనిచేయును.'' అని రామచరక యుద్ఘాటించుచున్నాడు.

శ్లో॥ సంతోషోహి పరం శ్రేయః, సంతోషస్సుఖముచ్యతే।
సంతుష్టః పరమశ్యేతి విశ్రామ మరిసూదన॥

సంతోషమే పరమశ్రేయము. సంతోషమే సుఖమని చెప్పబడును. సంతుష్టాంతరంగుడు పరమవిశ్రాంతి ననుభవించును. తృప్తివలన రోగమున్నను మాయమగును. తృప్తి లేకపోవుటయే పెద్ద రోగము. తృప్తియనగా నిండుదనము. నిండుదనమున కెంత కావలయును? ఎంత యున్నను నిండుదనము లేక క్రుళ్లుచు భూమినంతను చాపచుట్టగ చుట్టి యెత్తుకొని పోవలెనని చుట్టము, పక్కము, యిరుగుపొరుగు దేశము, ప్రజ, నీతి, జాతి, పరోపకారము, పాపము, భీతియను శంకలేక వంకర టింకర జీవితములను జీవించి లోకకంటకులైన వారి జీవితారణ్యములలో ద్రోహము, అబద్ధము, మోసము మొదలగు బొగ్గుపులుసుగాలి, తోడేళ్ళు, పెద్దపు... జీవితారామ దోహదప్రదములగు సుఖశాంతుల ఉదార గుణములు, త్యాగరసములు నెట్లు ప్రవహింపగలవు? తాము సం... సింపక, నితరులను సంతోషపెట్టక జీవించు కొక్కెరలు భూమికి బరువుచేటు. 'అమ్మయ్య!' పీడవదలినది. ప్రపంచ మిక సుఖ... గలదు, అని యొక్కొకడు చనిపోయినపుడు ... బయలుదేరును. ఇట్టి జీవితము జీవితమేనా? ... పించుచు లోకమును సంతసింపజేయు జీవితమే జీవితము.

సంతోషౌషధ మతి సులభసాధ్యము. దీని కొరకు కాని ఖర్చు పెట్టనక్కరలేదు. దీని నెవ్వరైనను జుర్రుకొనవచ్చును. ఏ వృత్తికి నిది యడ్డమురాదు సరిగదా, ప్రతివృత్తికి నిది పింత వన్నెను, జయమును జేకూర్చును.

నేనొక ఫలవిక్రేతను జూచితిని. జనులందరు నామె యొద్దనే కొనుచుండుట యాశ్చర్యముగనుండెను. దాని రహస్య మును శోధింపగా నామె తనవృత్తి నతి సంతోషముతో చేయుచు కొనవచ్చిన వారిని పిండు మనసుతో నాదరించుచు ఫలములతోబాటు తన సంతోషము నుచితముగా పంచుచున్న ట్లుండెను. 'కూటికి తక్కువైన గుణమునకు తక్కువా?' అను సామెత యామె పట్ల నిజమయ్యెను.

జీవితమును పోషించుకొనునట్లే సంతోష, శాంతులను కూడ మనము వృద్ధిచేసికొను చుండవలయును. లేనియెడల జీవితము రసహీనమై, మృతప్రాయమై, నిరర్థకమై భార ప్రద మగును. సంతోషమే జీవితము. జీవితమే సంతోషమని పిపీలి కాది బ్రహ్మపర్యంతము, ప్రతిజీవియు చాటుచుండగా దానికి వేరొక సాక్ష్యమేల? ఛప్పన్న శాస్త్రములను, వివిధ భాషలను, పెక్కుశక్తులను, గొప్ప బిరుదులను, సాధించుట కంటె సంతోష సంపత్తును, జీవితానందమును సాధించు టెక్కుడు పరమార్థమని యనుభవము, శాస్త్రము చాటుచున్నది. ఇట్టి యానంద రసా స్వాదనశక్తి వృద్ధియైనపుడు జీవితమే యత్యద్భుతముగా మారి పోవుచున్నది. ఆరోగ్యభాగ్యము ననుభవించువారందరు నిత్య

సంతోషులు. అట్టివారు జయింపలేని దేదియు నుండదు. శతవృద్ధుడైన జనకుని మజ్జనభోజనాదుల దనుపుచు సపర్యల నొనర్చుచు లేచినదిమొదలు నిద్రించువరకు వనజ్యోత్స్నవలె తన వనవాటిక నతి సంతోషముతో తీర్చి దిద్దుచు ఖేద మోదములు లేక, చిగురు చిగురున తిరిగి గంతులువేయు పక్షిరాజము వలె గడుపు యొక బీద తాపసకన్య నొక మహారాజు తనంతతానై యామె యానంద పరవశత్వమునకే వలచి వివాహమాడిన కథను వినియున్నాము. కనుక నానందమునకు రాజ్యములు సాటిరావు.

యువకులలోనుండు యుత్సాహమును, సంతోషాతిరేకమును, పొంగును, యౌవనానందమును నణచివేయుట పాతకము యగును. ఫుల్లారవిందముల వలె కిలకిల లాడవలసిన శిశిర శిశు ముఖ మండలములు ములగకాయల వలె ముడుచుకొనిపోవుట, శోషించుకొని పోవుట దారిద్ర్య లక్షణములు. విచారము, విషాదము, కొందలపాటు, కోపతాపములు, బాల ముఖములకు కళంకము, మచ్చ. అది దైవ నిర్ణయమునకు వ్యతిరేకము. దైవము పట్లచేయు తీరని యపచారము.

ఖైలరు అను ఋషి "నేను వచ్చువరకు నవ్వుచునే యుండుము" అని తన స్నేహితునితో జెప్పి యంతర్ధానమయ్యెను. హాసములేని ముఖము, ఉల్లాసములేని మనము, విన్యాసములేని హస్తము, సరస సల్లాపములు లేని జీవితము తల్లుల కడుపుచేటు. అయినను యానందము ననుభవింపగల శక్తి నెంతమంది యలవర్చుకొనుచున్నారు? చాలమంది దీనిని ధ్వంసము జేసికొందురు.

పుత్ర మిత్ర కళత్రాదులు, యిరుగు పొరుగులతో కలసి యవ్యాజ సుఖము ననుభవింపగల భాగ్యశాలురే నిజమైన భాగ్యవంతులు. ఇతరులు హతభాగ్యులు. ఉత్సాహవంతు లానందము ననుభవించుటయేగాక నందరికంటె నెక్కువకాలము జీవింతురు. ప్రపంచమున కుపకారు లగుదురు. విజయవంతులగుదురు. ఈ యానందావేశమే, ఈ సంతోషలవమే, జీవిత యంత్రమును మృదువుపరచి ముప్పదియేండ్లు రాకమునుపే ముదిమొగమును తెచ్చు జీవితరంగములోని కిరకిరలను, బిరబిరలను, వృధాక్లేశములను పాఱద్రోలును. "నేను సర్వత్ర సంతోషమునే చూడగోరెదను. నా గది బంగారుకాంతు లీనునట్లు గవాక్షములను చిత్ర చిత్ర కాచములను వ్రేలగట్టుదును." అని మరియా కొరెల్లి యను నామె చెప్పుచుండెడిదట. సౌందర్యమునే చూడగలుగుట గొప్ప అదృష్ట లక్షణము. దీనిని దొంగలు తస్కరింపజాలరు. అగ్ని దహింపజాలదు. పంచభూతము లప్పట్టున నిర్వీర్యము లగును. కనుక నిట్టిభాగ్యము నేనయశాలి వరింప గోరడు? అట్టి ముష్కరుడున్నచో నతడు దుర్భగుడు. ఏవృత్తిలోనున్నను యానందమునే చూరగొనుము. కసాయివృత్తిచే జీవించు ధర్మవ్యాధుని యాంతరంగిక జీవిత మత్యద్భుతముగ నుండెడిది. అట్టి జీవితమే జీవితము. అనేక కారణములను బట్టి వృత్తి యేర్పడవచ్చును. మనస్సు ప్రధానముగాని బాహ్యకర్మ ప్రధానముగాదు. నీవెంత బాడపని, బలువుపని చేయవలసి వచ్చినను దినమంతయు నంధకారముగను, దుఃఖమయముగను గాన్పించి

నను, పక్కన నీలోనీవొక నవ్వు నవ్వుకొందువేని దానితో
నంతయు తారుమారగును. చిరునవ్వు చిందని ముఖము, మాట
నుట లాడుచు కొరివివలె నుండి ప్రపంచ భారమంతయు తన
భుజస్కంధములపైననే నిలుపబడియున్నట్లు పరితపించువాని గతి
దుఃఖమయము. దుఃఖాత్ముడు తనకు తానే భారమగును. పరి
హాసము, చిరునవ్వు, విశ్రాంతి, యానందకారణములను సహింప
జాలని మొరకు సంఘమున కపకారి. శత్రువు. ద్రోహి.
ఔరంగజేబు చక్రవర్తిని గురించి యొక కథ గలదు. అతడొక
నాడొక యుత్సవమును జూచెను. అతడు దానికి కారణమేమని
ప్రశ్నించెను. అతని చిత్తవృత్తి నెరింగినవారే దాని నేర్పరచిరి!
చక్రవర్తి శాసనములచే చంపివేయబడిన గానదేవత శవపేటిక
నూరేగించుచున్నారు! అని సమాధానము జెప్పగా "అది తిరిగి
వచ్చి చెవులకు వినిపింపకుండ నంతటిలోతుగ దానిని పాతి
వేయుడు" అని యతడు శాసించెనట!

ఆశ్చర్యము! ఆశ్చర్యము! చివరికథ మన మెరిగినదే!
మరణశయ్యమీద నున్న ఔరంగజేబు తన కుమారుని పిలిచి
యిట్లు విలపించెను. "నే నిపు డేకాకినై పోవుచున్నాను.....
నేను చేసిన ప్రతిపాపము, ప్రతిదారుణకృత్యము, ప్రతి యపరాధ
ఫలితము నాశిరమున మోసికొని పోవుచున్నాను. నేనీ ప్రపంచ
మునకు వచ్చినపుడు నాతో నేమియు తేలేదు. ఇప్పుడో నేనొక
పాప పటాలమును కొనిపోవుచున్నాను. ఎటుచూచినను నాకి
పుడు దండధరుడే కాన్పించుచున్నాడు. నేనెంతయో పాపము

జేసితిని. నా కేగతి పట్టనున్నదో తెలియకున్నది.'' అని ''భారత ప్రసిద్ధులు'' అను గ్రంథములో వ్రాయబడెను.

ఒక స్నేహితుడు గలడు. ఆయన స్ఫురద్రూపి, ఆజాను బాహువు. అరవిందాననుడు. నగుమోమువాడు. ''అయ్యో! మీ రారవపడిలో పడియున్నారే'' అని నేమడిగెడి వారము. అబ్బే నేను షష్టి శరద్వయస్కుడను. కాదు, కాదు. నాకు వయస్సేలేదు. నేను వయస్సు నెరుగను.'' అని యాయన చెప్పెడివాడు. నిజమున కాయన నిత్య యౌవనుడు. తన జీవితములో లెక్కించుకొనవలసిన విశేషమేమియు లేనివానికే వయస్సు లెక్కకు వచ్చునని యొక కవి చెప్పెను.

(అనాయాసేన మరణం వినా దైన్యేన జీవనం.' సుఖమైన మరణము, దైన్యములేని జీవనము కావలెనని భారతము జెప్పుచున్నది. ఇది జీవితభాగ్యముగ పరిగణింపబడుచున్నది. అమెరికాలో నొకగొప్ప సభలో నెట్టి చావు మంచిదని చర్చరాగా జాకీ అనునతడు ''పొట్ట పగులునట్లు నవ్వించు విషయమును చూచుకొని యానవ్వుతోనే ఆ నవ్వులోనే నేను చనిపోవగోరుదును.'' అని చెప్పెనట!

ఇప్పుడు సమస్తము తారుమారై సంతోష బహిష్కార శాసనము నెవరేని విధించిరా యనునట్లు ప్రపంచము నడుచుచున్నది. అవ్యాజమగు ప్రేమ, యానందము తొణికిసలాడు ముఖము వేయింటికొకటియు గానరాదు. అంతయు తొందర, కందరగోళము, తొట్రుపాటు, ధనార్జన, గడబిడ, చికాకు,

భీభత్సము, దైన్యము, విచారము, బేరసారములు, లాభనష్ట ములు, విలాపములు, విప్రలంభము, మోసము, దంభము, ఉడికీ యుడకని మెతుకులు, నమిలీ నములని మెతుకులు, రైలులో నొక కాలు, హోటలులో నొక కాలు, కాలేజీలో నొక కాలు, కాఫీహోటలులో రెండవకాలు, ఇక నారోగ్య మునకు లోటేమి? ఆయుర్దాయమునకు కొదువయేమి? జీవితము నుక్కిరి బిక్కిరి జేయుటకిక నేమికావలయును? దీనితో బిక్క మొగములు, బక్కప్రేగులు, లోతుకళ్ళు, ఊచకాళ్లు, ఊరర పొట్టలు, పేడిమొగములు, కళ్ళజోళ్ళు, కాళ్ళజోళ్ళు, చీకిరి కళ్ళు, మందులసీసాలు— అయ్యో, రామ! ఇది యంతె నవ నాగరికత క్రింద చలామణి! విద్యాలయములలో, కళాశాలలో జీవితకళ తప్ప తక్కిన చెత్తకళ లెన్నియో నేర్పబడును. లయ విద్యయేగాని యక్షయవిద్య మచ్చుకైన గానరాదు. బల్లలు, కుర్చీలు, గంటలు, పాఠ్యక్రమము, పుస్తకములు, సుద్ద ముక్కలు, నల్లబల్లలు, నోట్సు పుస్తకములు, జీతముల బిల్లులు, పేపబెత్తములు, వంకర దండములు,— విద్యాంతము విషాదమేగాని యానందముగాదు. నేనొక విద్యాధికారి నెరుగు దును. ఆయన పెద్ద జీతగాడు. ఆయన గండు ముఖమున చిరునవ్వునను మొలకెత్తుటకు వీలులేదు. తాను నవ్వడు. ఇతరులను నవ్వింపలేడు. కిలకిల లాడుచు నాడుకొనుచుండు బిడ్డలు, మనుమలు, ఆయనను చూచి కెవ్వనలేచి పారిపోవు దురు. ఆయన రాక ఆలమందలోనికి పెద్దపులి వచ్చినట్లుండును.

ఆయన కెవ్వరు నచ్చరు. ఏ యుగ్యమము నచ్చదు. ప్రతి దానిలో నేదో యొక లోపమే గాన్పించును. గనుక ఆయన దేనికి బూనుకొనడు. పూనుకొనునా! యది నాశనమే? కాని ప్రతిదానిని వెక్కిరించును. తాను చేయడు ఇతరులు చేసిన సహింపడు.

"సంతోషములో ఆకర్షణశక్తి గలదు. ఇతరులకు విఘ్నములే కనిపించు చోట సంతోషికి విజయమే కాన్పించును. ఇతరుల కేది చీకటి, తుఫాను యగునో యది యతనికి సూర్య రశ్మి. ఎట్టి పరిస్థితులలోను, జీవితములో నెన్నడు ఆనందమును గోల్పో కూడదను ముఖ్య సిద్ధాంతముపై విద్య గరపబడినచో మన నాగరికతలో చిత్రమైన మార్పు రాగలదు." యని మార్డెన్ వ్రాయుచున్నాడు.

"ప్రతిదినము కొంతకాలమైనను నవ్వగల వారితో గడుపుము" అని డాక్టరు జాన్సన్ సూచించెను. "పకపక నవ్వుచు బలుపు చెందుము" అని మరి యొక కవి చెప్పెను. కనుకనే మన పూర్వులు హాస్యము నొక కళగా నేర్పరచి హాస్యవృత్తికి గౌరవము నిచ్చిరి. జీవిత సంఘర్షణలలో, నెగుడు దిగుడులలో, రాకపోకలలో, లాభనష్టములలో, చిక్కుకొని నలిగి తమ నిజ రూపమునే కోల్పోదురను దూరదృష్టితోనే హావ భావ చేష్టలతో నవ్వించు హాస్యగాండ్రు, విదూషకులు, వీధినాటకములు పగటివేషములు కల్పింపబడినవి.

"పూర్ణచంద్రుని వలె చలువ కాంతులను సంతోషమును వెదజల్లు ఆశయములు గలవాడు, నుద్వేగ మెంత మాత్రము లేనివాడు నశింపడు. కృశింపడు. అడవి మృగములు చెవుల కింపుగ నుండు వేణుధ్వనులచే నాకర్షింప బడునట్లు, మనుజులు మృదు మధురములైన యాచారములు గలవారిచే నాకర్షింప బడుచుందురు." అని యోగవాశిష్టము చెప్పుచున్నది. బెల్లము చీమల కాహ్వానము పంపుట లేదు. మధువు తేనటీగలను పిలుచుట లేదు. వాని సహజ మాధుర్యముచే నివి తమంతదామే వానిని చేరుచున్నవి." శాంతులు, ఉదారులు, నిర్మల మనస్కులు, విద్యాదాగారముల వంటివారు. వారి సామీప్య సంపర్కముల వలన మనలో నుత్సాహము, యుల్లాసము, విచార రాహిత్యము, మనోవికాసము గలుగును. వారు మానవుని నిర్వీర్యము చేయు దుర్బల గుణ వ్యాలముల కీశ్వర వేరులు. మంచు, చీకటి, సూర్యునిముందు పలాయన మగునట్లు విషాదము వారి సాంగత్యముచే హరించును." మనము సాధింప జాలని దేదియు లేదు. నెపోలియను చక్రవర్తి 'అసాధ్యము, దుస్సాధ్యము' అను పదములు నా నిఘంటువులో లేవు అని చెప్పెడి వాడట. దయార్ద్రత్వము, ఉపకార బుద్ధి గలిగి సంతోషముతో తన పనుల నెవడైనను నెరవేర్చుకొన వచ్చును. 'దరహాసిత వదనము, ద్రవించు హృదయము గలవారు, "అపావృత ద్వారాః" అనగా తెరువబడిన ద్వారములు గలవారు' అని యార్యోక్తి గలదు. అట్టివారి కందరు స్వాగత మిత్తురు.

మానవులే కాదు. జంతువులు, చెట్లు, చేమలు కూడ నట్టి వానిని పసిగట్ట గలవు. ఒకని తోటలో పువ్వులు పుష్కలముగ బూయుచు పకపక నవ్వునట్లుండెడివట. దీనికి కారణమేమని వాని నడుగగ "నేను వాని నెక్కుడగ ప్రేమింతును. వానితో మాట్లాడుదును. కనుక నవి నన్ను ప్రేమించును. నాతో మాట్లాడును." అని తోటమాలి చెప్పిన కథను రామతీర్థస్వామి యుదహరించెను. 'వాని కాలు క్రింద పచ్చగడ్డి కూడ మొలవదు.' అని యనుచుందురు. నిజమే! తృణముకూడ నిన్ను వాసన చూడగలదు. అది నీతో నవ్వును. నిన్ను చూచి తొలగిపోవును. అత్తపత్తి యను మొక్కను మన మెరుగుదుము. దానిమీద చేయి వేసినచో నది వెంటనే ముడుచుకొని పోవును. సంతోషి వగుము, నీవు సంతసించినకొలది యది వృద్ధిజెందును. దాని నితరులకు పంచినకొలదియు నితోధిక మగుచుండును. జీవితము దర్పణము వంటిది. నీవు నవ్వునపుడు నీ జీవిత దర్పణములో నవ్వులే ప్రతిఫలించును. ఖాండ్రించుకొనుచు, చీండ్రించుకొనుచు, జీవించువాడు నరకమును వెతకికొన నక్కరలేదు.

ఆనందము, సంతోషము, నవ్వు అనగా వెకిలితనము గాదు. కాలక్షేపము గాదు. త్రాగి తెయితక్క లాడుట గాదు. భోగములలో మునిగి తేలియాడుట గాదు. 'ఋణం కృత్వా ఘృతం పిబేత్' అనగా అప్పుజేసి పప్పు కూడు తిను చార్వాక మతము గాదు. అది యాంతరంగిక తృప్తి; యాత్మ తృప్తి, ఆత్మవికాసము యొక్క బాహ్యలీల, బాహ్య చిహ్నము. ఆంతరంగిక మాధుర్య లహరి. అంతస్సుఖము. అంతరా

రామము. అంతర్జ్యోతి యొక్క బాహ్యకలకలము. అది పైకి తెచ్చిపెట్టుకొనుచో వచ్చునది గాదు. కడుపులో లేనిది కొనగలించుకొనిన రాదు. కృత్రిమ హాసము, విషపునవ్వు బయటపడుచునే యుండును. సహజ సంతోషము, భాగ్యశాలురకు పెట్టని భూషణము, తొడగని తొడవు. కొఱలేని కోట్లు.

సీ॥ సంతోషి గాడేని శత్రుడైన నశించు
నిర్ధనుండైనను నిద్రబోవు.

ఆ॥ సంతసించెనేని సర్వభూత సుహృత్తు
ములకు బ్రాప్తిలాభ ముదిత మాన
సులకు శాంతులకును సుజనులకును గర్వ
హీనులకును వినతులే నొనరు.

సంతృప్తాత్ములకు భగవంతుడే సపర్యల నొనర్చును. విధేయుడగును. అని పై పద్యము చెప్పుచున్నది. అట్టివానికి సకల కళ్యాణములు వాటంతటవియే చేకూరు ననుటలో నాశ్చర్యమేమున్నది!

"మన మానంద స్వభావమునే దోహదము జేసికొనవలయును. ప్రతి వస్తువులో నుండు శోభనే గమనింప వలయును. దిగాలుపడి కూర్చుని మన శరీర మానసిక యపరిపూర్ణతను గురించి విలపించిన ప్రయోజన మావంతయు లేదు. వ్యతిరేక పరిస్థితులను తరించుటకు జేయు పీరకలాపమే మన కాత్మోన్నతిని చేకూర్చును." అని వివేకానందుడు వేనోళ్ళ చాటినాడు.

ఈ ప్రపంచమును శోభాయమానముగను, సౌందర్యమయముగను చూడగలవారు, అట్లు చేయగలవారు భగవంతుని చూడగలరు. వారే ఐశ్వర్యవంతులు అనగా నీశ్వర సంపత్తి కర్హులు కాగలరు.

# ప్రసన్నత.

'శ్లో॥ ప్రసాదే సర్వ దుఃఖానాం హాని రస్యోపజాయతే, ప్రసన్న చేత సోహ్యాశు బుద్ధిః పర్యవ తిష్ఠతి॥" ప్రసాద గుణము గలవాని దుఃఖము లన్నియు నశించును. ప్రసన్న హృదయుని బుద్ధి యచిరకాలములోనే కుదురుపడును. అని భగవద్గీత నుడువు చున్నది. "ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే." సమస్త విఘ్నములను శాంతింప జేసికొనుటకు మనము ప్రసన్నవదనుని ధ్యానముజేసి శుభారంభములను చేయుదుము. ఇది భావ గర్భితమైన యాచారము. 'శుభారంభము సగము విజయము.' నిండు హృదయముతో, విప్పారిన మోముతో, నిర్మలాంతఃకరణముతో, కళ్యాణాశయముతోనే ఏపనినైనను ప్రారంభింపవలయును. హృదయము నిర్మలముగ నుండవలెను. ప్రసాద గుణము దివ్య గుణము. ఇచ్చుట, విప్పుట ప్రసన్నుల లక్షణము. ప్రేమ వారి కుదురు. వారు నిర్మలులు. నిరాడంబరులు. సుఖ శాంతులను వెదజల్లువారు. వికసిత జ్ఞానముగలవారు. వారి చలువ, వారి కాంతి, తోక చుక్క, మెరుపుతీగెల కాంతివలె క్షణికము కాక స్థిరమై, హృద్యమై, సర్వాంగ శోభితమై యుండును. ఓషధీశుడైన చంద్రునకు, కమలమిత్రుడైన సూర్యునకు, దివారాత్రము లెరుగని ప్రకృతిమాతకు వందిమాగధు లక్కరలేదు. పత్రికా ప్రకటనలు, బిళ్ళ బంట్రోతులు అవసరములేదు. కోరబడకుండగనే విశ్వ

మున కంతకు సుసంస్కృతి యొనరించుటే వారి లక్షణము. ప్రేమ చేతనే ప్రసన్నత హృదయ వైశాల్యత జనించుచున్నది. ఇవియే ప్రసాద లక్షణములు. గృహారాజ్యము నేలు శక్తి ప్రసన్న స్వభావములోనే కలదు. మార్దవము, క్షమ, మధురిమ, ప్రేమ గల స్త్రీకి గల శక్తిలో నూరవ వంతైనను గయ్యాళిగంప కుండ నేరదు. ఒక్క మాచకమ్మ, యొక్క గయ్యాళి, యొక్క తిట్టులమారి, గొక్క చుప్పనాతి, మెటికలువిరుచు నేటి యున్న చాలును! ఆయిల్లు నిప్పక్కర లేకుండగనే నిత్యము భగభగ మండుచుండును. ఆమె తన యింటి సౌఖ్యమునేగాక చుట్టు ప్రక్కలవారి సౌఖ్యమును, శాంతిని, పోగొట్టుచుండును. "నా నెత్తిమీద ననేక భాండములను పగులగొట్టితివి. అంతటితో తీరక వాని ఖరీదు లెక్కించి యడుగుచుంటి వేమిపాపము!" అని యొక భర్త వాపోయెనట. ఒకతెరుగని కోపముగల స్త్రీ పురుషు లున్నచోట వేరొక సర్పరాజ మవసరములేదు. కేవల శరీర సౌష్టవమునే చూచి వరించుకొనుట వెఱ్ఱితనము. అంద చందములు, తళుకుబెళుకులు, బుద్ధివిశేషము గల కోపనకంటె ధరిత్రీదేవి వలె నొక్క క్షమాగుణము, మృదుభాషిత్వము, సహజ స్నేహరసాలత గల యువతినే దేవిగా స్వీకరింప దగును. 'పోరు నష్టము పొందు లాభము' అను సామెత నెరింగియు దానిని పాటింపక పాడైపోయిన సంసారము లెన్నియో కలవు. ఒక కుటుంబము లందు. ఈ కుటుంబమున కర్థబల అంగబలములకు లోటు లేకుండెను.

వంశము కూడ ప్రసిద్ధిచెందిన వంశమే. కాని యీ యింట నున్నవారిలో సౌమ్యత, పొందు, మృదుత్వము లేక పోయి సౌఖ్యమే కాక, సద్ధర్మముకూడ భ్రష్టమై రెక్కలుకట్టుకొని పారిపోయెను. ఇంటనున్నను, బయటనున్నను, సంఘములో నున్నను, సంసారములో నున్నను, ప్రసన్న ప్రసూనములనే వెదజల్లుచుండవలెనని మార్డెను వ్రాయుచున్నాడు. సౌమ్యత, సమరస భావము ఆయురారోగ్యములను పెంచును. మనస్సే శరీర మగుచున్నది. కనుక మానసిక స్థైర్యమే శరీర స్థైర్యము. మనస్సును స్వాధీనపరచుకొనలేక మనము ప్రవర్తించు పిచ్చికోప మనేక వత్సరముల యాయుర్దాయమును తగ్గించి శరీరముమీద శాశ్వత చిహ్నములను కలుగజేయునని వైద్యులు చాటుచున్నారు. 'వానికి కోపము ముక్కుమీద నుండును' అందుము. కోపమున కొక స్థానముకూడ నిరూపింపబడెను. అంతేకాదు. ఒడలు కందగడ్డవలె నెఱ్ఱబడుట, నాలుక బయటబెట్టుట, తిట్లు తిట్టుట, జుట్టు విరబోసికొనుట, చేతులు బారలు చాచుట, చిందులుత్రొక్కుట, ఎదుటనున్న వస్తువులనే విరుగగొట్టుట, చేతికి దొరికిన దానితో తననో ఎదుటవానినో గూడ బాదుట— ఈ పిచ్చిచేష్టలన్నియు కోపముయొక్క లక్షణములు. కోప మెట్టి విషద్రవ్యము గలిగింపజాలని చెడుగులను కలిగించును. అట్టి సమయమున చేతనొక అద్దమున్నచో కోపి తనరూప మెట్లుండెనో చూచుకొనగలడు. అట్టి రూపము నెవడు ప్రేమించును? ఒకరి మాటేల? తానే

ప్రేమింపజాలడు. లాలిత్యము, సౌకుమార్యము, మార్దవము, సౌందర్యము, యవ్యాజప్రేమముల కాలవాలము కాదగు స్త్రీల కది యసలే తగదు. వెర్రికోపము నాడీ జగిని, బిగిని సడలింప జేయును, శుష్కింపజేయును. నేత్రకాంతి, వికాసము తరిగిపోవును. ముఖమే మనోదర్పణము. కోపి ముఖ లక్షణములు వానిని ప్రపంచమునకు చాటుచుండును. భోజన సమయమున నెట్టి కారణములకు కోపింపరాదు. కోపించుచు శపించుచు తిను తిండి విషతుల్యమని వైద్యులు కనిపెట్టిరి. కనుకనే భోజనోత్సుక వేళ పదిమందితో సంతోషముగ భుజింపవలెను. కోపముగా నున్నపుడు తల్లి బిడ్డలకు పాలీయరాదు. కోపము వలన నమృతము గూడ విషమగును. కోపమున కంతముండదు. అది మందముగనే ప్రారంభమై పెఱచెఱ పైకెగబ్రాకి గొప్ప తెగకపోవును. బిడ్డలను తిట్టి, తిమ్మి, కొట్టి, యంతటితో నూరుకొనక నేలపై బడవైచి యీడ్చి చివరకా యావేశముతో మూర్ఛనొందువారు గలరు. నేనొక స్నేహితుని యెరుగుదును. ఆయన భార్యను దూదేకినట్లు యేకి, ఆ గాయములను మాన్పుటకు కలకత్తానుండి మందులు తెప్పించెడివాడుట. ఆ యింటి ఐశ్వర్య మెగిరిపోవుటను గూడ జూచితిని.

మానవుడు సుఖ శాంతులను, శరీర స్వాస్థ్యమును కోరుచుండును. ఇవి లేనివాడు, లేని గృహము తుమ్మలలో పొద్దు గ్రుంకినట్లుండును. స్థిరమైన శాంతియే మానవుని కానందమును, ఆదర్శ ప్రాయమగు గృహమును ప్రసాదింప గలదు.

అట్టి యిల్లు పూరిల్లైన నేమి? నే నొక గృహమును జూచితిని. ఆ యింటి వారందరు నిమ్మకు నీరుమోసినట్లు ఎవరి పనులు వారు చేసికొనుచు, శాంతి దాంతులను వెదచల్లు చున్నట్లుందురు. ఆ యింట గావు కేకలు, పెడబొబ్బలు, గడబిడలు, తిట్లు, చిర్రు బుర్రులు, సాధింపులు, దెప్పుళ్లు మొదలగు క్షుద్రకాండ మచ్చు కైన కానరాదు. ఆ యింటి దంపతులు సహస్ర మాస జీవులై వారి యైశ్వర్యము తామరతంపరయై సమస్తభోగముల ననుభవించి యుమామహేశ్వరుల వలె నానంద భాక్కులై చిరంజీవులై పురుషాయుషము ననుభవించిరి. తియ్యని మాటలు సరస సల్లాపములు, మృదూక్తులు, ప్రేమ చిలికించు వినయ విధేయతలు, సౌహార్ద్రత గలవారి సమక్షమందు విచారములు, మనఃఖేదములు తొలగిపోవును. వారి సమక్షమున మానవులకు దివ్యత్వము సిద్ధించును. గారడివాని మాంత్రికము వలె వారి నవ్వులు మనలను మార్చివేయును. ప్రసన్నతా దూరులై కోతి చేష్టలు చేయువారికిని వీరికిని నక్కకు దేవలోకమునకు నున్నంత భేద ముండును. వీరున్న చోట నిష్పంక నక్కర లేదు. గుడ్లగూబ ముఖము వలె వీరి ముఖములు ముకుళించుకొని యుండును. వీరు వెలుగును చూడజాలరు. లోకములో వీరికి మంచియే కాన్పించదు. అవిశ్వాసము, స్వార్థము, యీర్ష్య, అసహనము మొదలగు నమానుష వికారము లన్నియు కలిసి కరడు గట్టిన మానవ రూపములో నిట్టి వికార మూర్తులను కల్పించు చుండును. వీరి మధ్య నున్నచో నుత్సాహము, తెలివితేటలు,

భావసంపద శోషించి పోవును. వీరు నోరు విప్పుదురా, తేలు కొండె నాడించినట్లు యుండును. ఈ రసహీను లెవరినో యొకరిని పొడువకుండ మాట్లాడజాలరు. లోకములో నెవ్వరును వీరికి నచ్చరు. వీరి సూటిపోటి మాటలు కంట్లో కారము పెట్టినట్లే యుండును. వీరి సరసము దూలగొండి సరసము. వీరికి దోషమే తప్ప, గుణము కాన్పించదు. వీరికి సూర్యుడు వేడియైన వాడు. చంద్రుడు చల్లని వాడు. సముద్రము లోతైనది. పర్వతము లెత్తైనవి. కనుక నివి యన్నియు లోప భూయిష్ట ములే. తాము తప్ప ప్రపంచములో వీరికి యోగ్యులే కాన్పించరు. తామే శిష్టాది గురువులు. తాము లేని లోకము తుచ్ఛ లోకము. కనుక దేనిని మెచ్చుకొనలేని వీరు సత్త్వలను చెంద నాడు కొందురు. చివరకు ప్రపంచ మంతయు వీరికి విషాద సాగర మగును. అది వారి కల్పనయే. మార్డెను ఒక కన్యను గురించి యిట్లు వ్రాసెను. "ఆమె శరీర మతి యంద వికార మైనది. అవయవ సౌష్టవమా! బొర్రముక్కు, చింతాకుల వంటి కళ్ళు, దాక వంటి నోరు; కురూపితనమును వెల్లడించు చుండెను. కాని యామె తన బాహ్య వికారమును మఱపించు శీలసౌష్టవమును సాధింప బూనెను. చిత్రము! అట్టి కురూపము గల కన్యలు దుఃఖమయ ప్రపంచమును సృష్టించుకొని జీవితము నతి భారముగ గడపి విషాద జీవితము లనుభవించెడివారు. ఆమె వినయ వివేకాది సద్గుణముల వలన సాధు సౌహార్ద్ర సంపద వలన, ప్రతివాడు ఆమె బాహ్యాకారమును మరచిపోవు

చుండెడివాడు. ఆమె మృదూక్తుల వలన, మనః ప్రసాదము వలన, ప్రతివాడు ముగ్ధుడగుచు నాకర్షింపబడు చుండెను. ఆమె మాట్లాడ మొదలిడినప్పుడు మనతో లీనమై యుదార చరితులకు వసుధయే కుటుంబ మనునట్లుండును.

చర్మ సౌందర్యము నేడుండి రేపు పోవును. అది యే స్వల్ప వ్యాధికైన గురియై తొలగిపోవచ్చును. ముదిమిచే ముడు తలు పడిపోవచ్చును. కాని యీ భావ సౌందర్య మట్టిది కాదు. ఇది లోతైనది. శరీర వ్యాధులు దీని నేమియు చేయజాలవు. అవి యిట్టి శీల సౌందర్యవతులను జూచి మృగరాజును జూచి పారిపోవు శృగాలములవలె పలాయన మంత్రమును పఠించును. ఈ యందమును వీరు వారను భేదము లేకుండ నందరు నలవడ జేసికొనవచ్చును. వయసు, కులము, వృత్తి దీనికెట్టి యాటంకము గలిగింప జాలవు. ఇది యొకరి గుత్తసొత్తు కాదు. ఇది యెన్నడు తరుగదు. వాడిపోదు. ఇది తోడివారిని గూడ సంతోష మగ్నమానసుల జేయును. ప్రసాద గుణము లేనివారు, పిడికిలి విప్పనివారు, యున్నకొలది చేతికొలది దానముచేయనివారు, డబ్బు సంచులను కాయు వేగడములు, దిష్టిపిడతలు నగుదురే కాని నిజమైన ఐశ్వర్యవంతులు కాజాలరు. ఇచ్చుట, ఇవ్వగలుగుటలో నున్న యందము, ఆనందము, ఇవ్వకపోవుట, ఇవ్వజాలక పోవుటలో నుండజాలదు.

"ఆదిక్ శ్రీసతి కొప్పుపై, దనువుపై, అంసోత్తరీయంబుపై, బాదాబ్జంబులపై, గపోల తటిపై, బాలిండ్లపై నూత్న మర్యాదం

జెందు కరంబు గ్రిందగుట, మీఁదై నాకరంబుంట మేల్ గాదే రాజ్యము, గీజ్యముల్ సతతమే కాయంబు నాపాయమే!’’ యను బలిచక్రవర్తి కీర్తి నేటికిని గలదు కదా!

నేలమీఁద పడినప్పుడే యొక గింజ పదిగింజ లగుచున్నది. చేతిలో నున్నంతసేపు దానికి వృద్ధియే లేదు. తానిచ్చినదే తనకు మిగిలె ననియు తక్కిన దంతయు నష్టము, భ్రష్టము నయ్యెననియు, నొక వదాన్యుడు బల్కెను. దీనినే ప్రకృతి చాటుచున్నది. ప్రవాహ పల్వలోదంత మిదియే. ఇచ్చెదవా, వృద్ధి నొందెదవు. దాచెదవా, పాసిపోవును. విశ్వమీ సూత్రముపైనే యాధారపడి యున్నది. గులాబి తన సౌరభమును దాచి పెట్టుకొన నిశ్చయించి వికసింపకుండినచో దానికా శోభయే లేదు. తన స్వల్ప సౌరభమును ప్రపంచమున కర్పింప బూనినప్పుడే దాని కెక్కడ లేని సంపద చేకూరెను. ప్రకృతి యద్దై నిన్ను, నీ గుణములను ప్రతిబింబించు చుండును. నీ ప్రతిఫలమునే నీవు పొందుచుందువు. ఉపకార బుద్ధి యమూల్యమైనది. ప్రతిదినము, లేదా అవసరము దొరకినప్పుడెల్ల నేదో యొక యుపకారము, మంచి కార్యము, చివరకు మంచి మాట, మంచి సలహా, ఇచ్చు గుణము నభివృద్ధి చేసికొన వలయును. అట్టి బుద్ధి యున్నచో నవకాశము లనేకములు వాటంతటవియే సమకూరును. తిండిలేక నకనక లాడువారు, గుడ్డ లేనివారు, అంగహీను లైనవారు, దుశ్చేష్టల పాలై చెడిపోయిన వారు నెంతమంది లేరు! ఒక చల్లని వాక్కు, చివరకు నీ కృపారస

దృష్టి చిక్కినంత మాత్రము చేతనే వారి భారములు, చింతలు తేలిక యగునే! ఇట్లు చేయుట యొక ఘనకార్యమని తలంప తగదు. "మన మెల్లపుడు మంచినే చేయవలెను. పరోప కారము చేయగలుగుట దైవప్రసాదము, భాగ్యము. మేరువు నెక్కిన వానివలె నిక్కుచు, చేత నాల్గు పైస లుంచుకొని 'యిదిగో దరిద్రుడా!' యని విసరి కొట్టకుము. నీ కొక బీద వాడు లభించి నందుకు కృతజ్ఞుడ వగుము. వానికి సహాయము చేయుటచే నీకు నీవే సహాయము చేసికొను చున్నావు. ఇక్కడ పుచ్చుకొనువాడు గాక, దాన మిచ్చువాడే ధన్యు డగుచున్నాడు. నీ దయను దాతృత్వాదులను ప్రపంచమునకు చూపగలిగి పవిత్రుడవు, పూర్ణుడవు నగుట కవకాశ మిచ్చిన వారి నభినందించుము." అని వివేకానందుడు కర్మయోగ రహా స్యమును చాటెను. జీవన్మృతు లెవరు? అని యక్షుడు ధర్మ రాజు నడుగగా "దేవాతిధి పితృ భృత్య జనావళులకు నిడక కుడుచు నత డని చెప్పెన్" ఇతరు లెవరికి చేయి విదపక తిను వారు జీవించియు మృతిజెందిన వారిలో లెక్క. ఈవి, ఈవి, ఈవియే నీ లీల యగుగాక! ఈవితో పాటు నీ హృదయము ద్రవింప వలెను. ముఖము తేజరిల్ల వలెను. ప్రపంచము నీ ప్రేమనే చూరగొన నిచ్చగించును. "నీ మార్గము పొడుగున నీ హృదయ నవనీతమును, శీల గుణాది విరిజాజులను జల్లు కొనుచు పొమ్ము. తిరిగి నీవీ మార్గమునే వత్తువని భావింప కుము." అని మార్డెన్ మహాశయుడతి సరసముగ రచించెను

నీకీ జన్మ మరియొకసారి సంభవింపదు సుమా! సామాన్యముగ నీ ముఖలక్షణము లెటులుండునో చూచుకొనుము. "అది యతని ముఖార విందము" అను సామెత నీవువినలేదా! అర విందము లాలిత్యమునకు, మృదుత్వమునకు, సుగంధమునకు, నవ నవత్వమునకు చిహ్నము. నీముఖము ముడుచుకొని, కళా విహీనమై శోభించని కొరివి వలె నసహ్యముగ నుండునా? కరుణారసము లేక నుదారాశయ శూన్యమై, క్షమారహితమై పిడకదిమ్మవలె నుండునా? కాట్లకుక్క ముఖమువలె దురా శాగ్రస్తమై, కామ దుర్గంధ పూరితమై, సమస్తము నొల్లు కొను ద్రాపిచిహ్నములతో నుండునా? నీ స్నేహితుల మధ్య, పరిచారకుల మధ్య, నీ గృహాంగణమున నీవెట్లు చరింతువు? తర్జన భర్జనములు, హుంకార ఝుంకారములు, కోప తాపములు, రుసరుసలు నీ నిత్య కలాపములా? అవియే నీ సాధన సామగ్రియా? లేక మిత్రభావము, సరస సల్లాపము, నగుమోము, మృదూక్తులు, నీ పరిచర్య చేయుచుండునా? నీవు సంఘములో నున్నపుడు సంతోషముతో ప్రజలు నిన్ను చేరుచుందురా? చిన్నపిల్లలు నిన్ను చూచి పిల్లలకోడి చుట్టు చేరునట్లు చేరుదురా! లేక గ్రద్దను చూచి బెదరునట్లు బెదరు దురా? మొదటిది దివ్య లక్షణము, రెండవది యాసుర లక్షణము.

ముఖము మనో దర్పణము. నిత్య సంతోషి సమస్తము నాకర్షించును. నేనొక స్నేహితురాలి నెరుగుదును. ఆమె

బహుకుటుంబిని. భర్త గడింప సమర్థుడైనను గడింప నొల్లని జీవితమును వరించెను. వచ్చిపోవు కొంప, అదియు పూరిల్లు. కట్టు గుడ్డలా సామాన్య దుస్తులేగాని చీని చీనాంబరములు గావు. శరీరమున పట్టుమని యొక నగయైన లేదు. ఉన్న వది వరకే చెల్లిపోయెను. తదన్నము తద్రసమేగాని విశేష భోగములా లేవు. పండ కొయ్యమంచములే గాని హంసతూలికా తల్పములు గావు. కాని యా యిల్లాలు ముఖ మెల్లపుడు కల కల లాడుచు నిండు దనమునే ప్రకటించు చుండెను. ఇరుగు పొరుగమ్మ లామెను జూచి "ఎంత నిండుదనము. ఎంత అదృష్ట వంతురాలు" అని మెచ్చుకొను చుండిరి. చంటిబిడ్డ చావు బ్రతుకులలో నుండెను. ఒకప్పూ డాశ లేకుండెను. మరియొక బిడ్డ నిండుచూలాలు, ఇంతలో పోలీసు అధికారి యాగమనము. వీరి రాక యా యిల్లాలికి క్రొత్త గాదు. వచ్చిన యధికారి తెల్లబోవుచు విచారము నటించుచు 'అమ్మా! విధిలేక మా ధర్మమును నెరవేర్చు చున్నాము." అనెను. "వారి ధర్మము వారు జేసిరి. మీ ధర్మము మీరు జేసికొన వచ్చు" నని స్మితాననయై చెప్పుచు తన ధర్మములో మగ్నమై యామె భర్తకు కావలసిన వన్నియు సమర్చి బంపెను. "తండులాలు ఇంటిలో నసంతి తిండికై తే పదిమంది వసంతి" ఇంటిలో బియ్యము లేవు. తినువారు పదిమందికలరు. అయినను ఆమె ఆ వంతయు ఖేదము జెందలేదు. ఆమె తొణకదు, బెణకదు సరికదా ఇంటినిండ పిల్లలుండుటచే తాను కూడ భర్త ననుగమింప జాలకుండుటచే విచారించెను. రావలసిన పైకము లేదు.

ఇవ్వవలసిన చోట రొక్కించి యడుగ నారంభించిరి. అయినను ఆమె హిమగిరి వలె చలింపకుండెను. ఈ చిక్కులలో నే నామె నొకసారి పలుకరించి యామె నోదార్ప దలచితిని. కాని యోదార్చు టెవరిని? "అన్నియు చక్కబడ గలవు. నాకెట్టి లోపము లేదు. నా నమ్మిన దేవుడే నాకు గలడు." అని యామె చెప్పినపుడు నా కన్నులనుండి యానందాశ్రువులు కారదొడగెను. ఒడలు పులకరించెను.

చిత్రము! కష్టములు కలకాల ముండనన్నట్లు మంచు విరిగిపోయినట్లు విరిగిపోయెను. చంటిబిడ్డకు చక్కని యారోగ్యము గల్గెను. పెద్దబిడ్డ సుఖప్రసవ మయ్యెను. ఊసరక్షేత్రములు ఫలవంతము లయ్యెను. భర్త సంతతారోగ్యవంతుడై సుఖముగ నిల్లు చేరెను. ప్రసాద గుణము సుఖము నాకర్షించును. అశుభమును తొలగించును. మానవుని కంతరంగ సుఖము వంటి సుఖము రసాయన పానముచేతగాని లక్ష్మీదేవి నాలింగనము చేయుట చేత గాని గల్గజాలదు. "తాపసుల కంటెను వివిధ విషయముల నెక్కువగా నెరిగినవారి కంటెను, యజ్ఞముల జేసిన వారికంటెను, రాజుల కంటెను, బలవంతుల కంటెను, గుణాఢ్యుల కంటెను, శమాన్వితుడే యెక్కువగా ప్రకాశింప గలడు" అని యోగవాసిష్ట ముద్ఘోషించు చున్నది.

సంతోషమునకు, దుఃఖమునకు ఆస్తి, కుల గోత్రములు, హోదా, పరివారములు, వృత్తి విశేషములు కారణములు కాజాలవు. ఒకే యాస్తి, ఒకే తల్లిదండ్రులు నొకేచోట పనిచేయు వారిలో నొకడు సంతోషి మరియొకడు దుఃఖి కావచ్చును. దీనికి మనస్సే కారణము.

సంతోషము బాహ్యపరిస్థితుల మీద నాధారపడదు. సౌధ సీమలలో ద్రోహములు, కూనీలు, ఆర్తరావములు పర్ణ కుటీరములలో సుఖాలాపములు కిలకిలా రవములు ఆశ్చర్యములు కావు. హృదయ సంపదను అంతరంగ శాంతిని మించిన సుఖము, విభవము లేవు.

# అంతరంగమే బహిరంగ మగును.

'యద్భావం తద్భవతి' యనునది సుప్రసిద్ధ ఋషి వాక్యము. యనుభవ ప్రేరిత వాక్యము. నీ వెట్లు భావింతువో యట్లు జరుగును. భావమహిమ యత్యద్భుత మైనది. "శుభాశుభములు నీ మనః కల్పితములు గాని వేరొండు కావు" అని ఆంగ్ల కవి శేఖరుడు షేక్స్పియరు వచించెను. అనుభవము, శాస్త్రము యీ ప్రవచనమునే సమర్థించు చున్నవి. నీ గుణమును బట్టియే, నీ నడతను బట్టియే, నిన్ను బట్టియే నీవీ ప్రపంచమును జూతువు. కొలచెదవు. నిన్నే నీవు చూతువు. చూడగలవు. నీ యాంతర్యమే నీ బాహ్యజీవితముగ మారును. అంతేగాక బాహ్య ప్రపంచకమున నీవు జూచు సమస్తము నీ మానసిక వర్ణములతో చిత్రింప బడుచుండును. మార్కస్ అరీలియస్ అను రోమన్ చక్రవర్తి "నా తాతలు, గురువులు, తండ్రి పినతండ్రులు, తల్లులు, భార్యాపుత్రులు, స్నేహితులు, పరిచారకులు, మంత్రులు వీరు వారనేల! నే నెంతవరకు పోయిన నంతవరకు నాకందరు మంచివారే దొరకుట నా భాగ్యము." అని వచించెను. యదార్థ మేమన అతని హృదయము మంచిది. నవనీతము వంటిది. మధు పూరితమైనది. కనుక నది యతనినే కాక యతనితో సంపర్క మున్న ప్రతి వానిని యట్లే చూడగల్గెను. వారి నట్లు మార్చివేయ గల్గెను. దానిలో నతని ప్రపంచ మంతయు, శోభాయమాన మయ్యెను. సౌందర్యపూరిత మయ్యెను.

"అందరు నన్ను ప్రేమింతురు. కనుక నే నానందాబ్ధిని తేలి యాడుదును." అని యొక కన్య చెప్పినట్లు మార్డెన్ మహాశయుడు వర్ణించినాడు. విచార మెందుకు కలుగవలెనో యామె కర్థము గాకుండెనట! ఆమె యందరిను ప్రేమించును కనుకనే యామె నందరు ప్రేమింతురు. ఇది యొక యనుల్లంఘనీయమైన ప్రేమ శాస్త్రము. వ్యక్తావ్యక్త శాస్త్రము. ఆమె పొలమునకు పోయి ప్రకృతిలో లీనమై సంతోషము పట్టలేక చెప్పట్లు చరచుచు జీవించి యు డినందులకే మురియు చుండెను. చెట్టు, పుట్ట, పక్షి, పులుగు, పువ్వు, కాయి, సమస్తము "సంతోష వంతురాలవు కమ్ము" అని యామెను దీవించు చున్నట్లుండ నట! ఇది ప్రకృతి రహస్యము. ఇది యందరకు వర్తించు శాస్త్రము గాని యేకొందరకో మినహాయింప బడినది కాదు. ఇది నీ జన్మహక్కు. ప్రతివ్యక్తి, ప్రతి వస్తువు, ఒక దివ్యత్వ చిహ్నమే! సత్య దృష్టితో, నిర్మల దృష్టితో, కల రూపుతో పాపరహిత దృష్టితో మనము ప్రతి వస్తువును, విషయమును, తిలకించినచో మన మలవాటు జేసికొనిన వక్రదృష్టి, పాపచింత పలాయనమగును. మన మెట్టి వికారములు లేనివార మైనచో జీవితములో సంతతానందమునే బడయగలము. సుఖమే చేకూర గలదు. దుఃఖము, కాలుష్యము, చిరాకు, విసుగు, అశాంతి, చిందులు ద్రొక్కుట, —ఇత్యాదులు మనః కల్పితములు, స్వయం కృతములు.

సస్య శ్యామలము, ఫలపుష్ప భరితము, స్వాదు జల పూరితము కోకిలారవ సంయుతము, నిత్య వసంతోదయ చిహ్నితములగు గ్రామసీమలకు పరుసుదనము, పెళుసుదనము, పెటుకుదనము, స్వార్థపూరితము, లోభ గ్రస్తము నగు ముకుళిత ముఖములకు పొందు కుదుర నేరదు. అది యసమంజసము. అట్టి భగవన్నిర్మిత సౌందర్య చిహ్నములను దూరీకరించు దుర్భాలు జీవిత రహస్య మెరుగని మొరకులు. భగవదృష్టిలో, సామ్యదృష్టిలో, నిట్టి వికారములకు తావు లేదు. ఈ వికారములు సృష్టికి వ్యతిరేకములు. నీవు కల్పించిన విశ్వామిత్ర కృతములు! ఈ సృష్టిలో నేదేని చెడుగు కలదేని యది చెడ్డ భావముల వలన చెడ్డజీవితము వలన సంప్రాప్త మగుచున్నది.

"పవిత్ర హృదయులు మాత్రమే భగవంతుని అనగా మంచిని చూడగలరు" అను సత్యమును గ్రహింప జాలనివారు కన్నులుండియు చూడనేర్వని వారు. నిష్కల్మషము, పరిశుద్ధము, పాప రహితము. నగు మనస్సే కలరూపు గ్రహింప గలదు; శోభను గ్రోలగలదు. 'చెడుతలంపు, చెడుజీవితము, చెడుదృష్టి నిన్ను భగవంతుని వేరుచేయు నడ్డుగోడ లేక తెర.' వీనిచేతనే నీవు విషయములను, తత్త్వతః అనగా యున్నవాని నున్నట్లు చూడజాల కున్నావు. భగవత్సృష్టిని యథాతథముగా జూడగోరినచో పై తెరలను తొలగించు నొక్కటియే మార్గము. "నాన్యఃపంథా అయనాయ" సుఖమునకు వేరొక మార్గము లేదు. ఇతరులకు విఘ్నము గల్గించుట, వారిని వెను

కకు నెట్టివేయుట, వారిని కొట్టి తన పొట్ట నింపుకొనుట, వారిపై యధికారము చలాయించుట, వారి నాశనముపై తన బాగు నిర్మించుకొనుట మొదలగు కపట, స్వార్థ కలాపము తొలగినగాని నిర్మలసత్యము ప్రకటితము కాజాలదు.

ఈ ప్రపంచమును ప్రతివాడు తన దృష్టితోనే, తన భావములతోడనే, తన వికారములతోడనే చూడగల్గును గాని యన్యథా చూడజాలడు. మనము చూచు దృశ్యము మన చూపు లనెడు రంగులతోనే కాన్పించును. మన చేష్టలు, యూహలు, భావములు, వికారములు వాని కన గుణములగు రంగులనే చూపును. కామెరలు గలవానికి లోకమంతయు పచ్చగనే కాన్పించును. వెర్రివానికి లోకము వెర్రిదే యగును. గ్రుడ్డివానికి చంద్రుడు మట్టిముద్ద. కాముకుడు చెట్లలోను, పుట్టలోను, తన ప్రియురాలినే చూచును. దొంగకు ప్రపంచ మంతయు చోరప్రపంచము. సంశయాత్మున కంతయు సందేహమే! ద్రోహి సర్వత్ర ద్రోహమునే చూచును. పాపి కంతయు పాపమయమే! వ్యభిచారికి లోక మంతయు తన వలెనే కాన్పించును. కనుక వీరెవరు లోకమును కల రూపుతో చూడ జాలరు. పై స్వార్థవాసనలు, చీకటి తెరలు, దుర్గంధ భావములు పూర్తిగా తొలగిపోవలెను.

కళ్యాణమునే గ్రహించుట యొక కళ. దీనిని గుర్తించి సాధన జేసినచో నీకీ ప్రపంచమే మారిపోవును. సౌందర్యమును కళ్యాణమును చూచు కళ నొక్క వత్సరము నిత్యానుభవములో

పెట్టెచూడుము. నీ జీవిత మత్యద్భుతముగా మాఱిపోవును. నేడు నీకు ద్వేషమైన దపు డాకర్షణీయ మగును. నే డుత్సాహ శూన్యము, రసహీనముగ నున్న దపు డానందమయ మగును. అంధకారము, సూర్యకిరణము ఏకకాలమం దెట్లు పొందుగల్గి యుండగలవు?

ఎంతటి చీకటియైన నేమి? ఒక్క కిరణము దానిని పోగ్రోలుట లేదా? సూర్యుడు జగన్మిత్రుడు, ప్రత్యక్ష దైవము అని పిలువబడుట కిదియే కారణము. చీకటిలో నేదియు మొలుచుట లేదు; జీవించుట లేదు. అజ్ఞానములో జీవితాశాంకురము వృద్ధిజెందదు; పల్లవింపదు, కుసుమింపదు, ఫలింపదు. నిత్య సంతోషులను చూచి మన మెంతయో ముచ్చట పడుచుందుము. వారు మనల నాకర్షింతురు; మనలో నాశాజ్యోతిని రగుల్కొల్పుదురు. మానవ ప్రకృతియందు విశ్వాసమును పురికొల్పుదురు. ప్రొద్దు తిరుగుడు పువ్వు సదా సూర్యాభిముఖమై యుండునుగదా! నీకీ జీవిత రహస్య మేల తెలియదు?

ముఖము కొంచెము జేవురించిన చాలును. పిల్లలు నీయొద్దనుండి పారిపోవుదురు. నే నొక యుపాధ్యాయుని యెఱుగుదును. అతనికి "పిల్లలపులి" యని పేరు. పిల్లలను గిల్లుట, ముఖము కందగడ్డ జేసికొనుట, బండబూతులు తిట్టుట, కొట్టుట— ఇవి యాయన విద్యావిధానములో నొక భాగము. మొద్దబ్బాయిలను తయారుచేయుట కింతకంటె సులభమైన మార్గము లేదు. ఏ యింట యిట్టి "పిల్లలపులు"

లుందురో, ఏ చదువు యిట్టి వారి చేతులలో నుండునో యది నదీపాత మైనట్లే భావించుకొనవలెను. ఇట్టి వారు సంఘమునకు తెలియని యపరాధము జేసిన వారగుచున్నారు. కనుక ఇది మరింత దూష్య మగుచున్నది.

ఎవనికి వాడు తన ప్రపంచమును, తన పరిసరములను, పరిస్థితులను, తానే సృజించుకొనుచున్నాడు. మన దుఃఖములు, బాధలు, కాయ క్లేశములు మన యరిమిత్రాళ్ళు మనమే నిర్మించుకొని తెచ్చిపెట్టుకొని వాపోవుచు దీనికై యితరులపై నింద మోపుదుము. మన స్వయంకృతాపరాధమును గ్రహింపనొల్లము. ప్రపంచములో తోమ్మిది చిత్రము లున్నవని చెప్పుదురు. ఇది పదియవ చిత్రము.

"స్వచిత్త పంక మగ్నానాం స్వనాశాయ నిర్మణాం।
మూర్ఖాణా మాపదం దృష్ట్వా ప్రరుదం త్యుపలావపి"

"తన యూహాలు, తలంపులు యనెడి బురదలో మునిగి స్వనాశము తెచ్చిపెట్టు కర్మలను చేయుచు దుఃఖించు ఆర్తుని జూచి రాళ్లు కూడ విచారించుచున్నవి." అని యోగ వాసిష్టము చెప్పుచున్నది.

"అబ్బే అంతయు పాడైపోయినది. ప్రపంచము విధము చెడ్డది. అంతయు నవినీతి, దుఃఖము, దురాశ, అంతయు పాప భూయిష్టము. ఇంకే మున్నది? రోగాలము దాపురించినది. జీవించుట యనర్థము." అని జల్పింపనేల? ఇది విషాద లక్షణము. నైరాస్య లక్షణము. నిరాశావాదు లెన్నడు

ప్రపంచము నుద్ధరింప నేరరు. ప్రపంచము నటుండనేల! తమ్మే యుద్ధరించుకొన జాలరు. ఆధివ్యాధులచే, నవిశ్వాసముచే, మనో మాలిన్యముచే, రసవర్జిత జీవనముచే రూపుచెడి కుంటు వడిన మానవుని వాని కృత్యములను మాత్రమే చూచువారు భూమికి బరువుచేటు. భూదేవి యట్టివారిని చూచి యాక్రోశించును. ఆశాజ్యోతిని, శాంతిని, చల్లదనమును ప్రసరింప జేయు వారెంతమంది యున్నను చాలదు. అట్టి వారే నాగరికతను సృష్టించిరి. వృద్ధిపరచిరి. ప్రపంచములో నున్న మంచి కట్టివారే కారకులు. ప్రస్తుతమును విస్మరించి, వర్తమానమును గురించి యొక మంచి మాట, సలహా చినుకొక్క చినుకుగవు ప్రసాదింపక భవిష్యత్తును, పరమును గురించి మాటల కోటలను నిర్మింపజూచుటయే మానవ విషాద పర్వము. ఇహము లేని వానికి పరము లేదు. ఇహమే లేనపుడు పర మెక్కడనుండి వచ్చును? పురమే లేనపు డంతఃపురమా? మృత్యువో యమృతత్వమో, సంతత శాంతియో, నిరతిశయానందమో, సుఖపరంపరయో, సుఖావగాహనమో, కీర్తియో, శాశ్వతాపకీర్తియో, బంధనమో, మోక్షమో, యిహ వర్తనము మీద గాని మరియొక చోట నిర్ణయింపబడ జాలదు. ఇహము పరమునకు విరోధము కానక్కర లేదు. ఎప్పటికైనను శరీరమే, యిహమే, పరసాధనకు రంగభూమి కావలెను గదా! ఇచ్చటనే పరమును సాధింప వలెను.

పర మనుదానికి పునాది యిహమే. నేల విడిచి సాము లేనట్లిహము విడిచిన పరము లేదు. ఇహపరములు రెండును లేకుండ, చేసికొనుట కిహమే రంగస్థలము. అంతరంగమున నున్నదే బహిరంగమున ప్రకటిత మగుచుండును. మన యుల వాటులు, చేష్టలు, యూహాపోహాలు కార్య రూపము దాల్చును. శరీరమున, ముఖమున, జీవితమున ప్రతిఫలించును. ప్రతి బింబించును. "నీవు దేనిని విత్తుదువో దానినే కోసి కొందువు." ఈతగింజకు తాటిమొక్క మొలవ నేరదు. ఇది యే జీవిత శాస్త్రము. అవక్ర క్రమము.

ఒకొక్కవ్యక్తి ఏది చేబట్టినను బంగార మగు చుండును. అతె డెక్కడికి బోయినను నే పని బూనినను విజయమే చేకూరును. అతని కందరు మిత్రులే, చేయూత నిచ్చువారే, విజయము ముందరా! అతను ముందరా! యను నట్లుండును. ఇంకొక డేది చేపట్టినను భగ్నమే. ఎక్కడికి పోయినను "సున్నపు పిడతలే" అతని కందరు శత్రువులే! ఈ శత్రుత్వ మెందుండి బయలుదేరెను? అతని ముందర జ్యేష్టా దేవత, యినుప గజ్జెల తల్లి నడుచుచుండు నందురు. ఇది నిష్కారణమని గాని, యింకొకని చైద్యమని గాని యను కొనుట వెఱ్ఱితనము. శాస్త్ర విరుద్ధము.

గ్రీకు పురాణములలో Echo ప్రతిధ్వని, యను దేవత కలదు. ఆమె నీ భావములనే ప్రతిధ్వనించు చుండును. చెట్టు చేమలు లేని బయలులో నుండి నీ వే కేక వేసిన యా కేకయే

వినవచ్చునని నీ వెరుగవా? 'ఇదియే ప్రపంచ ధర్మము.' ''యథా అంతరే తథా బాహ్యే.'' అంతరంగమే బహిరంగమగును. అంతరంగమున లేనిది బహిరంగమున నెట్లు తటస్థించును? నీ మనస్సులో నున్నదే నీ ముఖమున తాండవించును. నీ ముఖము సూచించినదే యీ లోకము నీకు ప్రసాదించును.

ఒక మిత్రుడు కలడు. అతడు త్యాగి. కష్టజీవి. శ్రమ పడగలడు. సాహసము, చొరవ, ముందు కురుకు స్వభావము గలవాడు. కాని తనంతటి వాడు లేడని, తను తప్ప అందరు అల్పులే యని అందరిని యీసడించి తీసివేయుచుండును. లోకము తన గొప్పను, తన ప్రతిభను చాటుటకు, తనను [illegible]రించుటకు యేర్పడెనని యతనిభావము. అతడు మాత్ర మితరుల మంచిని గ్రహింపడు. లోకమును తనవలె జూచుకొనజాలడు. చివరి కతని భావములే బాహ్యమున ప్రతిఫలింపగా నతని స్థితి యక్కిరి బిక్కిరి యయ్యెను. నీ వున్నచోటనే నీ నీడ యుండును. ఆ నీడ నీ వలెనే యుండును గాని మరియొక రూపము దాని కెట్లు సంభవింప గలదు? నీ లోపల నుండు రూపమే నిన్ను బహిరంగ పరచును.

శ్లో॥ భవ త్యఖిల జంతూనాం యదంత స్తద్బహిః స్థితం।
అఖిల జంతువులకు నేది లోపల నుండునో యదియే బాహ్యతలమున ప్రకాశించు చుండును.

# మైత్రి.

"కేన సృష్టం మిత్రి మిత్యక్షర ద్వయం" మిత్రం అను రెండక్షరముల నెవడు సృష్టించెనో గదా! లోకమంతయు మైత్రి మీదనే యాధారపడి యున్నది. మైత్రి లేనిదే గ్రహ తారకాదులు గూడ స్థిరముగ నుండజాలవు. వాని ధర్మములను నెరవేర్ప జాలవు. వాని యునికి కన్యాన్యాకర్షణామే, అన్యో న్యాశ్రయమే కారణమని పదార్థశాస్త్రము ఋజువు జేయు చున్నది. అన్యోన్యాకర్షణ శక్తి చేతనే భూమ్యాకాశములు నిల్చియున్నవి. లోక స్థితి దీని మీదనే యాధారపడి యున్నది. సముద్రమును చేరవలె ననెడి తహతహ చేతనే నీరు పారుచున్నది. భర్తను పొందవలె ననెడి కోర్కెచేతనే స్త్రీ భర్తతో సహగమ నము (అడుగులో నడుగు) చేయుచున్నది. పుత్ర వాత్సల్యము చేతనే తల్లి గర్భవేదన యనుభవించు చున్నది. దూడ మీద ప్రేమ చేతనే ఆవు పొదుగు పీడ సహించుచున్నది. "చంద్ర యతీతి చంద్రః" సంతోషపెట్టు వాడు గనుకనే చంద్రు డన్వర్థ నాము డగుచున్నాడు.

ఆకర్షణ శక్తిచేతనే పరమాణువులు మహాపర్వతము లగుచున్నవి. సమాజము దీని మూలముననే నడచుచున్నది. క్రమము దీనిపైననే స్థిరపడి యున్నది. మిత్రత్వ మమృతమును, శత్రుత్వము మృత్యువును ప్రసాదించును. మిత్ర సహాయము లేనివాని బ్రతుకు అడవిని గాచిన వెన్నెల చందమే యగును.

"హృదయముల నాకర్షింపుము. దానితో లోకమైత్రి, ధన సహాయము వాటంతటవియే నీకు సమకూరగలవు." అను ప్రవచనము గలదు. అబ్రహాం లింకన్‌కు మొదట మిత్రులు దప్ప మరెట్టి సంపదయు లేదట. నేడు లింకను లేని అమెరికా చరిత్ర చంద్రుడులేని రాత్రి వలె యుండు నని యొక చరిత్ర కారుడు వ్రాయు చున్నాడు. 'నా కిపుడు తిరిగి కౌమారమే ప్రాప్తించి దానితో పుస్తక భాండాగారములు, విశ్వ విద్యాలయాట్టహాసములు, మామూలు పండితులు కావలయునా లేక యొక యరణ్యములో తన గుడారములో నేకాకియై నిశ్చింతగ కాలము గడుపు ఋషిపుంగవుడు, మహాత్ముడు, సదాచారుడు నగు, హాప్కిన్సు మహాశయుని మిత్రత్వము వాంఛింతువా?' అని యెవరేని యడిగిన చో 'నేను అతనినే కోరుకొందును.' అనెనట. మిత్రులు పెట్టనికోటలు. మిత్రన్యాయము మహాద్భుతమైనది. మైత్రి ఎంతటి త్యాగమైన జేయించును. "చెడ్డ బందుగుల యిండ్లకు బోవుట కంటె స్నేహితుని ఇల్లు జేరుట సుఖము" ఎండిన చెరువును వీడు కప్పల వలె బంధుగులు కష్ట కాలములో, విపద్దశలో నిన్ను వీడిపోవచ్చును." లేమి వచ్చినపుడు భార్యాబిడ్డలు కూడ నీకు దూరులు గావచ్చును. శుద్ధ విరోధులే గావచ్చును. నిజమైన మిత్రుడెన్నడు క్షీర నీర న్యాయమును వీడడు. పాలు తమ ధావళ్యమును, మాధుర్యమును, సత్త్వమును తమతో జేరిన నీరములకు ప్రసాదించు చున్నవి. నిప్పులలో మరగింపబడు పాలను జూచి, నీరు మిత్ర

బాధ కోర్వజాలక తానే చిచ్చులో నురుకుచున్నది. ఇంతలో మిత్ర విపత్తును సహింప నేరక దుగ్ధమే మంటలోని కురుకు చున్నది. తిరిగి నీరు తనతో కలియుటతోడనే పాలు పొంగుట మాని శాంతించు చున్నవి. ఇదియే మిత్రధర్మము. ఇట్టి మైత్రిని విలువరింప నేరి తరము? మిత్రరహిత జీవనము తోరాన్య స్నేహమున కెత్తిన దీపము వంటిది. ఇది భరింపరానిది. విజయము, పేరు ప్రఖ్యాతులు గడించినవారి జీవితములు పరి కించి చూడుడు. వీరంతటి వారగుటకు వెనుకనుండి యవ్యాజ మైత్రితో దోహదము జేసిన వారెందరుండిరో తెలిసికొనుడు. ప్రపంచక మట్టి వారి పేర్లు స్మరింపక పోవచ్చును. మజ్జ నమాడుటకు నులక మంచమును, పసుపుముద్దను తెచ్చి యిచ్చి ''ముగురాడు వార మైలిమి వగ పేటికి జలకమాడ వచ్చిన వేళన్'' అని హెచ్చరించిన భార్య, తల్లి లేకపోయినచో 'ఖడ్గతిక్కన' ఎచ్చట నుండగలడు? అతనిని చరిత్ర స్మరింపనైన స్మరించునా? నెపోలియన్ చక్రవర్తి తల్లిపేరు, శివాజీ తల్లిపేరు, మహాత్ముని తల్లిపేరు మనము స్మరింపక పోవచ్చును. ఆ తల్లుల లాలన పాలన లేనిదే వారంతటి వారు కాగలిగిరా?

మన స్థితికి, మన విజయమునకు నెంతమంది తోడ్పడిరో మనము మరచిపోవుదుము. మన దూరదృష్టి, మన బుద్ధి విశేషము, మన చాకచక్యము, మన వివేకము మన విజయము నకు కారణము లని డంబములు కొట్టుదుము. మన జీవిత ములలో మన కితరులు పరోక్షముగను, ప్రత్యక్షముగను

గావించిన సాక్సహాయము, యిచ్చిన సలహా, మేరువువలె చలింపక నన్ని పరిస్థితులలోను గావించిన యండ దండలు, నిరంతర ప్రోత్సాహము ఈ యన్నింటిని తీసివేసినచో నిక మన జీవితములో మిగులు విజయ మెంత? నీ దొడ్డిలోనున్న గొడ్డు పోటు డై, యింటనున్న భార్య గయ్యాళియై, కడుపున పుట్టిన కొడుకు నిర్గంధ కుసుమమై, తోడబుట్టినవా డుపకార శూన్యుడై, భూదేవివలె తల్లి నిన్ను చక్కదిద్దునది గాక, ఇరుగు పొరుగు విరోధులే యగుచో, నీ వెచ్చట నుందువు? ఇంత మందిచే కల్గిన విజయము నీ యొక్కనిదే యనుకొనుట వెర్రి కాదా!

మైత్రిని ప్రత్యుపకార దృష్టితోను, వర్తక దృష్టితోను గ్రహించుట తూచుట పేదరిక లక్షణము. దాని కార్థిక ప్రయోజనమున్నను లేకున్నను దాని యాధ్యాత్మిక ప్రయోజన మపారమైనది. అయాచితముగనే భాస్కరుడు సరోవర లక్ష్మిని వరలజేయు చున్నాడు. కోర బడకుండగనే యోషధి రాజు తన సుధను వెదజల్లు చున్నాడు. యాచింప బడకుండ గనే మేఘుడు స్వాదుజలాభి షేచనచే లోకమును దనుపు చున్నాడు. లోక హితమగు స్నేహ మిట్లేర్పడునే కాని యిచ్చి పుచ్చుకొనునది యాదర్శ ప్రాయము కానేరదు. ఉదార స్నేహ మమూల్యమైనది. అది శీలమను మణిని సానపెట్టు దివ్య మంత్రము. "నీ స్నేహితు లెవరో నాకు చెప్పినచో నీ శీల మెట్టిదో నేను చెప్పెదను" అని యొక కవి చెప్పెను.

'ఆరు నెలలు సావాసము జేసినచో వారు వీరగుదురు.' యను లోకోక్తి అనుభవ సిద్ధము. కనుక మనము జేయు స్నేహము విషయమై జాగరూకులమై యుండ వలయును. తెలియకుండ గనే మనము వారి గుణ గణముల ననుకరింతుము. గుణము కంటె యవ గుణము లతి సులభముగ యలవడును. "అసత్య వాదులతోను, ద్వేషులతోను, లోభులతోను జేరినచో మనము కూడ యట్టి వారమే యగుదుము." అని కింగ్స్లీ వచించెను. "శిరి యబ్బదు గాని చీడ యబ్బుట కబ్బురమేమి గలదు?" "రస్కిన్ మహాశయుని రచనలను చదివిన తరువాత నా స్వరూపమే మారిపోయెను." యని యొక యమెరికా ప్రముఖుడు వ్రాసెను. కాళిదాస గ్రథిత శాకుంతలమును, జదివి "గైథీ" యను జర్మను తత్త్వవేత్త సంతోషము పట్టజాలక నాట్యమాడెనట! తులసీ రామాయణము జదివి మహాత్ముడు తన్మయత్వము జెందెను. బహువిధ సద్గ్రంథములను పఠించి పునీతులైన వారు, భక్తులు, శక్తివంతులు నెందరో గలరు. గ్రంథముల ద్వారా మన కెందరో మహాత్ములు స్నేహితులు కాగలరు.

నీ కెప్పుడు, నిరాశ, నిరుత్సాహము, విచారము, దిగులు జనించినను మహాపురుషుల రచనలు నీ కేమందులు జేయజాలని చికిత్స జేయగలవు. వాని నన్ని వేళల నీవు దర్శింప వచ్చును. పఠింపవచ్చును, సలహా జేయవచ్చును. నీవు వాటి దర్శనములకు కార్డులు బంప నక్కర లేదు. మహాత్ముల

సాంగత్య మసదృశమైనది. వారి సాంగత్యము, వారి సుభాషితములు మన యావజ్జీవమును మార్చివేయ గలవు. కృష్ణుడంతటి వాడు "మహాత్ముని పాదధూళి నాశిరమున దాల్తు" ననుటలో నున్న భావము గమనార్హము. ఒక మహాత్ముడు వేసిన ప్రశ్నచే వాల్మీకి జీవితము మారిపోయెను. ఒక పతివ్రత చండ కౌశికునకు బుద్ధిజెప్పెను. భోజరాజు యొద్ద సిల్పెడివానికి కవిత్వ మబ్బెడిదట! సత్సంగము మహత్తర కార్యము లను సాధింప గలదు. మహాత్ముల దర్శన, స్పర్శన భాగ్యములచే జంతు జాలములు రాళ్ళు కూడ తరించి నట్లెన్నియో గాధలు గలవు. కనుక నిట్టివారితో జేయు మైత్రి కే సింహాసనాధిపత్యములును జాలవు.

కొందరు దూరమున నుండి చూచుటకే బాగుందురు. వారి మాటలు కోటలు దాటును. గంగా ప్రవాహము వంటి శబ్దజాలముతో వారు నిన్ను భ్రమింపజేతురు. కొందరి వేషము తీరు, బాహ్య మర్యాదలు, నాగరిక సంస్కారములు, కొంతయాడ దగియుండ వచ్చును. గాని వారిని దూరము నుండియే గౌరవింపదగును. దగ్గరకు జేరుదుమా! వారి తళుకు, బెళుకు హరించి పోవును. పైకి కాన్పించు బంగారము లోపల కాన్పింపదు. అచ్చట చాలవర కంతయు కంగారు గాధయే. చర్మ సంస్కారము, లౌకిక సంస్కారము తప్ప హృదయ సంస్కారము లుప్తమగును. తెఱచి జూచిన గాని హృదయము బయల్పడదు. మరి కొందరు గలరు. వీరి సంపర్కము యుప

కుల కోతిమాత్రము పనికిరాదు. వారియొద్ద యొక్క జ్ఞానముండిన జాలును. అంతయు నిరుత్సాహము, నీరు కారిపోవుట, వెక్కిరింత, కొక్కిరింత; తేలిక దృష్టి; తేలిక భావములు, 'బట్టతల' భాషణములు. ఒక స్నేహితుడు గలడు. ఆయన యొద్ద పెద్ద పెద్ద సంస్కృత గ్రంథములు, వేదాంత గ్రంథములు నోరగలను. ఆయన వానిని జదువుచు శ్లోకములను విసరు చుండును. ఇంక లోతుకు బోవ్రదుమూ! మన ముక్కిరి బిక్కిరి యగుచుండును. పదిమంది జేరినప్పుడెల్ల ఆయన యీ క్రింది పల్లవి యందుకొనును. "అబ్బే! మనము చవటలము. మన మెట్టి ఘన కార్యము జేయజాలము. భగవంతుడు మనలను బానిసలుగ నుండవలెనని యే వ్రాసిపెట్టెను. గాంధీ పిచ్చివాడు. ప్రాచీనావీతి సంచులు అనగా వాలంటీరు సంచులు. నూనె గుడ్డలవాళ్లు అనగా ఖద్దరు ధారులు. మతి మాలిన వాళ్ళు. తెల్లవాళ్ళను భగవంతుడు మనల నేలుటకే సృజించెను. నల్ల వాళ్ళు రాజ్యముజేసిన దెపుడు?" ఇట్టి శుష్కాలాపములెన్నియో యీయన వదన గహ్వరమునుండి బయల్వెడలు చుండును.

ఇంకొక జాతివారు గలరు. వీరి పలుకులు ములుకుల వలె నుండును. నోరు మాట్లాడు చుండును. నొసలు వెక్కిరించు చుండును. ముసి ముసి నవ్వులు. వెనుకనుండి గోతులు త్రవ్వుట. మాటతీపి. మనసు ముషిణికాయ. రంధ్రాన్వేషణ యే వీరిపని. మనిషిని పడగొట్టుటెట్లు? అనునదియే వీరి యాలోచన.

వీరి జీవితములో సరసముండదు. అంతయు పెటుకుదనము. మంచిని గ్రహించుట, మెచ్చుకొనుట వీ రెరుగరు. తలబిరుసు, అంతకంటె నాల్గురెట్లు మాటబిరుసు. ఇంక మనసు ఘనీభవించిన బిరుసుదనము. వీరి నడక, ప్రవర్తన గూడ బిరుసే. కనుక వీరి శరీరమును తాకినపుడా బిరుసుదనమే ద్యోతక మగును. హృదయత్వము, ఆర్ద్రిత, సుఖము, ప్రేమ యనునవి వీరిలో నే కోశములోను గాన్పించవు.

కనుక మిత్రులను జేసికొనుటలో మనము జాగరూకత నహింపవలెను. మిత్రుడు మన శీల వృత్తములను మార్చివేయును. "మిత్రత్వము వల్లనే మన విధి నిర్ణయింపబడుచున్నది. యువకుడు తన మిత్రుల విషయములో తగు శ్రద్ధ తీసికొనక మందభాగ్యుడగుచున్నాడు." అని డాక్టర్ హిల్లిస్ వ్రాయుచున్నాడు. నిజమైన మిత్రుడు మనలో నున్న మంచిని గ్రహించి దాని ననేక విధముల పోషించును. దోషముల చూపి నివారించును. ఎగ్గులను సేయనీయడు. పాపముల వంకకు బోనీయడు. మరియొక విషయము. ఎంతటి దుర్మార్గుడైనను కొన్ని మంచి గుణములు లేని వాడు లేడని షేక్స్పియరు కవి తన నాటకములలో విశదపరచి యున్నాడు. నీ దృష్టి గుణము మీదకే పోవలయును కాని పుండు మీదకు పోరాదు. నుదుట కస్తూరి తిలకముండ యీగ కుళ్ళిన మాంస ఖండముపై వ్రాలుట దాని లక్షణము.

శ్లో॥ పరగుణ పరమాణూ న్పర్వతీ కృత్య నిత్యం।
నిజ హృది వికసన్తః సన్తి సన్తః కియన్తః॥

ఇతరుల గుణ లవమునే మేరు సమానముగ నెంచుచు తమ హృదయములను నిత్యము వికసింప జేసికొను సజ్జను లేకొద్దిమందిరో యుందురు. శుభ లక్షణములు కలవాడే మిత్రుల నాకర్షింప గలడు. స్వార్థ, లోభ, మద, మాత్సర్యా దులు కలిగి యున్నచో నిన్నెవరును చేరరు. "స్త్రీలు అంతః పురము నాశ్రయించు నట్లు ఆర్యత, హృద్యత, మిత్రత, కరుణ, సౌమ్యత, వివేకము వాని నెల్లపుడు నాశ్రయించును." అను నట్లు గుణాకరునకు స్నేహితుల కొదువ యుండదు.

నీ మిత్రత్వమును దాపరికము లేకుండ ప్రకటించు చుండుము. నీ మిత్రత్వముచే మరియుచు గుణాన్వితులగు వా రనేక మంది యుండవచ్చును. ఎప్పటి కప్పుడు నూతన స్నేహ ములు కలుపుకొనుచుండ వలెను. "జీవితము నుండి మిత్రత్వ మును తీసివేయు కుమతులు ప్రపంచము నుండి సూర్యబింబ మును తొలగించినవారి వలె నుందురు. ఏల నన ఏ దేవుడును మనకు మైత్రి కంటె శ్రేష్ఠము, మనోహరము నగు పదార్థ మును ప్రసాదించి యుండలేదు." అని శిశిరో మహాశయుడు చెప్పుట యెంత మాత్రము నతిశయోక్తి కాజాలదు.

క. మైత్రిం బోలెడి ధర్మము ధాత్రీ దివిజులకు లేదు దాని నడపినం
బుత్రా యేకర్మంబు పవిత్రతయును వలపదది వివేకము జేర్చున్
భా॥ర

జగత్తుతో మిత్రత్వము సాధించువాని జన్మమే జన్మము. జగత్తును శత్రువు వలె పాటించువాడు వ్యర్థుడు. దివాంధ జాతి వాడు.

"మిత్రలాభమును మించిన లాభము లోకమందేదియు గానము. కాబట్టి బుద్ధిమంతుడు పెక్కండ్రు మిత్రులను సంపాదించుకొన వలెను. ఒక్క మూషికము తోడి మైత్రి కారణముగ ఎంత కార్యము చేసినది చూడుడు. ధన సాధన సంపత్తి లేనివారయ్యు బుద్ధిమంతులు పరస్పర మైత్రి సంపాదించుకొని కాక కూర్మ మృగ మూషికముల వలె స్వకార్యములు సాధించు కొందురు." అని నీతిచంద్రికలో విష్ణుశర్మ రాకుమారులకు బోధించిన పంథమును గ్రహించి కృతకృత్యులగుటకు బుద్ధిమంతులు కండి.

---

# స్త్రీ - గృహము.

శ్లో॥ నగృహం గృహ మిత్యాహు ర్గృహిణీ గృహ ముచ్యతే॥
గృహంతు గృహిణీ హీనం కాంతారా దతిరిచ్యతే॥

ఇటుకలు, పెంకులు, కప్పు గల్గినది మాత్రమే ఇల్లు అని యనబడుట లేదు. ఇల్లాలే ఇల్లు. ఇల్లాలు లేని ఇల్లు అడవి కంటె అధ్వాన్నమైనది. అని పై శ్లోకమున కర్థము. అత్యంత సుందరమైన తాజ్ మహాల్ కట్టడము భవనమే కాని ఇల్లు కాదు. ఎన్ని సదుపాయములు, నెన్ని రస వర్గములు కూర్చబడినను, బొంబయి లోని తాజ్ మహాల్ హోటలు పూట కూళ్ళయ్య యన్న విక్రయశాలయే కాని చల్లని గృహము కాజాలదు. అభేద్యమగు రాతికోట దుర్గమగునే కాని ఇల్లు కానేరదు. స్త్రీ ప్రేమదేవత. గృహదీప మెచ్చట వెలుగుచుండునో యదియే ఇల్లు. స్త్రీ లేని గృహము, ప్రాణము లేని శరీరము, తోయము లేని వాహిని, పూజ లేని గుడి నిరర్థకములు. "భార్యా మూల మిదం గృహం." ఇంటికి భార్యయే ప్రాపు, జీవిక. కనుక స్త్రీయే గృహము.

మానవు డేకాకిగ నుండజాలడు. మానవు డననేల! దేవతలకును నది యసాధ్య మయ్యెను. కనుకనే బ్రహ్మ సరస్వతిని తన ముఖమున, విష్ణువు లక్ష్మిని వక్షస్థలమున, ఈశ్వరుడు పార్వతిని సామేన ధరించెను. "ఏకాకి యగు మానవు డొంటరి తనములో నానంద మనుభవింపజాలక మరి యొకరిని వరించెను. అప్పు డతడు తనను తానే పడగొట్టు

కొనెను. ఆ పాతమునుండి ఇద్దరుద్భవించిరి. వారే పతి పత్ని యైరి.'' అని బృహదారణ్యకోపనిషత్తులో కలదు. ఇది అతి భావగర్భిత మైన వాక్యము. గృహ జీవితానంద రహస్య మిదియే యని వేరుగ జెప్పవలెనా? ఒకే వ్యక్తి రెంటి క్రింద విభజింపబడి తన కొరకే, తనను పూర్తిచేసికొనుట కొరకే, తానే రెండై యానంద మనుభవింప గోరెను.

"వివాహములు స్వర్గ నిర్మాణములు'' అను నొక సామెత గలదు. దీని భావ మేమి? ఇతరు లెవరో నీ కొరకీ పని చేసిరని యర్థము కాదు. నిన్ను నీ వెట్లు సృష్టించుకొంటివో, అట్లే నీ వనితను గూడ నీవే సృష్టించుకొనుచున్నావు. ఆమె నీ కన్యమైన సృష్టికాదు. "భర్త మూలమున భార్య, భార్య ద్వారా భర్తయే గృహమున సతత సంతుష్టులగుదురో యా గృహము నిత్య కళ్యాణవంత మగుట నిశ్చయము. ఇంతే కాదు. ఏ దేశమున, ఏ సంఘమున, స్త్రీలు పూజింపబడు చుందురో యచట దేవతలు క్రీడింతురు. ఎచట స్త్రీలు పూజింప బడరో యచట సర్వ క్రియలు నిష్ఫలము లగును. ఏ గృహమున స్త్రీలు శోకింతురో యా గృహము శీఘ్రకాలములోనే నశించును. సర్వ జంతువులు వాయువు నాశ్రయించి యెట్లు జీవించు చున్నవో యట్లే గృహస్థాశ్రమము నాశ్రయించియే తక్కిన యాశ్రమము లన్నియు గతి గల్గియున్నవి'' అని మను స్మృతి చాటుచున్నది. పరోపకారము,

దానము, ధర్మము, సంఘ శ్రేయస్సు, గృహము నుండియే యుత్పన్నము కావలెను.

వివాహము, గృహము, స్త్రీ—ఈ మూడును అవినాభావములు— వీనిని గూర్చి యెంత వ్రాసినను వ్రాయ వచ్చును. వీనిని విడదీయుటకు వీలు లేదు. వీనిని విచ్ఛిత్తి చేయు శాసనములు, శాస్త్రములు, కథలు, ఆచారములు, రాచకీయములు, మారే కుచ్ఛిత నామములు ధరించినవి—— ప్రాచీనములు గాని, నవీనములు గాని— నిందార్హములు. గృహములోనే స్వర్గము సృజింపబడి మానవు డిచ్చటనే విజయము పొందవలెను. "ఉట్టి కెగురలే నమ్మ స్వర్గమున కెగురజాల దన్నట్లు" గృహ సంస్కారము నెరుగని వారు ప్రపంచ సంస్కారమును చేయబోదు రనుట వట్టి కల్ల. గృహమే సర్వ గుణముల కాలవాలము, సుసంస్కార శోభితము, విద్యాల నగరము కావలెను. నేల విడిచి సాము చేసట్లు గృహమును విడిచిన మేలు లేదు.

ప్రపంచములో యుద్ధములు కూడదనను నొక వాదము కలదు. ఇంతవరకు యుద్ధములు యుద్ధములకే దారి తీయుచున్న వనుట స్పష్టము. కనుక యుద్ధములు లేకుండవలె నని ప్రతి దేశము కాంక్షించుట సహజము. కాని ఈ సంస్కార మెచ్చట ప్రారంభింప వలెను? అమెరికా దేశములో ఒక ప్రఖ్యాత కుటుంబము కలదు. పై విషయము గురించి యా కుటుంబములో చర్చలు బయలుదేరెను. చివరకీ సమస్య తేలక యా కుటుంబము వారందరు నొకరి నుండి యొకరు తెగ తెంపులు

చేసికొని రట. వీరు ప్రపంచములో యుద్ధములు లేకుండ చేతురట! "వివాహ వ్యవస్థ దివ్య సిద్ధాంత మైనది. ఆ కలయిక పవిత్ర మైనది. ఆ రహస్యము పునీత మైనది. దాని ప్రభావ మనోన్యాయార్పణము. ఆ పదమే గౌరవార్హ మైనది. దాని విధులు మత సంబంధములు. అది మానవ సంఘమున కతి లాభదాయక మైనది. అది ఈశ్వరునకే పావనత్వము." అని కెర్క్మోటేలను స్వర్ణాక్షరములతో లిఖించినాడు. "ఒక వివాహ మానంద సంధాయకముగ పరిణమించినపు డట్టి యానందమును వర్ణింపజాలు శబ్దజాల మెచ్చట కలదు?" అని మరియొక కవి ప్రశ్నించు చున్నాడు.

"ఉభయులు కలిసి పూజింతురు. కలిసి ప్రార్థింతురు. కలిసి యుపవసింతురు. సుఖములో, దుఃఖములో, దరిద్రములో, వారు సర్వత్ర సమ భాగులు. వారిలో వారికి తెలియరాని రహస్యములు లేవు. వారొకరి కొకరు భారము కారు. అట్టి దృశ్యమును చూచి భగవంతు డానంద భరితు డగును. వారి కతడు తన ధన్యవాదముల నంపును. ఎచ్చట దాంపత్య సుఖముండునో యచ్చట యతడుండును. ఎచ్చట నత డుండునో యచ్చట చెడ్డ యుండనేరదు." ఆనంద ప్రదమగు నే గృహము కలదో యదొక్కటియే స్వర్గముతో నుపమింప దగినది. "సుగుణాలవాలమగు నొక తల్లి నూర్గురుపాధ్యాయులతో సమాన మని" యొక సామెత కలదు. తల్లియే గృహపాలనాధికారి. గృహ మనగా తలుపులు,

ద్వారబంధములు, కర్టీన్లు, నందందు కొయ్యబొమ్మల వలె తిరుగాడు నర సంచారములు కావు సుమా! అందులో ప్రేమ దేవత యొక్క నిండుహృదయము మధుర మధుర సంచారములు ద్యోతకము కావలెను.

నే నొక గృహము నెరుగుదును. అది యాధునిక పరికరములతో, సన్ని సదుపాయములతో చక్కగ సమర్చబడి చక్కని గాలి, ప్రాణ దాయకమగు వెలుతురు, స్వచ్ఛమగు సలిల సంపద, యందమైన ప్రాకారములు, విశాలములైన గదులు, ఆరామములు గలిగి కన్నుల పండువుగ కన్పించును. కాని దాంపత్యరస సరసము లెఱుగని యా యింట పది నిముసము లుందువేని నీ మెడలు కంపించును. కమలము స్వర్ణముతో చేయబడినంత మాత్రముచేత నిజ కమలశోభ నొసంగజాలనట్లే కట్టడములో ప్రేమ వాయువులు వీచవయ్యెను. ఈ యింటి దంపతులు మూగవారివలె సాంజ్ఞలతో కాలము గడుపుచుండుట నే మన వలెను? జీవిత సౌరభము నెరుగని గృహము కోటయైన నేమి? భవ్య హార్మ్యమైన నేమి?

ప్రేమకు ప్రేమయే సాటి. ప్రేమింపని వారికి ప్రేమింప లేని వారికి, మృతిచెందిన వారికి భేదమేమి కలదు? ప్రేమ జీవిత సుధ. అది సాధింపని దెందును లేదు. సీసము మొదలగు నల్ప లోహములను బంగారముగ మార్చుట కనేక రసములు, రసాయనములు ప్రయోగింపబడి నిరర్థకము లయినవి. కాని ప్రేమ రసాయనము నికృష్ట జీవితమును దివ్య పథమునకు

గొంపోయిన సాదృశ్యము లెన్నియో, గలవు. కామాతురుడైన తులసీదాసు తన ప్రేమమూర్తి యుపదేశము చేతనే భక్తాగ్రేసరుడు కాగల్గెను. తన ప్రేమమహిమ చేతనే సావిత్రి నేటికిని కొనియాడ బడుచున్నది. ప్రేమయే కాళిదాసును మహాకవిగ చేయ గలిగెను. క్రౌంచ మిధునములోని నొక దాని ప్రేమభరిత శోకము నుండియే వాల్మీకి శ్లోక ప్రవాహ మావిర్భూత మయ్యెను. వేయేల, మహాపురుషుల జీవితములను తిలకించినచో నెప్పుడో యొకప్పు డేదోయొక విధముగ నీ ప్రేమ మహిమ కాన్పించుచునే యుండును.

సామాన్య జీవితములో కూడ నొక్కొక్కని జీవితములో వివాహ మయిన తరువాత నద్భుతమగు మార్పులు కలుగుచుండును. అంతవరకూ నల్లర చిల్లరిగ తిరిగినవారు, నెందుకు పనికిరానివారు, పదిమందిచే తేలికగ చూడబడినవారు, కళత్రవంతు లగుటతోడనే ఎక్కడలేని ఘామేధ, మర్యాద, కుదురు యలవడ చేసుకొని సుగుణవంతులు, బుద్ధిమంతులు నైన వా రెందరో గలరు. భార్య రాకమునుపు నిర్భాగ్యుడుగ నుండి యామె పాదము పెట్టుట తోడనే లక్ష్మితో తులతూగు వా రెందరు లేరు! ఆమె తొలగుట తోడనే యొక్కొక్క యింటి లక్ష్మి తొలగుచుండుటయు చూచుచుందుము. ఈ మార్పు లార్థికముగ, నైతికముగ, నాధ్యాత్మికముగ, జీవిత శాఖల నన్నింటిని మార్చునట్లుగ నుండును. కనుకనే వివాహ

మునకు "కళ్యాణ" మను శుభోదర్కమగు నామ మీయ బడెను.

ప్రేమ యద్భుత మైనది. పటుతర మైనది. దివ్యమైనది. కనుకనే వివాహ విధు లంత పవిత్రములుగ భావింపబడు చున్నవి. ఆ సంబంధము కేవల మైహికము మాత్రమే కాదు. "ప్రేమ ప్రేరితుడై యత్యున్నత సిద్ధులను బడయ జాలని వాడు హతాశుడు. అతడు జీవించియున్నను మృతకల్పుడు." ప్రేమ స్వభావముచేత నాధ్యాత్మికమైన దగుటచే దాని ఫలితములు శాశ్వతములు. ప్రేమగాథ లద్భుత మయములు. వాని స్మరణముచే యొక్కొక్కప్పుడు నిన్ను మరియొక లోకమునకు గొంపోవును. ప్రేమశక్తి నానాటికి వృద్ధిచెందు చుండునే కాని దానికి తరుగుదల లేదు. నిజమైన ప్రేమ సమస్తమును పునీతము చేయును. ప్రేమదృష్టికి లోపము, దోషము కానరావు. అది వానిని చూడజాలక పోవుటయే గాక తన నిజ బలముచే నవి రూపాంతరము పొందునట్లు కూడ చేయగలదు. ఈ రహస్యమును రసాయనవస్తు పదార్థశాస్త్రము లర్థము చేసికొనజాలవు. ఇది వాని కందని విషయము. అగమ్య విషయము. జీవితమే, యనుభవమే దీనిని నిరూపింప గలదు. తక్కిన చిల్లర శాస్త్రము లిచ్చట నిరర్థకములు.

ప్రకృతి శోభ యమితానందము గలుగ జేయును. దినమణి విన్యపథమున కలంకారము. మనకు సంతోషకారి. కాని, హృదయమున నున్న యానంద భాస్కరుడు కూడ వెలుగనిదే

గుండి నిష్ప్రయోజన మగును. ఇది కలిగిననాడు లోకమంతయు స్వర్గమే యగుచున్నది. "సంతోష స్వాంతమునకు జీవిత మంతయు నవిరళ భోగము వంటిది. ధనము దానితో దాపరించు దుఃఖము కంటె భగవద్భయముతో గూడిన స్వల్పమే మేలు. ద్వేషముతో గూడిన మృష్టాన్నము కంటె ప్రేమతో జతగూడు కూరాకు లైనను మేలు." జీవము లేని కట్టె యెట్టిదో, భావము వ్యర్థమైన శుష్కాచారములును నట్టివే. వివాహ సంస్కార కార్యాదులలో భావశూన్యముగ జరుపుచుండుట, వందలు, వేలు ఖర్చుపెట్టబడుచు వివాహ మంత్రార్థములు, ఆశయములు, గంభీరత, పవిత్రత వర్జింపబడుట; వివాహ మన-ఇచ్చుట పుచ్చుకొనుట (క్రయ విక్రయము) వచ్చినవారు మృష్ట భోజనాదికములు కుడుచుట, మధ్యమధ్య ముష్టాముష్టి జరుగుచుండుట, ముక్కుపచ్చలారని వారిని ముస్తాబుచేసి పెండ్లి పీటల మీద కూర్చుండబెట్టుట— ఇత్యాది యక్రమములేమనవలెనో తెలియకున్నది. నేటి భారత దుస్థితి కిది యొక కారణమని రామతీర్థస్వామి యువకులకును, తల్లిదండ్రులకును చేసిన హెచ్చరిక గమనార్హమైనది. పురుషాయుషము నూరేండ్లని వేదములో చెప్పబడినదే. ఇప్పుడు మన దేశములో ముప్పదేండ్లకే నూరేండ్లు నిండుట యెవరి తప్పు?

ఆధునికులు కానిండు, సంస్కర్తలు కానిండు, సనాతనులు కానిండు, రాజకీయవేత్తలు కానిండు, విద్యావిజ్ఞాన పరిష్కర్తలు కానిండు, ఆస్తికులు కానిండు, నాస్తికులు

కానిండు మరే ప్రాక్పశ్చిమ సిద్ధాంతములకు చెందినవారు కానిండు: గృహ, వివాహ, స్త్రీధర్మములను పరమార్థములను గురించి జేయు సంస్కారములు, లోకమరమ్మతు రాజకీయ, సామాజిక నివారణోపాయములు, యుక్తులు, "స్వర్గములు" మొదలగు వాగ్వైభవ మంతయు వృథాజల్పము. సమస్తము అర్థదృష్టితోను వస్తుదృష్టితోను, భోగదృష్టితోను, వర్తక దృష్టితోను, చూచు పాశ్చాత్య లోకము నేడు గృహాదీపము లేని పాటలు జీవితము తోను, స్పర్ధలతోను, ద్వేషములతోను, నిరంతర యుద్ధములతోను, నిండిపోవుటను మనము కండ్లార చూచుచునే యున్నాము.

అజ్ఞానముచే పరమార్థము వీడిన శుష్కాచారములచే, రసరహితమైన మాధ్యజీవితముచే, పరమార్థ లక్ష్యముతో కాలానుగుణ్యముగ చేసికొనవలసిన మార్పులను చేసికొనక పోవుటచే, పౌరుషమును నిరసించు స్తబ్ధత్వముచే, దివ్యసూత్రముల నెన్నడో పోగొట్టుకొని చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకొను దుస్థితికి దిగిపోవుటచే ప్రయత్న రాహిత్యమే దైవారాధన యనుకొను మెట్టవేదాంతముచే మనమును నిర్వీర్యులమైతిమి. శబ్దముపేర భావమును మెలిపెట్టి మెలిపెట్టి దానిని జీవితమునుండి పారద్రోలి వ్యర్థుల మైతిమి. దీనివలన జీవిత మంతయు తారుమా రయ్యెను.

ద్రష్టలు కాక, జీవితమూలమును తరచక, కాలకర్మముల జాడల నెరుంగక, జీవితౌన్నత్యమును, ప్రభావమును రుచిచూడక, సమగ్ర యోగదృష్టి లేక జీవితమును వీడి ప్రాచీనత

నటించెట్టుకొని నలెనను దృష్టితో వ్రాయబడిన పాత్రలు, భాష్యములు, కవిత్వములు, వేదవాదములు, దేశమునకు సభ్యత మాపహింప జేసినవి. భగవద్గీత స్వాములవా రొకరు స్త్రీలు, పురుషులు, పసిపాపలు గల సభలో "స్త్రీని శవము వలె చూడవలెను." అని యుపన్యసించి తన "వేద యుక్తము" నా విధముగ తీర్చుకొనెను. స్థల, కాల, ఔచిత్య ముల నాయన సన్యసించెను. "స్త్రీ నరకద్వారము" అను సూక్తులతో మరియొకరు గ్రంథములు రచించిరి. ఇంకొక కవి వృద్ధు (ఇతనికి కవి వృషభుడు లేక కవిశేఖరు డను బిరుదు గలదు) "విద్యానామ నరస్య రూప మధికం" అను దానికి విద్య నరునకు ననగా మగవానికిగాని స్త్రీకి కాదు అని అర్థము చెప్పి యామెను నరజాతి నుండి తొలగించి వైచెను. ఉదార భావము లనుండి, యుదార కృత్యములనుండి, గొప్పతనము పుట్టును గాని యల్ప భావముల వలన మనము గొప్పవారము కాజాలము. నిక్షత్రము ఆకాశమున పుట్టును గాని భూమి మీద పుట్టజాలదు. ఉత్తరరామ చరిత్రలో జనకమహర్షి వశిష్ఠపత్ని నిట్లు సంభా వించెను.

శ్లో॥ యయాపూతం మన్యే నిధిరపి పవిత్రస్య తపసః।
పతి స్తే పూర్వేషామపి ఖలు గురూణాం గురుతమః॥
త్రిలోకే మాంగల్యా మవనితల లీనేన శిరసా జగద్వంద్యాం
దేవీ ముషస ఇవ వందే భగవతీం॥

"ప్రాచీన గురువులలో గురుశ్రేష్ఠుడు, పవిత్ర తపఃఫలిత ముల గని యైన యే నీ పతి నీ వలననే తాను పవిత్రు డైనట్లు సంభావించునో యట్టి నీకు, ముల్లోకములకు మాంగళ్య మును చేకూర్చు భగవతి, జగద్వంద్యురాలు నగు నుమాదేవికి వలె ననవితల లీనమశిరస్సుతో ప్రణమిల్లు చున్నాడను." ఆహా! ఈ భావ లాలిత్య మెచ్చట! పైన వర్ణింపబడిన మొరటుతెం మెచ్చట! స్త్రీని ప్రహ్లాదుడు చూచుకొనినట్లు తల్లి వలె, దేవత వలె, వేదమాత వలె చూచుకొనమని యనరాదా! జ్ఞానులే జ్ఞానమును తెలిసికొన గలరు. దివ్యులే దివ్యత్వమును చూడగలరు. జనకునిచే సంభావింపబడిన యరుంధతీ దేవి సీతను గూర్చి ఎంత లలితముగ చెప్పెనో చూడుడు.

శ్లో॥ శిశుర్వా శిష్యావా యదసి మమ తత్తిష్ఠతు తథా।
విశుద్ధే రుత్కర్ష స్త్వయితు మమ భక్తిం దృఢయతి॥
శిశుత్వం స్త్రైణంవా భవతు ననువంద్యాసి జగతాం।
గుణాః పూజాస్థానం గుణే ఘుసచలింగం నచవయః॥

"వత్సా! నీవు శిష్యురాలవు లేక నాకంటె పసిదానవు అను విషయ మటుండ నిమ్ము. నీ విశుద్ధచరితము, నీ యందు గల నా భక్తి భావమును దృఢతరము చేయుచున్నది. పసి దానవే, స్త్రీవే యగుదువు గాక నీవి జగత్తునకు వంద్యురాల వగుచున్నావు. గుణుల యందు గుణములే పూజాస్థానములు కాని లింగము, (స్త్రీలింగము, పుంలింగము) ముండ నాడి కములు, వయస్సు పూజార్హములు కాజాలవు." ఉత్తర

రామచరిత్రలో మరియొకచోట మైత్రేయి ఇట్లు చెప్పుచున్నది. "ఈ సుప్రసిద్ధ యగస్త్యాశ్రమములో ననేకమంది యుద్గీతవిదులు (వేద విదులు) కలరు. వీరియొద్ద నిగమాంత విద్య నభ్యసించుటకు వాల్మీక్యాశ్రమము నుండి ఇటకు వచ్చితిని." స్త్రీ మాహాత్మ్యమును గూర్చి వ్రాయవలసినచో నది మరియొక గ్రంథము కాగలదు. అడవిలో నాకొనిన బాలకృష్ణునకు యజ్ఞ నిర్మగ్నులైన శ్రోత్రియులు పట్టెడన్నము పెట్టుటకు నిరాకరింప పుణ్యాత్మురాండ్రగు తల్లులా భూతాత్మున కన్న సంతర్పణ జేసిరి. భాగవతములో నీ ఘట్టమతి రసవత్తరముగ నిట్లు వర్ణింపబడెను.

చం॥ కటకట మోసపోయితిమి కాంతల పాటియు బుద్ధి లేమ నే
డిట హరిగానచో నెరుగ మేము దురాత్ములమేము కర్మసం
సృష్టులము విష్ణుదూరగుల ప్రాజ్ఞత లేల తపంబు లేల ప
ర్యటనము లేల శీలములు యాగములున్ మరి యేల కాల్పనే?

కం॥ జపహోమాధ్యయనంబులు దపములు, వ్రతములు లేసి
తరుణులు హరి స
త్కృప బడసిరన్న గలిగియు జపలత నొందితిమి భక్తి
సలుపమి నకటా.

వ్యాసుడు వేద విధాత. సకల పురాణేతిహాస నిర్మాత. అట్టివాడు తనకును, తన కుమారునకును గల భేద మెరుగక పోవుటయు, "మరియు నగ్నుండును, దరుణుండునై చను తన గొడుకుంగని వస్త్ర పరిధానం బొనరింపక, వస్త్రధారియు,

వృద్ధుండు నైన తనుం జూచి చేలంబులు ధరియించు దేవ రమణులం గని వ్యాసుండు కారణం బడిగిన, వారలు "నీ పుత్రుండు స్త్రీ పురుష లనెడు భేద దృష్టి లేక యుండును. మరియు నతడు నిర్వికల్పుండు గాన నీకు నతనికి మహాంతరంబు గలదు." అనుటయు భాగవతములో గలదు గదా! ఈ స్త్రీలకీ జ్ఞాన మెట్లుగలిగెను? "పురుషుల పాండిత్యము బుద్ధి జన్యము, శాస్త్ర జన్యము. స్త్రీల పాండిత్యము సహజ పాండిత్యము." అని యొక కవి చెప్పెను. స్త్రీ తన హృదయము ద్వారా సమస్తము చూడ గలదు. సత్యమును గ్రహింప గలదు. హృదయము భావ స్థానము. ప్రేమపీఠము. ఈ భద్ర పీఠము నధిష్ఠించిన దేవతకు విదితము కాని దేది కలదు? శ్రీ కృష్ణుని తూచుట కేదియు సరిపోక పోగా రుక్మిణీ దేవి యొక్క తులసీదళ మొక్కటియే యతనితో తులతూగ లేదా? రామకృష్ణ పరమహంస కొక్క స్త్రీ జ్ఞానదానము చేయలేదా? కాళియే యతని కుపాస్య దేవత. శారదాదేవి యతని శిష్యుల లందరికి మాత కాలేదా? వివేకానందుకు కొక స్త్రీ దారిచూపె ననుటలో నతిశయోక్తి యేమున్నది! ఆదరించు వారెవరును లేక, పలుకరించు వారైననూ లేక, గ్రుక్కెడు నీరైననూ ఇచ్చువారు లేక, చికాగో వీధులలో హతాశుడై తిరుగాడు యీ వేదాంత కేసరి నాదరించు భాగ్యమొక్క స్త్రీకే దక్కెను గాని పురుష పుంగవు లెవరికిని దక్కలేదు. నాటి నుండియు నతని వేదాంత పరిశ్రమకు దోహద

మిచ్చిన వారిలో చాలమంది స్త్రీలే యని చరిత్ర చాటు చున్నది.

కనుక గృహము, స్త్రీ యతి పవిత్రమైనవి. గృహమే నాగరికత కాలవాలము. తల్లి యొడిలోనే లాలింపబడి వీరులై గొప్పవారైనట్లు చరిత్ర చాటుచున్నది. నెపోలియన్ తల్లి, శివాజీ తల్లి, ఖద్దతికర్న తల్లి, వివేకానందుని తల్లి, మహాత్ముని తల్లి,— ఇట్లెందరో తల్లులు తమ బిడ్డలకు, తమ భావములను, బుద్ధులను యుగ్గుపాలతోనే గఱపి ప్రపంచమున కర్పించినట్లు వారి జీవితచరిత్ర చాటుచున్నది. వీరమాతలే వీరులకు జన్మ స్థానములు. ఈ యుగ్గు పాలతో ప్రవహించు జ్ఞానపటిమ పాఠశాలలలోనూ, యంత్రాగారములలోనూ, పత్రిక గృహము లలోనూ, కల్గు ననుకొనుట వెర్రి. కనుక మాతృస్థానము నెల్ల ప్పుడు పూజింప దగినదే గాని గర్హింప దగదు.

పాత దంతయు రోత, క్రొత్త దంతయు, నవీన మంతయు 'తెలివి' 'స్వర్గము' అను మరియొక పిచ్చి నినాద మిపుడు మనలను బాధించు చున్నది. గృహ మొక ప్రాతఃదికని నుండ నక్కర లేదని దాని బదులు ప్రభుత్వశాఖలనో, సత్రములనో, గిడ్డంగులనో నిర్మించి, వానిలో నందరకు వేళకు అవసరమును బట్టి యాహార పదార్థములు, పాన పదార్థములు సరఫరా చేయును, సినీమాలకు, నాటకాలకూ, రైలు, స్టీమరు, విమానములు ఇత్యాదులు ప్రయాణములకు ఫ్రీ టిక్కట్లు నిచ్చుచు, బిడ్డ పుట్టుటతోడనే శిశు గృహములకు పంపుచూ,

లేదా పుట్టకుండ కొన్ని నవీన పరికరముల నుపయోగించుచు, వీలు తప్పి వచ్చినయెడల గర్భస్రావ మొనరించుచూ, రోజు కైదుగంటలో, యారుగంటలో పని, తక్కిన కాలమంతయు విలాసము, వినోదము యని, యందరకు యవసరమే కొలహ యని, ప్రభుత్వ మనునది యొకటి సమస్తము చేసుకొని పోవుచుండునని, భోగమే పరమార్థమని, దైవము, మతము అనునవి బూర్జువాలనూ, దరిద్రులనూ దోచుకొనుటకు కల్పించిన నల్లమందు మాత్రలను కొన్ని నూతన స్వర్గసూత్రములు ఇపుడు బయలుదేరినవి. నేటి "ఇజములు" అను పుస్తకములో వీని వివరములు చర్చింప బడును. స్త్రీ కేవలము భోగి పదార్థము కాదనియే మాతయు, నే గృహిణియు, నిట్టి పోకడల సహకరింపదని, తన నిజ సీమను, మర్యాదను, జీవిత గాంభీర్యతను, పోగొట్టుకొనుట కిచ్ఛగింపదని గుర్తింప వలెను.

భారతదేశములో స్త్రీ హృదయమే, మాతృ హృదయమే ఇంకనూ పవిత్రముగ నున్నది. మంచిని రక్షించుకొను శక్తి, మంచిని సహజముగ గ్రహించు శక్తి వారి నుండి ఇంకను తొలగిపోలేదు. తొలగదు.

కామమును బలవంతముగ నణచివేయజాలమను మాట సత్యమే. దానికి న్యాయమైన తృప్తి యుండవలెను. విషయములను బలవంతముగ కట్టిపెట్టినంత మాత్రమున వాని యెడల రసము పోవుట లేదనియు, రసము పోయినగాని విషయముల ప్రభావ మంతరించ దనియు గీత చాటుచున్నది. కాని స్త్రీ,

పురుషులు, దేహ మాత్రకలు కారు. బాహ్యావయవములతో కూడిన రక్త, మాంస, పిండ మాత్రులే కారు. జీవిత మింత కంటె నుత్కృష్ట మైనది. జీవితము నుండి పిండ వలసిన సుధ విషయానుభవముల కంటె మిన్న యైనది. విషయోన్ముఖత, నాత్మోన్ముఖతకు త్రిప్పుటకే వివాహము, కళత్రము, గృహము నేర్పడినవి. మానవు డాసించు నిత్యానంద మాత్మమయమగు నేకత్వము లోనే కలదు. ఆత్మైక్యతలో వీరువురు పొందు ఆనందమున కంతు లేదు. ఇట్టి స్థితిలో పొందు వికాసమే వికాసము. ఇట్టి యభివృద్ధియే యభివృద్ధి. ఆర్థిక, సాంఘిక, రాజకీయాది ఇతర సామ్య వాదములు దీనిని నిరాకరించు వో నిరుపయోగములగు నట్టివి పొసగనా పొసగనేరవు.

కం॥ పాతివ్రత్యము గలిగిన నాతి యనగ దైవ మన జనస్తుత వే
యాతత ధర్మార్థ సుఖ ఖ్యాతులు సద్భార్య వలన గాదే
గలుగున్॥

అని భారతములో నిర్ణయింప బడెను. తానే దైవము కాగల సహజ స్థితిని పోగుట్టుకొను స్త్రీ వెంగలి కాక యేమగును? ఇది యామె ధర్మమే గాక యామెకు గల సహజమైన హక్కు.

యథార్థ మిట్లులుండ పాతివ్రత్య మన నొక పురుషునకు బానిసత్వ మని, యతని చెప్పుచేతలలో బానిసవలె పడి యుండవలె నని, యతడు కొట్టినను, తిట్టినను, వ్యభిచరించినను, పడి యుండవలె నని శ్లోకములను గుప్పుచు వాదించు పండిత

ప్రబువు లెందరో గలరు. పాండిత్య మెప్పుడు వెనుకకే చూచు చుండును. జ్ఞానము వర్తమానమును, భావిని పర్యాలోకించును.'' అని రామతీర్థస్వామి నుడివెను. పాండిత్యమున కనుభవముతో సంబంధ ముండనక్కర లేదు. అనుభవము లేని పాండిత్య మక్కరకు రాదు. యదార్థమునకు విశృంఖలత్వమును స్త్రీ పురుషు లిరువురకును పనికిరాదు. వివాహ కాలమున యుభయులు కలిసి ఏడడుగులు వేయుదురు. అప్పుడు వరుడు వధువుతో నిట్లు ప్రమాణము చేయును.

'సఖా సప్త పదా భవ. సఖాయౌ సప్త పదా బభూవ, సఖ్యం తే గమే యగం, సఖ్యాత్తే మాయోషాగ్ం, సఖ్యాన్మే మాయోష్ఠా స్సమయావ సంకల్పావహై! స ప్రియౌ రోచిష్ణూ సుమనస్య మానౌ, ఇష మూర్జ మభి సంవసానే సంనౌ మనాగ్ంసి సంవ్రతా, సముచిత్తా న్యాకరం. సాత్వ మస్య మూహ మమూహ మస్మి. సా త్వం ద్యౌ రహం పృథ్వీత్వగ్ం, రేతోహగ్ం, రేతో భర్త్వాం మనోహ మస్మి వాక్త్వగ్ం॥''

నాతో నేడడుగులు కలిసి వేసి, నాకు స్నేహితురాల వగుము. కలిసి ఏడడుగులు వేసిన మన ముభయులము స్నేహితులమైతిమి. నేను నీ స్నేహము పొందు చున్నాను. నీ స్నేహము నెన్నడు వీడను. నీవున్ను నా స్నేహము వీడకుము. ఉభయులము కలసి యుండి, మన కర్తవ్యమును నిశ్చయించు కొందము. అన్యోన్యము ప్రేమించుకొను వారమై, యొకరి వలన నొకరు ప్రకాశించు వారమై, యర్థబల యుత్సాహబల

ములతో సాగరారు చుందుము గాక! మన రెండు మనస్సులు నేక స్రోతస్సుగ ప్రవహించునట్లు నేను చూతును. నేను సామమును. నీవు ఋక్కువు. నేను ఆకాశమును. నీవు భూమివి. నేను రేతస్సును. నీవు రేతస్సును భరించు దానవు. నేను మనస్సును. నీవు వాక్కువు.''

ఈ యాదేశముతో యుభయులు నడచునప్పు డీక కానలసిన దేమున్నది? ఇందులో సాహచర్యము పరస్పరత, సహకారము, సామ్యత, కలవే కాని ఇతర వికారము లెవ్వియు లేవు. వీనిని ధర్మ మనండి, హక్కనండి, పాతివ్రత్య మనండి, పత్నీవ్రత మనండి, సాహచర్య మనండి, దాంపత్య మనండి, స్వాతంత్ర్య మనండి, అస్వాతంత్ర్య మనండి. ఏ పేరు పెట్టినను, నిది యుభయత్ర నెరవేర వలెనే కాని యేక పక్షీయము కాకూడదు. అట్లగుచో వివాహ ప్రయోజనమే చెడిపోవును. ఇదియే న్యాయమైన సృష్టి. ఈ మార్గము వీడిన నాడు స్త్రీకైననూ, పురుషునికైనను అధోగతి కనేక మార్గము లేర్పడును.

ఎప్పటికైననూ ప్రేమయే బుద్ధికంటె గొప్పది. ప్రేమ లేని బుద్ధి నీరులేని మేఘాడంబరము వంటిది. ప్రేమలో నీశ్వరత్వ మున్నది. ప్రేమయే లోకమును జయింప గలదు. కాని బుద్ధి జయింపజాలదు. కనుకనే పాణిగ్రహణ కాలమున వధువు తన కరపల్లవమును వరున కిచ్చి 'నన్ను నీ కర్పించుకొను చున్నాను'

అని అనును. వరుడీ ప్రేమను గ్రహించియే 'ఈ రెండు చేతులు, మన రెండుచేతులు, మన యిరువురము కలిసి ఈశ్వరున కర్పణ మగుదుము గాక' అను మహదాశయమును వెలిబుచ్చుచున్నాడు. ఇట్టి దాంపత్యము చేతనే లోకము జయించబడుచున్నది.

పర్మను సిపాయి చేసి వెంటనే వివా
హ్యము చేయరాదు. [illegible] యభి
మానము చేరాదు. ఉద్రేకము చల్లారిన
పిమ్మటనే యతను మార్గము గనవలెను.

నాగరిక జీవనములో కూడ ప్రతివారి
[illegible] మంచిది. రాచి
రావాడు [illegible] దంపతులు, సాగుచు మోటారులు
[illegible], [illegible]
త్రిమ్మ భక్తులు సదా పరుల సేవనులనే వెదకు
చుండు సంగ్రామ [illegible] బృందము
మొదలగు వారి [illegible] లున్నపుడే
సంఘము బాగుపడును.

# వివాహము - ప్రేమ.

వెనుకటి వ్యాసములో స్త్రీ, గృహము యవినాభావములని గ్రహించితిమి. నాగరికతకు, విద్యకు, సమస్త సద్గుణములకు, నదియే మూలకందమనికూడ నెరింగితిమి. వివాహము, ప్రేమ యను విషయము కూడ జీవిత సర్వస్వము, జీవితమునకు పట్టుకొమ్మ యగుచున్నది. స్త్రీపురుషుల నధోగతికి లేక నత్యున్నత స్థితికి తీసుకొనిపోవు నది యిదియే. దాంపత్య రహస్య మెరుంగక విచ్ఛేదములైన కుటుంబము లెన్నియో గలవు. ఈ రహస్య మెంత ముఖ్యమైనదో యంత సున్నితమైనది. లలితమైనది.

దీనిని చర్చించుట కెంతయో చారిత్రక దృష్టి, సమగ్ర జీవిత పరిశోధన, మానవ పరిణామ జ్ఞానము, యిత్యాది సునిశిత సామగ్రి కావలెను. ఈ రోజులలో నీ చర్చ యనేక భ్రమ ప్రమాదములకు లోనగుచున్నది. ప్రేమ నిర్వచనము చాల గందరగోళముగ నున్నది. ప్రేమ ముందా? వివాహము ముందా? వివాహ మయిన తర్వాత ప్రేమ లేకపోయినచో నేమి చేయవలెను? ప్రేమించుకొని వివాహము చేసికొని కొంత కాలమైన తర్వాత ఆ ప్రేమ యెగిరిపోయిన నేమి చేయవలెను? ప్రేమించుకొని వివాహము చేసికొని విడిపోయి తిరిగి ప్రేమించుకొని తిరిగి, వివాహమాడి నూత్న యనుభవముల ననుభవించుచు పోరాదా? ప్రేమకు, వివాహమునకు లేనిపోని ఏవి

త్రతత నాపాదింప నేల? అను జిలిబిలి వాదము లనేకము లున్నవి. ప్రేమ వృత్తాంత ముదారుల జీవితములలో నెట్టి సంస్కార మును పొందుచున్నదో మొదట గ్రహించుట న్యాయము.

కస్తూరీబాయి, గాంధీజీల దాంపత్యము నీ సందర్భ ములో గ్రహింప దగును. గాంధీజీకి కస్తూరిబాయియందు గల ప్రేమ యనన్య మైనది. ఆమె వలె మరే యితర స్త్రీ తన హృదయమును చూరగొని యుండ లేదని మహాత్ముడే చెప్పెను. ఆమె కంటె యందమైన స్త్రీలు గలరు. అతని కంటె యందమైన పురుషు లెందరో గలరు. కాని కస్తూరీబాయి తన హాస్యము నేనాడాతని కర్పించెనో, యానాడే యతనిలో లీనమై పోయెను. అతడీ రెంటిని గలిపి భగవత్సేవకు, దేశసేవకు, మానవసేవకు నర్పించెను. ఈ దాంపత్యములో నున్న ఘనత గమనింప తగినది. అనగా వారి కప్పు డప్పుడు అభిప్రాయ భేద ములు, స్వల్ప గృహచ్ఛిద్రములు, గలుగనే లేవని యర్థము గాదు. ఆ గాథ యంతయు మహాత్ముడే తన యాత్మకథలో వివరించెను. కాని వారి యరువది రెండేండ్ల జీవిత స్రోతస్సులు గంగా యమునల వలె మిళితములై ప్రవహించి యన్యోన్య యౌన్నత్య మొంద గలిగినవి. కస్తూరిబాయి చదువను, వ్రాయను తెలియని సామాన్య యువతి. జీవిత కళాశాలలో దక్క మరే ప్రాక్పశ్చిమ కళాశాలలో నామె పట్టము పొంది యుండ లేదు. మహాత్ముని వలె పాశ్చాత్య విజ్ఞాన సారమును, మన విజ్ఞానధన యుత్కృష్టతను జుట్టజుట్టగ జుట్టుకొని యుండ

లేదు. బుద్ధిబలముతోనే మహాత్ముని మహాత్త్వమును కనుగొనగల మార్గము నేటి వరకు దానిని తూచజాల కున్నారమనుటలో నానంతయు సందేహము లేదు. దీనిని పండిత జవహర్‌లాల్ నెహ్రూయే నిరూపించి యున్నాడు. తన తర్కము ద్వారా మహాత్ముని తర్కించి తర్కించి చివరకు మహాత్ముడేదో చెప్పలే నను అందులో తర్కమునకు అందని దేదియో యుండునని జవహర్ పండితుడు తన యాత్మకథలో నుడివెను. కాని యహంకారము లైనను తిన్నగా రాని కస్తూరిబాయి హృదయ పద్మమందు మహాత్ముని నామము వలెనే యతని మహాత్త్వ కూడ సంపూర్ణముగా పోవుటయు నామె చివరకు దాని నతనితో కూడ పంచుకొనుటయు మన మెరిగిన కథయే. హృదయము లేక ప్రేమ యెట్టి తక్కువ జీవితమునైన నత్యున్నత స్థితికి గొంపోవు రసాయనము. ప్రేమ లేక ఏకత్వము నెదుట నున్న గొప్పతనము నాకర్షించు దివ్యశక్తి. అనన్య శక్తి. విద్యు చ్ఛాస్త్రమును మన మెరుగుదుము గదా? ఈ శాస్త్ర మేమి చెప్పుచున్నది? ఈ శక్తి గల వస్తువుతో ప్రత్యక్ష సంపర్కముగల వస్తువులో ప్రవహించు విద్యుత్తు మొదటి వస్తువులోని విద్యుత్తు నంటుకొనియు దాని కొకింత సమీపములో నుండి దానిని సరాసరి కలియని దానిలో తద్విరుద్ధమైన విద్యుత్తు ప్రవహించు ననియు నీ శాస్త్రము చెప్పుచున్నది. మహాత్ముల జీవిత విద్యుత్ప్రభావ మట్టిదే! ప్రేమ యన నట్టిదియే! నిమ్నోన్నతములు, గుణదోష ములు, బుద్ధి భేదములు, ప్రేమ రసములో కరిగిపోయి నూతన శోభను పొందుచున్నవి. ఇది యాదర్శ వాదమనియు,

ప్రపంచములో నిట్టి దాంపత్యములు కోటి కొకటి యుండు నేమో యనియు, నిది సామాన్యుల కందని విషయమనియు వివాహమైన తరువాత నొండొరుల కే కారణముచేతనైన కిద గినచో నిక యుపాయము లేదా యనియు, వివాహములో శరీర సుఖమే ప్రధాన మనియు, దానిని మొట్టమొదట కను గొనుట కష్టమనియు, నట్టివారైనను సాధారణముగ ప్రమాద ములు చేయుచుందురు గదా? వివాహరీత్యా కలుగు ప్రమాద మునకు పరిహారమే లేదా యనియు నంగ సౌష్టవమునకు, సంద చందములకు తావు లేదా! యనియు కొన్ని సంశయములు కలవు.

దీని కొక్కటే సమాధానము గలదు. "ఈ జీవిత మార్గమున మన మొక్కసారియే బోదుము. ఒక్క రోమను చక్రవర్తి చెప్పినట్లు అనేక జీవితములు కలవాని వలె మన కున్న జీవితమును చిమ్మివేయ జాలము." జీవిత సుధానుభవములో సృష్ట్యాదినుండి నేటి వరకు గలట్టియు నెప్పటి కప్పుడు మన కండ్ల యెదుట ప్రదర్శింపబడు నట్టియు నుత్తమోత్తమ జీవిత సాదృశ్యములనే గ్రహించి యుత్తమాశయ భూయిష్ఠమైన జీవితమును గడుపుటయే పురుష లక్షణము. అట్టి జీవితమే చరితార్థత నొందు జీవితము. అట్లుగాక "జీవితము మట్టి. మట్టి తిరిగి మట్టియై పోవుటయే పరమార్థము." అను వాదము మృషావాదము; అజ్ఞాన కృతము. "శరీరమే మానవుడు కాదు. అతడంత కంటె ననేక రెట్లు యుత్కృష్టత గల యొక వస్తువు" అని మహాత్ముడు ఘోషించినాడు.

శీల సంపదకు సంబంధించినంత వరకు జీవిత శాఖలన్నింటి లోను మనము నిర్దుష్టమైన యాశయములను, ఆదర్శములను పొందవలెనే కాని ప్రజాసామాన్య మవలంబింప జాలరను నెపమున వానిని కొంచెపరుప రాదు. ఆదర్శ మెల్లప్పుడు ఆదర్శముగనే యుండ వలెను. ఏ ఆదర్శ పురుషుడైనను ప్రజా సామాన్యము నుండి పుట్టి దానిని పొందిన వాడే గాని పుట్టుక తోనే యాదర్శ పురుషుడగుట లేదు. ఏ ఆదర్శమున కైనను అనర్హుడైన వాడు లేడు. ప్రయత్న మొక్కటియే నిజమైన యర్హత. సత్యమే చెప్పువారు నూటికెంత మంది కలరు? ఆరోగ్య విధులను తు. చ. తప్పకుండ నాదరించువా రెంద రుందురు? ఇతరులను కొల్లగొట్టకుండ నితరుల యాస్తిపై కన్ను వేయకుండ నుండు వారెందరు? పరోపకారు లెందరుందురు? సమగ్రమైన యభివృద్ధి పొందిన వారెంద రుందురు? అతి తక్కువ. కనుక నివి పనికి మాలిన వని యన గలమా? సంఖ్యా బలమును బట్టి జీవిత ప్రమాణముల నేర్పరుప వలసి వచ్చినచో నే ప్రమాణము నిలుచును? మన మూరకొనిన ప్రకృతి యూరక కొనునా? ప్రతి యత్యాచారమునకు మనము దండన వడ్డితో సహా చెల్లింపక తప్పదని ప్రకృతియే విశదము చేయు చున్నది. ఓడ సముద్ర మధ్యమున సంచారము చేయుచుండ తీరమును సూచించు దీపగృహ మేదియు గాన్పింపనిచో నది యే తీరము చేరును? తీరమే లేని ప్రయాణ ముండునా? ప్రేమ సంచారము నకు తీరము లేదా? పక్కతోవనో, రెండు కాక పోవుటయో,

నొక్కటి యగుటయే దాని గమ్యము. ప్రేమను సూచించు దీపగృహ మెట్టిదిగా యుండ వలెను? జ్ఞాన మనెడి దీపగృహ సహాయముతో ప్రేమ ప్రేమలో నైక్యముకానిచో దానికి వేరొక గమ్యము లేదు. ప్రేమయే ప్రేమకు పరమావధి. ప్రేమ నే ప్రేమకు పారితోషికము. ప్రేమ నిర్వచనము చాలా క్లిష్టమైన విషయము. ప్రేమ యెంత సామాన్య మైనదో అంత యసామాన్యమైనదని గూడ చెప్ప వచ్చును. అది యెట్టి సీమలను యెరుగని దివ్య శక్తి. దివ్య రసము.

కామము, విశ్వాసము, ప్రేమ: ఈ మూడు ప్రేమ నొక్క యంతరువులు, ఛాయలు. కామము జంతు సంబంధమైనది. శరీర సంబంధమైనది. "భూతములందు ధర్మ విరుద్ధము కాని కామమును నేను" అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో వచించి యున్నాడు. కనుక కామమున కొక నిర్ణీత స్థానము కలదు. దీని కొరకే వివాహ సంస్కార మేర్పడెను. దీనిని మొదటి నుండియు జయించి యీ శక్తిని విశ్వాసము క్రింద, ప్రేమ క్రింద సమగ్రముగ మార్చివేసి పునీతాత్ములై లోకము నుద్ధరించిన వారనేకులు గలరు. రామకృష్ణ పరమహంస, వివేకానంద, దయానంద, శంకరాదులీ కోటిలోనివారే. వివాహము నొల్లక కామశక్తినే ఇంకొక విధముగ తరలించి లోకసేవ చేసిన పి. సి. రే, అశ్వినీ కుమార దత్తు, దీనబంధు ఆండ్రూసు, సోదరి నివేదిత మొదలగు నిత్య బ్రహ్మచారులు, బ్రహ్మచారిణులు నెందరో గలరు. వీరందరికీ గల విశ్వాసము, ప్రేమ

యుపారము. నిష్కళంకమైనవి; యున్నతస్థాయికి చెందినవి. కామ సంబధ మెంత మాత్రము లేనివి.

కనుక కామము ప్రేమరూపములలో మొదటి స్థాయికి చెందినది. అది ప్రేమకొక యుపాంగమే కాని ప్రేమ సర్వస్వ మనుటకు వీలులేదు. మానవజాతి కట్టిది పొసగ నేరదు. జంతు ప్రేమ కేవలము కామజనితము, కామ బద్ధము; మానుష ప్రేమకు కామమే మూలము కాదు. కా నక్కర లేదు. మానుష ప్రేమలో మానసిక రంగమున కంతులేని స్థానము కలదు. విశ్వాస, ప్రేమలు మానసిక సంబంధమైనవి. అవి కామముతో సంబంధము లేకుండగనే దోహదము చేయబడ గలవు; చేయ బడ వలయును.

కామమును విశ్వాస, ప్రేమలతో మేళవింప చేసు కొనుచు, పునీతము చేసికొనుచు ననుభవింప వలెను. అది లేని కామము జంతు క్రియ. దానిలో రసానుభూతియు లేదు; సృష్టియు నుండజాలదు. కేవల కామ కృత్యము పశుకర్మయే యగును. బలవంతముగ చెఱచుట ప్రేమ యగుచున్నదా? విశ్వాస ప్రేమలు లేనిచోట రసానుభూతియే లేదను నప్పుడు కొన్ని యనుభవము లైన తరువాత గాని ప్రేమకు స్థాయి కుదర దనుటలో నర్థ మేమున్నది? విశ్వాస, ప్రేమలు లేని వివాహము ఫల ప్రదము కానేరదు. అవి యున్నప్పుడే, వాటి సంపర్కముతోనే వివాహము చేసికొన వలెను. వంశము, పర దిట్టము, గుణ గణములు, అంద చందములు చూచు

కొని యే వివాహ మాడవలెను. విశ్వాసము ప్రేమ అను గుణములు లేక స్వభావములు పెండ్లితో సంబంధము లేకయే యలవరచుకొన వలసిన యమూల్య ధనములు. అవిశ్వాసి, ప్రేమ శూన్యుడు వ్యర్థ జీవులు, పెండ్లికి పూర్వమందు, పి మందు ఈ సూత్రముల ప్రకారము జీవించి నప్పుడే గదా వివాహమైనను సార్థక మగుట, కామతృప్తి గలుగుట జరుగును. అవి లేని వివాహము, దాంపత్యము చక్కబడ నేరదు. ఒకరి నొకరు విశ్వసింపక గృహమును నరక కూపములు చేసికొని చివరకు విచ్ఛేదములను, ఆత్మహత్యలను, చేసికొనిన వారెందరు లేరు? ఆధునిక శాస్త్ర విజ్ఞానములపేర కోర్టులలో నిత్యము నూతన ప్రేమ సూత్రములు దిగుమతి యగుచుండుటయు వానిని యమృత ఘటికల వలె మన నవ్యులు మ్రింగుచుండుటయు వింతగా నున్నది.

ఈ నవీన శాస్త్ర పండితు నొకనిని నేను చూచితిని. ఈయన సామాన్యుడు కాక ఎం. ఏ. డిగ్రీ పొందిన నవ్యక 'యతిరథుడు.' అనేకమంది యువకులను ప్రోగుచేయుచు, శాస్త్రముల పేర ఈ క్రింది బోధలను వర్షించుచుందురు. "మన ఛాందసుల కేమియు తెలియదు. వీరు, వీరి శాస్త్రములు నేది కూడదని చెప్పునో వాని నన్నింటిని మనము చేయవలెను. నేనీ శాస్త్రములలో నారితేరిన వాడను. స్త్రీ, పురుష సంబంధములలో "పవిత్రత" యిత్యాది విషయములు పిచ్చి మాటలు. విధి నిషేధములు మాయ వ్యాపారములు.

నియమము లనవసర తతంగములు. మాహాత్మ్యము ఛాందసము. నేను వీటి నన్నింటిని ధిక్కరించితిని. చూచితిరా? చేయరాని పనుల నెన్నింటిని చేసినను నేనింకను సజీవుడనై మీ యెదుట కనిపించుచునే యున్నాను. పిరికితనమును వీడి, కట్టుబాటులను త్రెంచి వేయుడు. అంటు, ముట్టు, కాలము, ఋతువు, రాత్రి, పగలు, ఇత్యాది దోషములు "తాటాకులలోన వ్రాసిరి పరాంగిన కూడ దహించు" అను నిర్జీవ వ్రాతల వంటివి." అని వీరు నిరంతర ప్రచారము చేయుచుందురు.

ఇది యంతయు ప్రేమ క్రింద చలామణి యట! అభివృద్ధి యట! కామశాస్త్ర మట! 'ఇంతలు కన్నులుండ తెరు వెవ్వరి వేడెదు?' అను నట్లు, కండ్లు కలిగిన భాగ్యము వాని నుపయోగించుటలోనే కలదు. కన్ను లుండియు దూరపజాలకె పోవుటయే మానవ విషాదమునకు కారణ మగుచున్నది. స్త్రీ పురుషుల కలయిక మృత్పిండముల కలయిక వంటిది కాదు. జ్ఞానహీనమైన పశు కర్మయు కాదు. ఏ శాస్త్రము లైనను, ఏ సూక్తుల నైనను, ఏ సిద్ధాంతముల నైనను ప్రాతవని కారణము చేతనే యూదరింప నక్కరలేదు. అట్లే యవి క్రొత్తవి కదా యని, దిగ్రమింగ నక్కర లేదు. సుమతులైనవారు దేని నైన యనుభవ మనెడి యొరపిడి రాయి మీదనే గీటు వేసి యంగీకరించుటో, లేక త్రోసి వేయుటయో చేయవలెను.

ఒక స్త్రీ తన భర్తను గురించి "మంచముమీద మగడు, మంచము దిగిన యముడు" యని చెప్పెడిది. చివర

కతని బాధ భరింపలేక యామె ఆత్మహత్య చేసి కొనినది. ఆమెకు శరీర సుఖమునకు లోటు లేదు. కాని యామెయే వివరించినట్లు తక్కిన దంతయు యమ లోకము. ఒక వివాహము సుఖప్రద మగుటకు శరీర సుఖ మొక్కటియే ప్రమాణము కాదు. కేవల మంద చందములు ప్రమాణము కావు. కాకి ముక్కుకు దొండపండు వలె మసిబొగ్గు వంటి వానికి స్ఫురద్రూపి భార్య కాగా యామెను విడిచి యే కురూపినో నెంటాడు వారు, మన్మథుని వంటి భర్త యుండగా తుచ్ఛతర వాని నొకని మోహించి లేచిపోవు వారును లేరా?

ఇరువది నాలుగు గంటల కాలములో శరీర సుఖము ననుభవించునది అత్యల్ప కాలము కదా? తక్కిన కాలములో వీరు పరస్పర మెట్లు ప్రవర్తింతురు? ఎట్లు భావించుకొను చుందురు? ఒకరి కొక రెట్లు తోడ్పడు చుందురు? ఎట్లు గౌరవించు కొందురు? ఒకరి కొక రెంత త్యాగము చూపుదురు? ఎంత సహనము ప్రదర్శింతురు? తమ గృహ మర్యాదల నెట్లు కాపాడు కొందురు? ఇరువంకలవారి నెట్లాదరింతురు? తల్లిదండ్రులను, అన్న దములను, అక్కచెల్లెండ్రను వీడి తన ప్రేమను చూరకొనుటకే వచ్చిన యా కన్నియ నత డెట్లాదరించును? ఎట్లు బుజ్జగించును? ఎట్లు పాలించును? ఆమె యెడల యెంత విశ్వాస ముంచును? ఆమె యన్నవస్త్రాది సౌకర్యముల నెట్లు చూచును? ఓరిమి, శాంతము, దయ, స్నేహ భావము, క్షమించుట, సరసత, ఉదారత, దక్షత,

యుపాయము మొదలగు వాని నతడు కలిగియుండునా? ఇవి యన్నియు శుష్కించి ముఖము మటమట లాడించు కొనుచు బుసబుస లాడుచు కొరివి వలె సంచరించునా? తన జీవిత నౌక నామె హృదయపు తరంగముల కర్పించి సుఖింప గోరిన యాతని స్వప్న సామ్రాజ్ఞి [illegible] విభూషిత యగునా? సహజ స్నేహ సరసా యగునా? ప్రియంవద యగునా? అన్న పాన మజ్జ నాదులతో, మృదూక్తులతో నతనిని తృప్తి పరచునా? ఇట్టి యన్నియో గుణగణము లిరువంకల కావలసి యుండగా కామమునకే ప్రాధాన్యత నిచ్చుట, అదియే ప్రేమ యను కొనుట యోగ్యముకాదు. మానవుడు జీవిత పోరాటములో ఫలప్రదుడగుట కెన్ని సుగుణముల నలవరచుకొన వలెనో వివాహ యాత్రను నిర్విఘ్నముగ మృదు మధుర రసభరితముగ సాగించు టకును నవి యుండవలెను. ఈ సందర్భములో హెక్రీసీలింకు అను నొక మానస తత్త్వవేత్త ఇట్లు వ్రాయుచున్నాడు. "వ్యక్తులను పరిశీలింప మొదలిడిన తొలి దినములలో శరీరమే ముఖ్యమను దృష్టిలో నే నుంటిని. కాని చెడిన వివాహము లకు గల కారణములలో కామ వికృతి తరుచైనది కాదని నేను తరువాత గ్రహించితిని. మరియు ఫ్రూడ్ వ్యాపింపచేసిన యసత్య కామ ప్రచారమే యనేక విఫలతలకు కారణ మని చెప్పవచ్చును. నిజమైన సమన్వయము కావలసిన చోటుల నిట్టి యనుచిత ప్రాధాన్యత దానిని కుదర్చకపోగా తమ దుఃఖము లకు కారణము వెదకికొను వారి మనస్సులలో నిది యసుఖ కారణముగి కల్పింపబడు చున్నది.

''వివాహ సాఫల్యత కవసరమైన శీల సామగ్రిలో కామ విస్మృతి యతి తేలికగ జయింపబడ గలదని నా పరిశీలనా సారాంశము. దానికంటె శీలము, స్వార్థరాహిత్యము, తత్సంబంధమైన యాచారములు ప్రధానమైనవి. వానిని జయించుట కెక్కువ సాధన కావలెను.'' బర్నాస్ట్ర సాక్సు అను మరియొక తత్త్వవేత్త ఇట్లు చెప్పెను. ''మొత్తము మీద కామమున కెక్కువ ప్రాధాన్యత ఇయ్య బడినది. ఇంకను ఇయ్యబడు చున్నది. అనేక ఇతర ప్రముఖ విషయములు విడిచివేయ బడుచున్నవి. అనేక ముఖాలవారు కామవిద్య బోధించుటకు గంటలు గంటలు వినియోగించు చున్నారు. అంతకంటె బిడ్డలకు నిజాయితీ, సత్యసంధత, పెద్దల యెడ గౌరవము, దేశ భక్తి, ఇరుగు పొరుగును ప్రేమించుట, మొదలగు యనేక సద్గుణములు బోధించుట మంచిది. కామము- దాంపత్యము కుదురు వరకు చేసుకొను పరీక్షా వివాహములు- అనురాగమును వెదకికొనుట- 'వివాహము కామతృప్తికి గల హక్కు.' మొదలగు నూతన సూత్రములు వివాహ పవ మార్గము నుండి బుద్ధిని చెదరగొట్టు చున్నవి. కొద్ది విశాల దృష్టితో పరికించిన, యానందము ననుభవించుట కిద్దరు అసంపూర్ణులు తమ శక్తుల నైక్యము చేసికొను సోపానమే వివాహమని తేటపడ గలదు. ఈ విశాల ప్రపంచములో సతీ స్థాపనముగ వర్తింప గలుగుటకే తామొక సాంఘికావరణము నేర్పరచుకొను చున్నారు. మానవుని క్రమాభివృద్ధికి (భౌతికము-

ఆధ్యాత్మికము) వివాహ మొక సోపానము. ఇది యానంద మున కొక యవకాశమే. కాని దానిని దానము చేయు దాన పట్టా కాదు. జీవితములోని ఇతర శాఖలలో నట్లే అట్లే వివాహములోను మనము విజయమును శాసింప జాలము. మనమే దానిని సాధించికొనవలెను...... వివాహము తమ జీవితమును నిర్మించుకొనుటకై ఏర్పడిన ధర్మసంస్థ కాని దిట్టదనమును కనుగొను ఒక సాధనము కాదు. తల్లిదండ్రులు తమ బిడ్డలకు దగిన వారిని చూచి యిట్టి దాంపత్యమును సుస్థిరము చేసికొను నట్టి సంఘము పూర్వ సాంప్రదాయములో నా కెంతయో గౌరవము కలదు. తమంతట తాము చేసుకొను వివాహములు సుఖమును మిశ్రముతో కాని కేవల సుఖప్రదములు కావు. దీని వలన చాలమంది తమకే విభాగము కలుగు నరకు వివాహముల వాయిదా చేసికొను చున్నారు. పెండ్లి చేసికొనని వారిలో వారు చాలమంది చిన్నను వివాహము చేసికొన జాలని పోవుచున్నారు.''

దాంపత్యమును సుఖప్రదము చేయగల సాధన. సంగ్రహణ శక్తి, భావ్యము పొందికలో ప్రేమ భావము. ప్రసన్నత, హృదయ సౌశీల్యత, స్త్రీ పురుష సాహసములు. ఆనంద స్వభావము మొదలగు గుణములు వివాహమును విజయవంతము చేయుటకు తోడ్పడును.

గిరిజాల జుట్టు, అందమైన రూపము, శరీర పుష్టి, తీర్చి దిద్దినట్లుండు ముఖ లక్షణములు, ఇత్యాదు లెంత ముఖ్యము

లైనను, నిట్టి సామగ్రి కల వారెట్లు ప్రవర్తింతురను దానికంటె ముఖ్యములు కావు."

"ఎట్టి ప్రయోజనములు లేక చిహ్నములు కలిగి యున్న సుఖము కలుగునో నిరూపించి చెప్పుటకు నాకు తెలిసినంత వరకు మనస్తత్వ పరిశోధనలలో నేదియు కన్పింప లేదు. కొందరు తీవ్ర పరిశోధన జేసి సుఖ వివాహముల కాదంపతు లెక్కువ స్వార్థరహితు లగుటయే కారణమనియు, విడాకు లిచ్చుకొనిన వారికి, దుఃఖ వివాహములకు వారి స్వార్థపరత్వమే కారణ మనియు నిర్ధారణ జేసిరి. గార్హస్థ్యోచితమైన సుగుణ ములకు స్వస్తి చెప్పి బుద్ధి కెక్కువ ప్రాధాన్యమి నిచ్చుటే గొప్ప యపకార మని కనుగొన బడెను. ఇతర విషయము లలో వలెనే వివాహ విషయమున గూడ ప్రజలు బుద్ధి జాడ్య మునకు గురి కావచ్చును."

కనుక కామమే ప్రేమ కాదు. అది యొక్కటియే ప్రేమకు ప్రమాణము కాదు. కొంత కాలము గడచిన తరు వాత దాని వడి తగ్గును. వడి తగ్గిన తరువాత ప్రేమ ప్రారంభ మగును లేదా స్థాయి పడు ననుటలో న్యాయమేమియు కని పించదు. ఉష్ణము, తేజము, విద్యుత్తు మూడు శక్తులు. మొదటిది రెండవదిగను, రెండవది మూడవదిగను, మారుచు విద్యుత్తు సర్వ శక్తివంత మగుచున్నది. అట్లు కామము విశ్వాసముగను, విశ్వాసము ప్రేమగను రూపాంతర మందుచు ప్రేమ సర్వ సమర్థమై సర్వమును తనలో లీనము చేసికొన గల్గుచున్నది.

ఈ కామ గందరగోళములో వివాహము యొక్క వివిధ ప్రయోజనములు మరచిపోబడుచున్నవి. వంశ వర్ధనము, సంఘ శ్రేయము, ధర్మ నిరతి వివాహ ప్రయోజనములు కావా? స్త్రీ పురుషులు తీర్చుకొన వలసిన ఋణములలో సంతాన మొక ఋణముగా లెక్క వేయ బడినది. ఇది జాతికి, దేశమునకు, సంఘమునకు తీర్చవలసిన ఋణము. చెట్లు కూడ చనిపోవు లోపల కాయలు కాచియే చచ్చిపోవును. పాశ్చాత్య లోక మొక వంక కృత్రిమ మార్గముల ద్వారా సంతాన నిరోధము, మరియొక వంక సంతానాభివృద్ధి చట్టములను, చేసికొని పడరాని యగచాట్లు పడుచున్నది.

అన్యోన్యార్పణ, యుదారత, హృదయ సంస్కారము, గుణాతిశయములు, త్యాగశీలనములు గల తావులందు కలుగు సంతానమునకును, కామతృప్తికై మొరటు జీవితమును జీవించు వివాహముల వలన గలుగు సంతానమునకును, వ్యత్యాసము గలదని యనుభవము చాటుట లేదా? దీని వలన సంఘమున కెంత ముప్పు వాటిల్లునో మనము గ్రహింప వలదా? గొప్పవా రెట్లుద్భవింతురు? గొప్పమనము నుండియే, గొప్ప భావముల నుండియే, సాహసాది గుణసంపత్తి నుండియే గొప్పతన ముద్భవిల్లును. హృదయ మందలి గొప్పతనమే గొప్పతనము గాని వెండిపొన్ను కఱ్ఱలు, పెద్దపెద్ద బిరుదులు. వేలకొలది జీతములు, పాంటైకు కారులు, సిమెంటు భవనములు నిజమైన ఘనతకు చిహ్నములు కాజాలవు. ఏదేశమున కైనను గొప్ప భావములు

గల కొద్దిమందియే ప్రాణాధారములు కాని యల్ప భావములు
గల దురోదర ఘనులు పూజార్హులు కాజాలరు. ఒక్క—
మహాత్ముడే మన దేశమున కెంతటి ఘనతను ఘటింప గలిగెను?
రోము నగరము తగలబడు చుండగా నీరో చక్రవర్తి వీ
మీటుచుండె నట! నే డిట్టి ''నీరోలే'' తమ యధికారము
కొరకు, స్వార్థముల కొరకు, భోగ భాగ్యముల కొరకు ప్రపంచ
మును యుద్ధములతో ముంచి వేయు చున్నారనుటకు సందే
యము లేదు.

ప్రపంచ మొక యున్నత స్థాయిని, యుదారతను,
స్వాస్థ్యమును, మనశ్శాంతిని పొందవలె నన్న స్త్రీ పురుష
హృదయ సంపద యభివృద్ధి నొందవలెను. గొప్పతన మిట్టి
నుండియే జనింప వలెను. విషయముల కంటె, ధనధాన్యముల
కంటె, వివిధ పదవుల కంటె, చంద్రకాంత శిలామయ కుట్టి
మముల కంటె, మానవ హృదంతరాళ జనిత సంపదయే యస
మాన సంపద. అది లేని జీవిత మెన్నింటితో తులతూగినను,
రాణింప నేరదు. చల్లని గృహచ్ఛాయ లందే, ప్రేమ పూరిత
సరస జీవిత చందనము నుండియే, యాత్మోన్నత్యమును చూరు
గొను జీవితము నుండియే గొప్పతనము జనింపగలదు. వివాహ
మాడినచోటనే ప్రేమింప వలెను. ప్రేమించిన చోటనే వివాహ
మాడవలెను. ప్రేమయే వివాహము. వివాహమే ప్రేమ.

# శిల్పము - వెట్టి.

స్త్రీలలో నేమి, పురుషులలో నేమి, విద్యాధికులలో నేమి, విద్యాగంధము లేని వారిలో నేమి, కార్మికులలో నేమి, కర్షకులలో నేమి, యువకులలో నేమి, వృద్ధులలో నేమి, మానవులలో సామాన్యముగ రెండు రకములవారు కాన్పింతురు.

ఒక రకమువారి పని యందుత్సాహము నూతనత్వము, ప్రయత్నము, అభిరుచి, కళ, తన్మయత్వము, హాయి సుఖము కాన్పించును. వారికా పని యెంతమాత్రము భారము కాదు. ఆ పనికిని వారు బరువు చేటు కాదు. వారి వ్యక్తిత్వ మాపని మీద ముద్రితమై జీవము పోసి నర్తించును. వారి చేతిలో జడ పదార్థము జీవ సంపదగా మారి పోవును. సౌందర్యము, జీవిత సౌభాగ్యము వారి పనుల కాటపట్టు లగును. ఓర్పు, నేర్పు కలిగి వారు తమ తమ పనులను ముచ్చటగ చేసికొని పోవు చుందురు. వారిముందు పని, పనిముందు వారు పరుగు లిడు చుందురు.

ఇంకొక రకము మనుష్యులు కలరు. వీరు సౌందర్య దూరులు. వీ రేపని ముట్టినను దానిలో నందచందము లుండవు. వీరు పనిలో లీనము కారు. అది వారికి గాడిద చాకిరివలె, పీడ వదల్చుకొనుట వలె, పెను భూతము వలె కాన్పించును. వారి పని శనగలు తిని, చేయి కడుగు కొను నట్లుండును. పని పట్ల విముఖత, శ్రద్ధ చూపక పోవుట, దాని నట్టేట [illegible]వేసి

బయట పడవలెనను యలసత వీరి లక్షణములు. పని చేయుటయే మానవ ధర్మము. మనము పని కొరకే నిర్మింపబడితిమి. ఆ పనిని మనమే నిర్ణయించుకొని, యుక్తరీతులము కావలెనను జ్ఞానము లేక పోవుటయే దీనికి కారణము. పని యందు రుచి లేని కారణముచే వీరి పని యందును రుచి, శుచి, యందము చందములు, నిండుతనము కానరావు. కాలమును హరించుటే వీరి పని. ఇట్టి వారికి కాలము గడచుటయు కష్టముగా నుండును. కొంతమంది 'బెల్-బిల్' అనగా గంట కొట్టుట, జీతముల బిల్లు తయారు చేయుట. 'పిల్-బిల్': మాత్ర వేయుట, వైద్యపు బిల్లు వ్రాయుట యను పనితోనే సరిపెట్టుకొను చుందురు. కాని, తమ వృత్తి లోని పని వెనుక నున్న యుదాత్తతను, రసపుష్టిని, సౌందర్యమును అనుభవింప జాలరు.

ఒక్కొక్క యింటి యందము, నిండు తనము చెప్ప నలవి కాక యుండును. భాగ్య భోగ్యములు, వెండి బంగారములు, చీని చీనాంబరములు లేకున్న లేక పోవచ్చును. ఇన్ని యున్నను ఆనందము, శాంతి సుఖము లేని భవనములు రాతి కోటలు లెక్కకు మిక్కిలు గలవు. ఇవి లేకపోయినను తల్లుల సరస సల్లాపములు, ప్రశాంత వాతావరణము, నిరాడంబర సౌందర్యము, నిర్దుష్టమైన శరీర మానసిక శౌచము, శుభ్రత, రంగవల్లులు, యథోచిత గృహారామ శృంగారములు, అతిథి యభ్యాగతుల నాహ్వానము చేయు కమ్మ తెమ్మెరలు, మృదు మధుర సుస్వాగతములు- యిట్లన్నియో మురిపెములతో

ముచ్చటలు గూర్చుచుండు సుఖాస్పదము లగు గృహాములే గృహాములు. ఒక్కొక్క తల్లి శిల్ప దేవత మూర్తిభవించి పల్లు శిశు హృదయములను నాటుటలో, బిడ్డలను లాలన పాలన చేయుటలో వారికి విద్యాబుద్ధులను గరపుటలో, దిన కృత్య ములను నిర్వహించు కొనుటలో, శరీర వస్త్ర పారిశుధ్యములో, భాండ శుద్ధిలో, పాక నైపుణ్యములో- సిది యది యననేల నామె యేది ముట్టినను దానిలో లీన మగుచు, నెంత చేసినను చేసి నట్లుయుండక, విసుగు కొనుట గొణుగు కొనుట యనునది లేక, నింట నున్న ప్రతి వస్తువునకు తన నిండుదనముచే శోభను పెంపును ప్రసాదించిన గృహాలక్ష్మియే యగును. ఇట్టి గృహాము స్వర్గ తుల్యము, భూతల స్వర్గము. ఏ యింటి స్త్రీ కలకల లాడునో యది యో యిల్లు. గోపతి భీకరారణ్యములను, నిబిడ నీరంధ్ర కాంతార సీమలను దివ్య ధామములుగ మార్చి వేయును. నిత్యము సౌధాంతర సీమలలో మెలగు సత్యభామ నవరస పాయసాదులతోను, రజత కాంచన పాత్రలతోను చెల గాటమాడు సత్యభామ జీవిత రహస్యమును తెలసి సోధింప వలసినదని యామెను వేడు కొనుట చరిత్ర ప్రసిద్ధము. ఇట్టి యుదార సాదృశ్యముల నెన్నింటినో చూపవచ్చును. మహా త్ముల యాశ్రమము లిట్టివే!

పైన పేర్కొనబడిన యందచందములు లేని యిండ్లు, యింకొక రకపు తల్లులు యెందరో కలరు. ఇచ్చట పైదాని కంతకు తారుమారు. ఇచ్చట యేదిచూచినను కంటికి భారము.

ప్రతి పని వెట్టి, పీడ వదల్చుకొనుట. ఇంటి శుభ్రత, దేహ శుభ్రత, తిండి శుభ్రత యుండదు. ఎచ్చటి పెంట యచ్చటనే నిలువ. ప్రాసి తనము తాండవమాడు చుండును. ఉత్సాహము, ప్రయత్నము, కళ యే కోశము లోను కాన్పించవు. ఈ రకము వారికి పని యన్న చీదర, చికాకు. దానిని చివరవరకు నెట్టుచు, చివర కెట్లో వదలించుకొను చుండుదురు.

కొందరు స్త్రీలు కలరు. వీరికి స్వశరీరమే భారము. నిలువెల్ల యెడ్డి తనము, మడ్డి తనము, సోమరి తనము. పాపము వీరికి ప్రొయ్యి యన పెద్దపులి. భర్తయే నండుకొని భార్య వండి నట్లు నటించవలెను. 'అతిథులే తెంచిరేని' యిష్టమున్న, మర్యాదకు వస్తపకు రావచ్చును. లేదా, ఆ పని కూడ భర్తయే పెట్టుకొని భార్య తరపున కుమార్తెగా దాఖలు చేసికొనును. ఇక నాయింటి యందచందములను గురించి చెప్ప వలసిన దేముండును? ఇట్టి యిండ్లలో నిలుచుట కొండలు కంపించును. ఏవగింపు కలుగును. ఇల్లాలే యిల్లు కాని రాతి స్తంభములు, యినుప దర్వాజాలు, చల్లని గృహములు కాజాలవని మరియొక వ్యాసములో నిరూపింప బడినది కదా.

ప్రతి చిన్న పనికి, పెద్ద పనికి చీపురు కట్టలు చెక్క పేళ్లు ప్రయోగింపబడుట, గరిటెలు గంతులు వేయుట, బిడ్డల మీద, భర్తమీద కేకలతోను బొబ్బలతోను యింటి పెంకు లెగిరి పోవునట్లు కోతి చేష్టలు చేయుట, మొదలగు వింత కార్యము లున్న చోట సుంతయేని సుఖముండక పోవుటలో నాశ్చర్య

మేమున్నది? అచ్చోట లక్ష్మికిని తావుండ నేరదు. దైనిక కార్యములలో నెప్పు డెచ్చోట లోటు సంభవించి నను, పనుల కాపరి, దాసి మరియొకరు రాకపోయినను, నొక్కొక యిల్లాలు చీకు చింత లేకుండ సమస్తము తన నిత్య కృత్యముల దిద్దుకొని పోవు చుండును. ఏ పరిస్థితి లోను, సంకటపాటు పొందు టను నది యిట్టి వారెరుంగరు. ప్రతి పనిలోను వీ రానందమునే చూఱ గొందురు. తమ పనితనము, నేర్పు, యుల్లాసము వీరి పనులలో ప్రకట మగుచుండును. పనితో వీరు పందెము వేయు వారు వలె నుందురు.

మరియొక రకము వారు శోకనాట్యములు, పిండాకూళ్ళు, చావులు, దుంప నాశములు నోటితో జరుపుచు రణగొణ ధ్వనితో నిల్లంతయు చిందర వందర చేయుచు, స్త్రీ జన నిజ సౌకుమార్యమును పోగొట్టు కొనిన నారై ప్రత్యేక యమ లోకమును సృష్టించు కొందురు. ఇట్టి పురుష పుంగవులును లేకపోలేదు. వీరికి ప్రపంచ రచనలో నొక క్రమము, ధర్మము, ఉత్సాహము, ఉత్తేజము, సౌందర్యము అను నవి కానరావు. వీరికిని పని యనిన ప్రాణ సంకటము. పనిచేయుట గతిలేని వారి కర్మ యని వీరి సిద్ధాంతము. వీరు పనిలో తమ చిత్తమును, వ్యక్తిత్వమును ప్రవేశ పెట్టక దేనిని ముట్టినను దేనిని పట్టినను తట్ట తగులవేసి రొట్లో బయట పడ వలెనని మాత్రమే కాని ప్రతి పని నుండి పిండ వలసిన రసమును పిండరు. దానిని సొంతము చేయరు. పనిలో నానందము ననుభవింపరు.

మనము చేయు పనిలో మన కిష్టమున్నది, చేసిన విశద మగు చునే యుండును. ఇష్టముతో చేసిన పనిలో సుఖ ముండును. పని చేసినట్లే యుండదు. సణుగుచు, గొణుగుచు, మెటికలు విరుచుచు చేయు పని యందుండ జాలని హాయి, నిండుదనము, సౌకుమార్యము, క్రియాకౌశలము కాన్పించుచునే యుండును.

కర్మాగారములలో నేమి, విద్యా గృహములలో నేమి, ఆఫీసులలో నేమి, పొలములలో నేమి, యంత్రశాలలలో నేమి— సర్వత్ర యీ రెండు రకముల వారు కలరు. కొందరు జీవించుటే భారమైనట్లు వర్తించు చుందురు. కనుక వీరు ప్రతి పనిని ద్వేషించుచు దాని నెట్లో పీడ వదల్చు కొనునట్లు గెంటివేయు చుందురు. పని చేయకుండుటకే వీరి పని. చివర కిట్టివారు ప్రపంచమును ద్వేషించుచు, సమస్తము ద్వేష మయము చేసికొని, తాము సుఖింపక, నితరులను సుఖింపనీయక, 'తుమ్మ జాతి' మనుష్యుల వలె తయారగుదురు. మరి కొందరు తమకు ప్రాప్తించిన పని యందు లేదా, తామే నిర్ణయించు కొనిన పని యందు చొరబడి చరచర చేసికొని పోవుచు, చేసిన కొలది యానందము ననుభవింతురు. అట్టి వారికి ముందు గంటలు, రోజులు పలాయన మగుచు కాలమునకే కాళ్లు వచ్చినట్లు అనుభవింతురు. హృదయ పూర్వకముగ చేయు పనికిని, తద్విరుద్ధముగ జరుగు పనికిని భేదమెంతేని కలదు. ప్రతి యజమాని తన పనివాండ్రలో నెవరు దాచుకొనకుండ నుల్లాసముగ చేయు వాడెవడో, కంటగించుకొనుచు చేయు వాడెవడో గ్రహించును.

మొదటి వాడతని నాకర్షించును. రెండవవాని యందతని కాదరణ కలుగ జాలదు.

ఒక్కొక్క నేతపనివాడు చూపు పనితనమునకు హద్దుండదు. వాని పని శతాబ్దములవరకు కల్గి యుండును. అతని కేమిచ్చినను తీరదు. కాలిజోళ్లు కుట్టు మోచకని పని బిగితనము, నేర్పు, అందము శాశ్వతముగ నుండవలసినదే. ఆ పని యున్నంత కాలము వాని పేరు స్మరింపబడుచునే యుండును. ఒక చిత్రకారుని కుంచె, వర్ణ సమ్మేళనము, ఛాయాంతర రహస్యములు నిన్ను ముగ్ధ ముగ్ధుని, నిశ్చేష్టుని చేయును. ఒకొక్కని గాన రసము మొక్కలను చిగురింప జేయునని, రాళ్లను కరగించునని యనుటలో నాశ్చర్య మేమున్నది? ఒకని కవిత్వము ప్రకృతినే స్తంభింప జేసెనని వింటిమి. కర్రపని, రాతిపని, ప్రాణవంతము లగుట లేదా? తాజమహాల్ కట్టడములో నున్న పనితనమున కెవరు ఖరీదు కట్టగలరు? దానిలో కూర్చబడిన రాళ్లకు ఖరీదు కట్టవచ్చును. ఆ పనితనమునకో? దాని కదియే సాటి. వేల కొలది వత్సరముల క్రితము నిర్మింపబడి శీతాతప బాధల ననుభవించుచు వచ్చిన యనేక దేవాలయముల పనితనమును నేటికిని మనము నేత్రపర్వముగ చూచుట లేదా? తమ పనిలో తన్మయత్వము నొంది చేయువారి కృషి యంతయు, నది యేదియైనను, నిల్చి యుండును.

కొంతమంది యుపాధ్యాయులు కలరు. వారికి చదువు చెప్పుటకు సరదా, పండుగ. చిత్రకారుడు కుంచె చేబూని తన

రంగమును సమీపించుచున్నట్లు వీరు తమ విద్యార్థులను చేరి హృదయములను విప్పి వాఙ్మయము సతి రసవంతముగను హృద్యముగను కురిపించు చుందురు. విద్యార్థుల హృదయము లను వికసింపజేసి తా మానందింతురు. వారిని తేజోవంతులను చేయుదురు.

ఇంకొక రకపు యుపాధ్యాయులు కలరు. వీరికి జీత బత్తెములపై గల కోరిక చదువు చెప్పుటలో మృగ్యము. వీరు డబ్బు కొరకే చెప్పువారు కనుక 'బెల్లు - బిల్లు' అనగా గంట కొట్టుట, బిల్లు వ్రాయుట యను కర్మకే బద్ధు లగుదురు. ఇట్టి వారి హృదయములలో రసము కాని, రక్తములో వేడి కాని, మెదడులో చలనము కాని, ముఖములో ఉత్సాహము కాని, విద్యార్థులపై సహజ ప్రేమాతిశయములు కాని యుండవు. "అబ్బే వెధవలండి, మొద్దుబండ లాభము లేదండి, వీళ్ళ కేమీ రాదండి, మనము చెప్పడము శుద్ధ దండుగండి." అనుచు నొక యభాగ్యపు దండకమును వల్లించు పంతుళ్ళు చాలమంది కలరు. గంభీర హృదయులు కాకపోవుటచే వీరు మానవ కిశోరములను లాలింప వలసిన తెన్నుల నారయ యత్నింపరు. ఇంకొక తెగ యుపాధ్యాయులు కలరు. వీరు పాఠములను చెప్పు పాపము సంతగా కట్టుకొనక విద్యాధికారులను, బోర్డు అధికారులను చూచుచు, బోర్డు యొక్క సమస్త వ్యాపారముల లోను కలుగచేసి కొనుచుండు పక్షులను పట్టుకొని నెల కెన్ని పర్యాయములైనను జిల్లా కార్యలయములకు పరుగు లెత్తుచు

బదిలీలు, బర్తరఫులు వగైరా కర్మకాండల నప్రత్యక్షముగ చేయించుచు బడిపంతుళ్ళపై వీర విహారము చేయుచుందురు. ఇక వీరిని కదుపువా రెవరుందురు? వీ రేయెండ కా గొడుగు పట్టగల ధీరులు. ఊరంతయు తిరిగి తిరిగి లోకాభి రామాయణముతోను, బహు విధ స్థానిక వ్యవహారములలోను పుణ్య కాలము గడిపి, బడికాలము సమీపించుటచే "ఆర్యప్రాచ్యుల" కెట్లో నాలుగు ముక్కలు చెప్పి బ్రతుకు జీవుడా యని బయట పడు చుందురు. ఈ నిరాదరణ, నిర్లక్ష్యము పిల్లల నావరించి వారును తదనుగుణ్యముగనే తయారగు చున్నారు. ఇసుక తక్కెడ పేడతక్కెడకే మార్గము కదా!

చివరకీ దుస్థితియే మన దేవాలయములకును పట్టెను. వేయింటి కేయొక్కరో తప్ప తక్కిన మతప్రచారకులు, పురోహితులు, పూజారులు, దేవతార్చన పరులు స్వధర్మనిరతులుగాక నుదాసీనులుగ పనిదొంగలుగ కన్పింతురు. వీరు తమకు తామే యపచారము చేసికొనిన వారగుచున్నారు. "వేల కొలది మనుష్యులలో నే యొకడో సిద్ధుడగుటకు ప్రయత్నించు చున్నాడు." అని భగవద్గీత చాటుచున్నది. కోట్లకొలది యర్చకులలో రామకృష్ణపరమహంస యొక్కడేకాని రెండవవాడు కాన్పించడు. తాను పూనిన పనియందు లేక తనకు ప్రాప్తమైన పనియందు యావచ్ఛక్తిని వినియోగించి దానిలో లీనమై, నిర్విచారముగ, హుటాహుటిగ, లీలగ చేసికొనిపోవు వాడు శిల్పి, చతురుడు, కుశలుడు, ఉపాయశాలి యగును. తన

పనియందు నిరాదరణ, నిరసన, బద్ధకము చూపువాడప్రయో జకుడు, వ్యర్థుడు. వాని పని వెట్టి యగును కాని శిల్పము కాజాలదు.

హస్తమే కళకు మూలము. చేతులను ప్రయోగింప నేర్చిన వాడు కళా సమ్రాట్టు డగును. చేతినిండ పని, యింటి నిండ తిండి, యొంటి నిండ గుడ్డ, కంటి నిండ నిద్దుర, జబ్బును చీదని జీవితము– ఇట్టి కళను సేవింపని వాడు మందభాగ్యుడు. చేతి మహిమను గురించి యొక కవి యిట్లు వర్ణించి యున్నాడు.

''బుద్ధి లేక పరిజ్ఞానము చేతిని కల్పించెను, సృజించెను. జీవిత సముల్లాసము దానికి శక్తిని సమర్పించెను. కాలము దానిని సంస్కరించెను. తుచ్ఛ జీవితము దానిని నిందించి తిరస్కరించెను. పశు జీవితము దానిని దుర్వినియోగము చేసెను. ఆధ్యాత్మిక జీవితము దానిని ప్రయోగించెను. జ్ఞానము దానిని నియమించెను. అభ్యాసము దానికి శిక్ష నొసంగెను. ప్రభువు, రాజు అగు కళ దానిని వరించెను.''

జడమతీ! నీ బుద్ధిని దానియందు ప్రవేశపెట్టుము. నీ మనః పాటవమును, చాతుర్యమును దాని ద్వారా ప్రదర్శింపుము. నీ చేతల ద్వారా ఆత్మశుద్ధిని పొందుము. పై వర్ణనలోని రహస్యమును గుర్తింపుము, అనగతము చేసి కొనుము. అప్పుడు జీవితము నీకు సమర్పింప జాలని దేదియు నుండదు.

కర్మ రహస్యమును గురించి వివేకానందు డిట్లు వచించెను. "పని చేయునపుడు నీ లక్ష్యము, సాధనము నేకమగు గాక. పనిని మించి నీ వితరములను తలంపరాదు. దానిని పూజాభావముతో జేయుము."

చాపాచార్యు డగు ద్రోణుడు రాకుమారుల కస్త్ర విద్య నేర్పుచు నొక నాడు వారిని పరీక్షింప గోరెను. ఒక యున్నత మైన చెట్టుకొమ్మల చాటున నొక లక్ష్యమును చూపి. దానిని కొట్టవలసినదని యతడు వారి నాజ్ఞాపించెను. వారు దానికి బూనుకొనగా "నేను కన్పించు చున్నానా? చెట్టు కన్పించు చున్నదా? లక్ష్యము కన్పించు చున్నదా?" అని యతడు ధర్మరాజు నడిగెను. 'అందరును కన్పించు చున్నారు.' అని యత డనెను. తక్కిన వారందరు నట్లే చెప్పిరి. ఆ పనిని వారెవరును నిర్వహింప జాలరని యతడు నిర్ణయించి యర్జునుని ప్రశ్నింపగా నతడు "లక్ష్యము తప్ప నా కేదియు కన్పించుట లేదు." అని చెప్పుచు వెంటనే దానిని కొట్టివేసెను. కనుక పని చేయునపుడు పనిలో లీనమగుటయే, పని యగుటయే కళ.

గృహ పాలనలో నేమి, కార్మిక విద్యలో నేమి, వ్యవసాయములో నేమి, యాయుధ విద్యలో నేమి, శాస్త్రాధ్యయనాదులలో నేమి, చివరకు నిత్య జీవితములో నేమి మనః కర్మలు రెండును యేకమైనపుడే శిల్ప ముత్పన్న మగుచున్నది. జీవితము ధన్యమగు చున్నది. చైతన్యము వర్ధమాన మగుచున్నది. నీవు చేయు ప్రతి పనిలోను నీ పదునారణాల శక్తి, నూటికి

నూరు వంతుల యత్నము కలిగిన నాడే నీ జన్మ ధన్యమగు చున్నది.

ఒక పని లేక నొక వృత్తి నీచమైన దని గర్హ్యమైన దని నిరసించుట యుక్తము కాదు. ఏ పనినైనను హృదయ పూర్వకముగ నుత్సాహవంతముగ చేయక పోవుటయే గర్హింప దగినది. నేటి భారత దేశము కొన్ని వృత్తులను కొన్ని పనులను నీచముగ తలంచుటచేతనే దీనదశ ననుభవించు చున్నది. చెత్తి చెదారములను, మృత పదార్థములను నసహ్యించుకొనుచు ముక్కుల నెగురవేయు మన దేశము దరిద్రభూయిష్ట మగు టయు, బొగ్గుతోను యినుపముక్కలతోను జంతు చర్మముల తోను పనిచేయు దేశములు శ్రీమంతము లగుటయు మనము చూచు చున్నారము. కనుక నైశ్వర్యము, గొప్పతనము, శోభ మన పని తనములోను క్రియా చాతుర్యములోను నున్నవి కాని మనకు సంభవమగు పనులు, పరిసరములు, పరికరములు అందుకు కారణములు కాజాలవు. 'క్రియాసిద్ధి స్సత్త్వే భవతి మహతాన్నోపకరణే' మహాత్ముల క్రియాసిద్ధి వారి మనోబల బుద్ధి బలములలోనే యుండును కాని బాహ్యోపకరణములపై నాధారపడ జాలదు.

# క్రోధము.

ఆ. కోపమునను ఘనత కొంచెమైపోవును
కోపమునను గుణము కొరత వడును
కోపమునను బ్రదుకు కొంచెమై పోవును
విశ్వదాభిరామ వినుర వేమ.

కోపము వలన జీవితమంతయు తారుమారగు ననియు, బ్రతుకే దుర్భరము, అసహ్యము నగుననియు వేమనయోగి చాటుచున్నాడు.

క. కోపము నుబ్బును గర్వము
నాపోవని యునికియును దురభిమానము ని
ర్వ్యాపారత్వము ననునివి
కాపురుష గుణంబు లండ్రు కౌరవనాథా ! భా. ౨.

ఎంత సమర్థత, యెంత విద్వత్తు, యెంత యనుభవము, కులీనత మొదలగు సంపదలున్నను కోపిష్టి జీవితము రాణింప జాలదు. కోపము చెడుపురుషుని లక్షణములలో నొకటిగ పై పద్యము వర్ణించుచున్నది.

"ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, నిస్సంతోషి, క్రోధనుడు, నిత్యశంకితుడు, పరభాగ్యోపజీవియు ననువా రారుగురు దుఃఖభాగులని నీతి కోవిదులు చెప్పుదురు." అని హితచంద్రికలో నుద్ఘాటింప బడెను.

ఒక మహాకవి గలడు. ఆయన బుద్ధిలో బృహస్పతి యంతటివాడు. వయస్సులో నేడవ పడి. కాని కోపములో దూర్వాసుని తాత. చిన్న విషయము నైనను, పెద్ద విషయము నైనను చక్కగ విశదముగ నరటిపండొలిచి చేతి కందించుదృష్టియుగల యీయన పాదరసము వంటి బుద్ధి దిక్కుమాలిన కోపముచే వక్రించి విషయమును విడిచి శిఖపట్ల గోతిములోనికి దింపుచుండును. ఈయన యొక మణియే. కాని దగ్గరకుబోయిన కస్సుమను మణి. కోపముచేత ఈయన ద్వేషగ్రస్తుడై పోవుట శోచనీయము. ఇది యీయన యొక్కనికే నష్టముగాదు. కోపమే లేనిచో ఈయన వాగ్దేవి నింకను నెట్టి విచిత్ర రుచులతో దనిపెడివాడో నేరికెరుక !

గొప్ప గొప్ప పదవుల నలంకరించిన వారెందరో యీ కోపమువలన పదచ్యుతులైనట్లు చరిత్ర చెప్పుచున్నది. నెలల తరబడి, సంవత్సరముల తరబడి కష్టించి సంపాదించుకొనిన దాని నొక్క త్రుటిలో కోపమునకు గురిచేసిన వారు గలరు. కోపము మూలమున పండువంటి సంసారములను చేడగొట్టు కొనిన దంపతులును, కుటుంబములును గలవు. ఒకమిత్రుడుగలడు అతడు యోచనపరుడు. చొరవగలవాడు. చకచక వ్రాయ గలడు. కొత్త వ్యూహములను, ప్రణాళికలను, పోకడలను కని పెట్టగలవాడు. అతడనేక సంస్థలను నిర్మించెను. కాని చివర వర కొక్కటియు కొనసాగ దయ్యెను ! ఒక్క నిముసములో, నొక్కస్వల్ప కారణమున కతడు తాను నిర్మించిన నిర్మాణమును

దగ్ధము జేయుచుండెను. కొద్ది శాంతము, కొద్ది యోపిక, ముందువెనుక లారయుట, యున్నచో నిట్టి దురవస్థ పట్టెడిది గాదు. కోపము తోడు లేకుండ నుండ జాలదు. దానితోపాటు పైపద్యములోని గర్వము, యీర్ష్య, అసూయ, దురభిమానము ఇత్యాదు లుండి తీరును. ఒక్క చెడుగే మానవుని చెరుపుచుండగా నిక నీ నీచశృగాలము లతని నెట్లు తబ్బిబ్బు చేసినను చేయగలవు. శిల్పి తన మనోవీధిని సంచారము చేసి చేసి, భావములు చేర్చుకొని సున్నితమైన తన యులితో నేండ్ల తరబడి విగ్రహములు చెక్కి చెక్కి, యొక స్వల్ప కారణమున కా యులితోనే దానిని మోది విలపించుట యోగ్యమా! భార్యమీద, కొడుకుమీద, తండ్రిమీద లేక యితరులమీద కోపమువచ్చి ఋణములుచేసి యాస్తుల నమ్మినవారు, తాకట్టు పెట్టినవారు, సన్యసించినవారు ఎంతమంది లేరు! ఒక మిత్రుడు వైద్యములో విశ్వ విద్యాలయ పట్టము తీసికొనెను. మంచి తెలివి, రోగ నిదానము, గలవాడు ఎంతటి వ్యాధినైనను కుదర్చగల చతురుడు. విషమ సంధులలో నితర వైద్యు లతని సలహా తీసికొందురు. వైద్య విషయముల గురించి చక్కగ వ్రాయగలడు. యుపన్యసింప గలడు. కాని కోపమున కితడు పెట్టినది పేరు. ఈ కారణముచే నతని వైద్యాలయమునకు రోగులు రానేరారు. ఏ కొద్దిమందియో జారివత్తురా! వ్యవహారము కోర్టు కెక్కవలసినదే. తనంత తెలివియైనవాడు లేడని, నిజాయతీ పరుడు లేడని లోకమంతయు శుంఠలని, వంచ

కులని, ద్రోహులని యతని సిద్ధాంతము. అతడట్లే విశ్వసించును. చివర కతని విశ్వాసము ప్రకారమే లోకమతనికి ప్రతిక్రియ నొనర్చెను. రోగులురాని వైద్యాలయము, కాంపౌండరు లేని వైద్యము, బంధుగులు గృహిణియు కూడ లేని యిల్లు. తోడివారందరు వందలు, వేలు సునాయాసముగ గడించుచుండ, మేడలు, మోటారులు పెట్టుకొని మోదించుచుండ నీ సోదరుడు ప్రపంచమును దూరుచు తనగదిలో నేకాకిగ కూర్చొనెను. కోపము ప్రబల శత్రువు. ఇతరుల ననసేల! ఇతరులను దూరనేల? కోపమునకు గురికాలేదని యాత్మసాక్షిగ చెప్పగలవారు ధన్యాత్ములు. ఒక గొప్ప పండిత కుటుంబముండెను. తండ్రి విఖ్యాతి గాంచిన యాచార్యుడు. ఆంధ్రగీర్వాణభాషా సముద్రుడు. కుమారు లిద్దరు. ఇద్దరు విద్యాధికులే. కుటుంబము శ్రోత్రియ కుటుంబము. బోధింప వలసిన వన్నియు బోధించి తండ్రి లోకాంతరుడయ్యెను. అన్న దమ్ము లిద్దరు, వారి భార్యలు, తల్లి-సాధారణముగ నీ పంచకము కలిసి యుండదు. తల్లికి కొడుకులకు పడదు; అన్నదమ్ము లిద్దరకు పడదు. భర్తలకు భార్యలకు పడదు. అత్తకు కోడళ్ళకు పడదు. వారి వాగ్వాదము, పరుష సంభాషణము ప్రారంభ మగుచో ప్రక్క యింటివారికి నిద్రపట్టదు సరికదా, వారిళ్ళకు వచ్చిన క్రొత్త కోడళ్ళు యేపండుగ పేరో చెప్పుకొని పుట్టిండ్లకు పారిపోవలసినదే! వారి జీవితము చుట్టుప్రక్కల వారికే యంత యశాంతిగ నున్నచో తమకెంత యశాంతిగ నుండునో వేరుగ

చెప్పవలెనా? ఒకసారి రేగిన యీ తుపాను వెంటనే తగ్గదు. అది తగ్గుసరికి యొకటి రెండు పూటలు పట్టును. అంతవర కాయింట నిప్పు రాజేయరు. ఈ రెండు పూటలు బలవంత నిరాహారము. కోపమునకు మితిలేదు. గతిలేదు.

రహస్యమేమన కోపనలు కోపిష్టులు. పాపిష్టి అహంకార మునకు దాసులగుదురు. "నేను చెప్పినదే వేదము. నేను చెప్పినదే న్యాయము. నామాటయే నెగ్గవలెను. నాదృష్టియే దృష్టి. ఇతరుల దృష్టి దృష్టియేకాదు." అని వారి సిద్ధాంతము. వీరెట్టి విమర్శను గ్రహింపజాలరు. ప్రతి విషయమును పెద్ద జేసి దానిని వ్యక్తిగతముగ దీసికొని, లేని పోని యర్థములను కల్పించి తాము బాధపడుచు నితరులను బాధపెట్టు చుందురు. ప్రతి దానికని పెడర్థమునే తీయుదురు. భార్య, బిడ్డలు వీరిక్రింద పనిజేయువారు. వీరితో కత్తివాయిమీద నడచినట్లే నడువ వలయును. కొద్ది యాత్మావలోకనము, ఆత్మ నిగ్రహము గలిగినచో సర్వము చక్కబడెడిది.

గ్రీకు పురాణములలో పెనిలోపి యను నొక స్త్రీ కలదు. ఆమె పగలంతయు కష్టించి నూలు వడుకుచు రాత్రి యా వడికిన నూలు పురి విప్పివేసెడిదట. ఏండ్ల కొలది కష్టించి నిర్మించుకొనిన జీవితమును నిముసములో పాడుచేయుట తగునా? కోపము జీవితమున కెదురీత. మృత్యువునకు దారి.

నీ యొడలు నీ స్వాధీనములో నుండకపోవుట, నీకు నీవే యజమానివి కాకపోవుట, చాల యవమాన కరమైన విష

యము. అమానుష చిహ్నము. గొప్ప లోపము. నిజమునకు నీకు నీవే యజమానివి. ఏ పరిస్థితి నిన్ను నీ స్వాస్థ్యము నుండి తొలగింపరాదు. అట్టి యాజమాన్యమును సంపాదించినగాని నీవే ఘనకార్యము జేయజాలవు. ఇంతకు కోపమంతటి జయింపరానిది కాదు. నీవు సాధింపలేనిదీ ప్రపంచములో నేదియు లేదు. కోపమునకు కారణములను కొద్ది శ్రద్ధ వహించినచో కనుగొనగలవు. ఆ కారణములను నీ మనసున చేరనీయకుండువేని కోపమునకే తావుండదు. “కోపము వచ్చినపు డేపనియు జేయక పది యంకెల వరకు లెక్కించుకొనుము” అను పెద్దల వాక్యము లనుభవ వాక్యములు. ప్రతి వ్యక్తి, ప్రతి జీవి యీ ప్రపంచములో నేదో యొక ప్రత్యేక ప్రయోజనము కొరకే, ప్రత్యేక ఘనత కొరకే సృజింపబడెను. ప్రతివ్యక్తి తన పురుషార్థమును, తన ప్రత్యేకతను, తన వ్యక్తిత్వమును సాధించి గొప్పవాడు గావలెను. యత్నమే దీనికి కీలకము. ప్రయత్న హీనుడు నిరర్థకజీవి యగును.

# జీవితసౌరభము.

శ్లో॥ వహ్ని స్తస్య జలాయతే జలనిధిః కుల్యాయతే తత్క్షణా, ।
న్మేరుః స్వల్ప శిలాయతే మృగపతిః సద్యః కురంగాయతే।
వ్యాలోమాల్య గుణాయతే విష రసః పీయూష వర్షాయతే
యస్యాంగేఽఖిలలోక వల్లభతమం శీలం సమున్మీలతి॥

“ఎవనియం దఖిల లోకములను రంజింపజేయు శీల ముప్పొంగునో యతనికి నిప్పు నీటివలె చల్లనగును. సముద్రము పిల్లకాల్వ వంటిదగును. మేరుపర్వతము చిన్న శిలాఖండ మగును. సింహము త్రుటిలో లేడిపిల్ల యగును. విషభాండ మమృతమునే వర్షింపజేయును.” అని రాజయోగి యగు భర్తృహరి మధురగానము చేయుచున్నాడు. జీవితరాగము మట్టి గాదు. అది రక్తమాంసములు, నెముకలగూడు మాత్రమే కాదు. అంతమాత్రముచే నది జీవితమగుట లేదు; నడుచుట, తినుట, నిద్రించుట, చూచుట, చేయుట మాత్రముచే జీవిత మనిపించుకొనదు. పశ్వాది ధన ధాన్యములు, వస్తువాహనములును నీ జీవితము గానేరవు. బంధుమిత్రులు, భార్యయు జీవిత సమస్తము కానేరవు. శీలసంపద, జ్ఞానజ్యోతి, జీవిత ప్రవర్తన జీవితసారము లగుచున్నవి. ఆరంభూయిష్టము, జ్ఞాన హీనము, పశుప్రాయము, సౌందర్య శూన్యము, శోభా విరహితము నగు జీవితము చెట్టుచేమలను బోలును. జీవితము నుండి తృప్తి, సౌఖ్యము, శాంతి జ్ఞాన విజ్ఞానములు శాఖోప

శాఖలుగ వెలువడ వలయును. నీవు తిను తిండి, కట్టు బట్ట యెంత నీదైననైనను నీవు ప్రపంచమున కర్పించున దేది యను ప్రశ్నకు సమాధానము చెప్పక తప్పదు. ఇది నిన్నెప్పుడు పొడుచుచునే యుండును.

"రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారా స్సాత్త్విక ప్రియాః"

అని గీత చాటుచున్నది. రసవంతము లైనవి, చమురు గలవి, శరీరములో స్థిర పరిణామము గలిగించునవి మనఃప్రీతి కరములు నగు ఆహారములు సాత్త్వికులకు ప్రియమైనవి. ఒక్క-యాహార విషయములోనే గాదు. జీవితమును సార్థకము జేసి కొనుటకు సర్వత్ర రసగ్రహణమే ముఖ్యము. చెరకులోని తీపిని, మధురసమును విడిచిన పిప్పిని చీమలైనను జేరునా? రసాలము లోని మధురసమును లాగివేసిన బోడిటెంక కెవ డాశ పడును? చల్లని మలయమారుతము ననుభవింపక గబ్బిలపు పెంట మీది దుర్గంధమున కెగబ్రాకుదుమా? సౌరభము వెదజల్లు గులాబి యుండ దాని ముండ్లలో నిరికికొని బాధ పడుట శోభయా? జ్ఞానమా?

జీవితమును సారవంతము, శోభాయమానము, శక్తి వంతము, జ్ఞానవంతము, ప్రేమ మయము, సంతోషవంతము, చేసుకొనుట యెంత సులభమో తద్విరుద్ధ ఫలముల పొందు టయు నంత సులువే. నీ నిశ్చయమునుబట్టి, నీ యత్నమును బట్టి, నీ మనః పరిపాకమునుబట్టి, నీ కవి సిద్ధించుచుండును.

నీవు వీనిని గురించి తలంపక, నిశ్చయింపక, ప్రయత్న పరుడవు గాక యథాతథా జీవితమును గడుపుచుందువేని పేలవ

జీవితమునే యనుభవింతువు. దానిని రసభరితము జేయుట యనగా నారోగ్యము, తుష్టి, పుష్టి, సుఖము, శాంతి, సౌందర్యము, ప్రేమ మొదలగు జీవితసారమును పిండుకొనుట– ఇవి నీ చేతిలోనే కలవు. వీనిని విడిచి మరీచికల వెంట బడుదువేని వ్యర్థజీవి వగుదువు. జీవయాత్రను సుగమముగ నడుపుటకు ధన మొక యుపకరణము. దానిని యుపకరణముగ గాక కొట్లను నింపుకొనుటకే ప్రోగుచేయుట తగదు. అట్లు చేయుట విషోరగము నోట చేయిడుటయే యగును. ధనాశచే బంగారమును గాగలించుకొని బంగారమువంటి జీవిత సంపదలను కంగారు చేసుకొనుట దైన్యము. అట్టివారు చేయు దుష్కృత్యము వలన తానే కాక తమ సంతతిగూడ పాడై పోవును.

కాంచనదాసుకు నీతి నియమములతో పనిలేదు. అబద్ధములకు, నీచ కార్యములకు నతడు వెరువడు. అందచంద మతనికక్కర లేదు. బంధుమర్యాద, మిత్రస్నేహము, వాని చెవికి సోకవు. అతని సమస్య లన్నియు ధనార్జనతోనే బుట్టి దానితోనే సమాప్తి జెందును. ఇట్టి వ్యక్తు లనేకమందిని మనము నిత్యము చూచుచుందుము.

ఒక వ్యక్తి కలడు. అతని జీవితము గోచిపాతతో ప్రారంభము. ఒకటి రెండు దశలలో నతడు లక్షాధికారి యనిపించుకొనెను. అతడెట్లు కాగలిగెను? మైనారిటీ తీరని కుర్రలకు నాల్గువంద లప్పిచ్చి యే యాఱువందలకో నోటు వ్రాయించుకొనుట, అప్పు తీర్చవచ్చినపు డింట లేడనిపించు

కొనుట, వారము రోజులవరకు తీరిక లేకనుట, తాళము చెవి పిల్లవాడు పారవేసినాడని నోరెరుగని వానిమీద పెట్టుట, దండన షరతులు, కాంపౌండువడ్డీలు, విధించి [illegible]కడాలతో ముక్కు పిండి పుచ్చుకొనుట- బంధువుకదా యని నో వితంతువో దాచ యిచ్చినదానిని కబళించి సాగనంపుట, తనఖా యని క్రయము వ్రాయించుకొనుట,- యిట్లు రాయికి రాయి చేర్చి పేర్చి యతడు లక్షాధికారి యయ్యెను.

ఇది సరస జీవితమా! ఉత్తమ జీవితమా! సుఖ జీవితమా! అట్లు కాన్పించదు. రాత్రు లతడు కంటికి నిండ నిద్ర నెరుగడు. కన్ను మూసినా! దొంగలు పెట్టినట్లు, భోషాణములు పగులగొట్టు చున్నట్లు కలలు గనును. డబ్బు చేరిన కొలది మాడ్చుకొని తినుటయే గాని పక్వాన్నము లెరుగడు. శుభ్రమైన బట్ట కట్టి యెరుగడు. కట్టనీయడు. భార్య పేదరాలి పెద్దమ్మ వలె నుండవలసినదే గాని యంతకంటె శృంగార ముండరాదు. అప్పిచ్చినది రాదేమో యని బెంగ, ఇంటనున్న వడ్డి పెరుగదేమో యని బెంగ. కొడుకులను నమ్మి తాళము చెవు లీయడు. భార్య నసలే నమ్మలేడు. గుమాస్తాలు పట్టుకొని పోయెదరేగాని పట్టుకురారు గదా యని యతని సిద్ధాంతము. పోనీ కడుపున పుట్టినవారికి తిండి కలదు గదా యని సంతోషము కలదా? ఒక కూతురును భర్త యేలక పంపివేసెను. ఒక కూతురు భర్తను వదలివేసి యిల్లు చేరెను. ఒక కూతురు వితంతువు. ఇంకొకతె మాచకమ్మ. ఒక కొడుకు

మూర్ఖవాడు. ఒకడు తన్ని డబ్బు లాగేవాడు. ఒక కొడుకు కసలు మాట్లాడనే మాట్లాడడు. నాల్గవవాడు జులాయి. ఒకడు నిత్యరోగి. ఆరు సెగులువాడు.

ఇక నీ యజమానికి శరణ్య మెవ్వరు? ఇనుపపెట్టె. దానిని చూచి యూటలూరుచు, కాగితపు కట్టలను లెక్కించు కొనుచు, రూపాయి దొంతరలను ప్రయోగించు కొనుచు, వెట్టికాపలా కాయుచు నితడు జీవయాత్ర గడుపుచుండును. ఇంతలో కొడుకులు తిరుగబడి తాళాధ్యాయము జేసి యతని కట్టెదుటనే యావదాస్తిని తుడిచి వేసిరి. ముప్పది సంవత్సరాల మార్జనను పది వత్సరాలలో క్షయినలా జేసి వేసిరి.

శ్లో॥ కరోతు భువనే రాజ్యం విశత్వం భోద మంబువా।
నాత్మలాభాదృతే జంతు ర్విశ్రాంతి మధిగచ్ఛతి॥

భూచక్రమును పాలించుగాక! మేఘ మండలమును సముద్రమును హుటాహుటిగ ప్రవేశించుగాక! ఆత్మ విజయము, ఆత్మానందము, జీవితసుధ ననుభవింపని జంతువునకు విశ్రాంతి యుండనేరదు. విశ్రాంతి లేని జీవితము జంతుజీవితమని నిర్ణయింపబడెను. అది యంతకంటెను కనిష్టము. జీవితము నుండి యానంద సుధను పిండుట దాతకు, త్యాగికి, పరోపకారికి, పరహిత జీవికి సాధ్యముగాని, లుబ్ధాగ్రేసరులకు, ప్రజాకంటకులకు సాధ్యము కాదు. త్యాగరాజులు శాశ్వతులు గాని, భోగరాజులు శాశ్వతులు గారు. ఆత్మరసమును, ఆత్మానందమును, ఆత్మజ్యోతిని చవిచూడని జీవితము జీవితము గాదు. ప్రేమ చిలుకు జీవితమే జీవితము.

"నిలయంబు వాటించి శృంగార మేర్పాటు చేయుచుండు"

భా.ర.

"వంశ నిలయాదు పేర్పను వచ్చి కేలి నన్నపూర్ణకు నుద్దియగా నతని గృహిణి" ॥మను॥

ఇట్టి గృహములు, నిట్టి జీవితములు, నిట్టి స్త్రీ పురుషులు ధన్యులు. జీవితశాస్త్ర మహిమను, మాధుర్యమును, సౌందర్యమును కిని విని యెరుగక చివరకు శరీరమును చావుకళికొప్పగించుట చాల విచారకరము. నేనెచ్చట చూచినను ధనతృష్ణయే తప్ప మరొకటి కాన్పించదు. ప్రతి చిన్న విషయము, ప్రతి పెద్ద విషయము ప్రజలలో నున్న డబ్బుపిచ్చినే సూచించును. ఇండ్లు కట్టుటలో, పంటలు పండించుటలో, విద్య నేర్పించుటలో, భోజన భాజనములలో, లేచుటలో, నిద్రించుటలో, నాట పాటలలో- సర్వత్ర కనకభ్రాంతియే. ఆరోగ్యము, సుఖము, శృంగారము, సౌందర్యము అను వానికి స్థానమే యున్నట్లు కాన్పించదు. మాధుర్యరస భరితమై హృద్యమై పుష్టిని ప్రసాదించు స్వాదు ఫలములను శాల్యాదులను గాక అమ్మకముకై ధనరాసులను ప్రోగుచేసికొనుటకై పనికివచ్చు వొర పుగాకు మొదలగు వానిని పండించుట, మానవాభివృద్ధికి, నైతికాభివృద్ధికి కావలసిన చదువుగాక పొట్టకూటి చదువులే చదువుట, పూపొదరిండ్లలోను, నిర్మలవాయువులతోను, జీవనదీ తోయములతోను, రంజిల్లు గృహసీమలు గాక మురుగు కుండ్లు, యిరుకుదొడ్లు, ఫ్యాక్టరీపొగ, సందు

గొందులు గలిగి క్రిక్కిరిసిన చోటుల "శివాలయము"ల వంటి వానిని కొంపమీద కొంప కట్టుకొని పోవుట ప్రస్తుత నాగరిక లక్షణము.

ఏ మార్గ మైనను డబ్బు సంపాదించిన చాలును. కల్లు దుకాణమును పాడి ధన మార్జించి సంఘములో ఘనుడు కావచ్చును. దేవస్థానభూము లనుభవించుచు బలిసి సంతతికి వాడు లేడనుకొన వచ్చును. జూదము, బ్రాకెట్లు ఆడి మోటారుకార్ల లోను, సిమ్మెంటు మేడలలోను కులుకవచ్చును. అబద్ధ సాక్ష్యములు చెప్పి పరుల కొంపలు కూల్చి గొప్పవాడు కావచ్చును. నీటి లంచములు బల్లక్రింద లంచములు, బల్లమీది లంచములు పట్టి, నెలకొలది కట్నములకు మగపిల్లలను వేలము వేసి తగుదునమ్మా యని సంఘములో మొనగాడివలె సంచరించ వచ్చును. బీదలు, అమాయిక ప్రజలు నైన వారి పొట్టలు గొట్టి బూరెలు పొంగినట్లు పొంగవచ్చును. కాని ఎంత కాలము? ఇది యంతయు నెవరి కొరకు! వీరు నిజముగ నానంద మనుభవించు చున్నారా? "నేను మహాపాతకము చేయుచున్నాను" యని ఎప్పుడో ఒకప్పు డంతరాత్మకి తట్టదా? తప్పక తట్టును. కాని యప్పటి కంతయు చేయి జారి పోవును. జీవితాంతమును సమీపించినప్పుడు భ్రష్టాత్ములై రొమ్ములు బాదుకొనుచు విలపించును. ప్రపంచమునకు ఘనుడుగా చలామణియైన వ్యక్తి చివరకు తనను తానే నిందించుకొను చున్నాడే! ఎవడు తనను నిందించుకొన నక్కరలేదో,

యెవనిని ప్రజలు కంటగించుకొనరో, ఎవడు ప్రత్యుపకారము పొందకుండ నిర్నిమిత్తముగ లోకోపకారము చేయుచుండునో అట్టి వాని జీవితమే లెక్కకు వచ్చును. అట్టి జీవితమే పరిమళించును. అట్టి సుగంధము లేని పేలవ జీవితములను గడుపు వారిని తెలిసికొనుటంత కష్టము గాదు. అట్టి "తిమ్మన్న"లు బయల్పడుచునే యుందురు. లోపలనున్న కుళ్ళు చర్మము ద్వారా, కంటి ద్వారా, ముఖబిలము ద్వారా, వాచా కర్మణా పైకి తన్నుచునేయుండి యట్టి వారిని పట్టియిచ్చుచుండును. ఒక్కొక్కని ముఖము చూచుటతోడనే వీడు క్రూరుడు, వీడు వేషధారి, వీడు కపటి యని చెప్పవచ్చును. సంఘము మట్టివారిని చూచి ఏవగించుకొనును. ఎవనిని గురించి పరోక్షమున చల్లని మాటలు చెప్పబడునో, యతడు ధన్యజీవి, జీవిత మధురిమ నెరిగినవాడు. అర్థోపజీవి పురుషార్థ సాధకుడు కాజాలడు.

జీవితమును వెలుగొంద చేయునది యర్థమే కాజాలదు. దాని కెంత విలువ యున్నను జీవిత మంతకంటె విలువయైనది. జీవిత విలువను అర్థముతో తూచుట న్యాయము కాదు. మహాత్ముల జీవితములే జీవితములు. వారు అర్థవంతులు కారు. అర్థమునకు లొంగినవారును కారు. అర్థమును మట్టి పెల్లవలె విసరివేయ గలవారి జీవితమే సౌరభమును వెదజల్ల గలదు. అట్టి జీవితమే యుగ యుగములకు నాదర్శప్రాయముగ నుండ గలదు.

భావములు, ఆశయములు కంటికి కనపడని శక్తులు. కాని యవి తమ పుట్టించగు మస్తిష్కముల కంటె శాశ్వతములు, పవిత్రములు నైనవి. మస్తిష్కములు నశించి మట్టి మట్టిలో కలిసిపోయిన తరువాత కూడ నవి సదా నిలిచి యుండును.

కృష్ణుడు, బుద్ధుడు, జీససు, గాంధి మహాత్ముడు యిత్యాదులు నేడు కానరారు.

కాని, వారి భావముల మహిమ, ఆశయ మహత్త్వము ఆచంద్రార్కము నిలిచియుండును. ఇదియే నిక్కమైన మానుషీధనము.

తక్కిన బ్యాంకు నోటులు, చెక్కులు, సిమెంటు మేడలు శ్మశానము వరకైనను రాని యింధనములు.

# మహదాశయము.

"ఒక తార గగనవీధి నుండి పతన మయ్యెను. అది తిరిగి తన మొదటి నెలవునకు జేరుకొన వలెను."

నీవే యా తారవు. ఎల్లప్పుడు మహదాశయమునే గల్గి యుండుము. నీచాశయములను దూరీకరించుము. దీని వలన కల్యాణ గుణములు నీకు చేకూర గలవు. సంశయము, విన్న దనము, డిల్లపోవుట, కోపములుట, జాలపడుట మొదలగు దరిద్ర లక్షణము లుదారాశయులను చేరజాలవు. "ఉదారతయే నా స్వభావము. గొప్పతనమే నా యునికిపట్టు. నిజము నృక్షమునకు మూలము. ఔన్నత్యము, దినదినాభివృద్ధి నా లక్ష్యముగాని యవనతము, అధఃపతనము, నా గమ్యములు కావు." అని నీ మన సెల్లపుడు భావింపవలెను.

గొప్ప భావములు గల వారినుండియే గొప్పపను లుత్పన్నము లగుచుండును. "భావము లే ఘనీభవించి కార్యము లగును." అను లోకోక్తి అనుభవ జన్యమైనది. అది ప్రతి వానికి చీమ మొదలు బ్రహ్మ వరకు నిత్యానుభవ విషయము. తెలిసికొనక పోయినంత మాత్రముచేత ఈ సత్యము ప్రకా శింపక మానదు. భావముచేతనే భయము గల్గుచున్నది. భావముచేతనే పిరికితన మబ్బుచున్నది. భావముచేతనే సబల దుర్బలత లేర్పడు చున్నవి. భావముచేతనే గొంగళిపురుగు సీతాకోక చిలుక యగుచున్నది. నీ యల్పస్థితికో, నీ కొద్ది

స్థితితో, నీ ప్రస్తుత స్థితితో తృప్తి పొందుదువేని నీవు గొప్ప వాడవు కాజాలవు. గొప్పతనమును సాధింపజాలవు.

ఉన్నతాశయుడు క్రమముగ స్థిరాభివృద్ధి జెందు చుండును. తన కించిజ్ఞతను గుర్తించి దానిని తరింప యత్నించుచు సత్యసాధకుడై తన యిరుగు పొరుగువారి కంటె త్వరలోనే గుణాధికు డగును. అట్టి వానికి ప్రాప్తించు సమస్తము నతని విజయమునకు సోపానములే యగును. అట్టివాని కేవి ప్రాప్తించినను నవి వానిపై తమ ప్రభావము చలాయింప జాలవు. అవి యతని ముందు నిర్వీర్యములై పోవుటయే గాక యతని కుపకరణములుగ గూడ పరిణమించును.

ఉదారాశయులకు కష్టములు కష్టములు గావు. తిలకు మహాశయుడు జయిలులోనే గీతారహస్యమను మహోత్కృష్ట గ్రంథము వ్రాసెను. జాన్ బనియన్ యను మహాభక్తుడు బెడ్ఫర్డు జయిలులో "యాత్రికుని యభ్యుదయము" అను గొప్ప గ్రంథమును వ్రాసెను. మహాత్ముడు, జవహర్ లాల్, ఆంధ్ర కేసరి, మొదలగువారు జయిళ్ళలోనే తమ యాత్మకథలను వ్రాసిరి. ధర్మరాజు అడవులలో నైనను దేవేంద్రపదవి ననుభ వింప గల్గెను. రామునకు శాఖామృగములే మహాసైన్య మయ్యెను.

"క్రియాసిద్ధి స్సత్వే మహతాంనోపకారణే" మహాత్ము లకు తమ నిజబలమే కార్యసిద్ధి గలిగించును. తక్కిన సమస్తము వారి కుపకరణములు మాత్రమే యగుచున్నవి. వారి

స్పర్శ పరశువేది వలె ప్రతి వస్తువును బంగారము క్రింద మార్చి వేయును.

ప్రతిభ, యుపజ్ఞ, శక్తి మొదలగు గొప్పలక్షణము లే కొద్దిమంది సొత్తో యని, యది వారి యదృష్టమని, వా రేమియు కష్టకడకుండగనే సిద్ధించునవి యని, చాలమంది యువకు లనుకొను చుందురు. ఇది కేవలము భ్రమ. పొరపాటు. మహాత్మ్య మనునది చెమట బిందువుల ఫలితము, శ్రమఫలి తము; అహోరాత్ర దీక్షాఫలితము, కాని కొండమీది నుండి యూడి పడునది కాదు. బేవారసు ఆస్తిగాదు. కష్టించినచో దానిని నీవును సాధింప వచ్చును. మహాత్ముని జీవితమే దీనికి తార్కాణము.

అతడొక సాధారణ వైశ్య కుటుంబములో జన్మించెను. జన్మించినపుడు నీ వలెనే రెండు కాళ్ళు, రెండు చేతుల తోడనే జన్మించెను. బాల్యముకూడ నీ బాల్యమువలె మా మూలు బాల్యమేకాని యద్భుత చర్యలేవియు లేవు. నీ బుద్ధి వంటి బుద్ధియేగాని పుట్టుకతోనే బృహస్పతి గాడు. నేడు ప్రపంచములో కాగడ వేసి వెదకినను నతనితో తులతూగు వారు లేరు. అతడు జగత్కుటుంబి. అతని మహదాశయము, ఉదారత, తత్ప్రయత్నము దీనికి కారణము. "యత్నే కృతే నసిద్ధ్యతిచేత్ కోఽత్ర దోషః" యత్నము జరిగిన మీదట సిద్ధింపక పోయినచో దోషమేమి కలదు? ఆరంభములోనే, తొలి ప్రయత్నములోనే మనము విజయము పొందజాలము.

గమ్యమును చేరజాలము. కాని ప్రయత్నమే విజయము కాక తప్పదు. మహాత్ముడెప్పుడును "ఒక్క యడుగే చాలును" అని చెప్పుచుండెడివాడు. దాని భావమేమి? ఒక్క యడుగు ముందుకు వేసెదవేని రెండవ యడుగు దానంతటదియే పడును.

ఎక్కడనో ఆకాశమున నున్న జ్యోతి బొట్టుపెట్టి నిన్ను పిలువదు. ఆ జ్యోతి నీలోనే యున్నది. ఈ జ్యోతి అంతరించదు. ఆరిపోదు. నిద్రింపదు. అది యతి సమీపవర్తి. ఋజువర్తనము, అంతర్యశుద్ధి యున్నచో నీ కెట్టి శంకలు ఆవసరము లేదు. మొదటి యడుగులోనే కొండ నెక్కిన వాడెవడును లేడు. 'నిన్నటి కంటె నేడు నే నెంత యాత్మవికాసము నొందితిని. నిన్నటి కంటె నేడు నాలో నెంత మార్పు కల్గెను? ఎన్ని దుర్గుణములు తగ్గినవి? ఒక్క క్రొత్త సుగుణమైన నలవడెనా?'' అను నాత్మ పరీక్ష యెప్పటి కప్పుడు చేసికొను చుండుము. ముందుకు పోవుట యనుదాని కిదియే యర్థము. నీ వేవృత్తిలో నున్నను, ఏ కార్యము బూనినను నీ నిజోన్నతియే నీ యాశయ మగుగాక! తదనుగుణముగనే వర్తింపుము. నీ దివ్యత్వముతో నిన్ను కలుపు సూత్రము నీ కార్య కలాపములలో నున్నదా లేదా యనియే నీవు ప్రశ్నించుకొను చుండవలెను.

ఉదారాశయులను గుర్తించుటంత కష్టముకాదు. ఏయాశయము లేక, రసము నెరుగక పాకరసము నెరుగని దర్వి

వలె, పున్నమచంద్రుని నెరుగని గ్రుడ్డివాని వలె జీవితము గడుపు కష్టాత్ము డెక్కడ? వసుధ యంతయు తన కుటుంబముగ పాలించు వీరాత్ము డెక్కడ? అట్టివారి కుల గోత్రములతో పని లేదు. వృత్తితో పనిలేదు. సత్ప్రస్తుత సాధారణాగేస్తు. అంతకంటె కటిక బీదవాడు, అతని ప్రాంగణమున రాలిపోయిన పిండిలో పొర్లిన నకులము సువర్ణమయమగుట కోట్ల తరబడి ధన కనక వస్తువాహనములను దానము చేసిన ధర్మరాజు అశ్వమేధ యాగము దానితో సరిరాక పోవుట భారత కథానికలలో నొక మహత్తర ఘట్టము.

"తన యావజ్జీవము ననన్య శ్రద్ధతో నొక కార్యము కొరకు పాటుపడి దానిని పొందక వ్యర్థుడైన వానిని నీ వెన్నడైన జూచితివా?" యని గోఖలే మహాశయుడు ప్రశ్నించెను. "శ్రద్ధామయోఽయం పురుషః యో యచ్ఛ్రద్ధః స ఏవ సః" మానవుడు శ్రద్ధామయుడు. ఎవని కెట్టి శ్రద్ధ యుండునో వాడట్టివాడే యగును" అని గీత ఘోషించుచున్నది. ఇది యొక జీవిత రహస్యము. ఎట్టి శ్రద్ధలేని వాని కిహము లేదు. పరము లేదు. 'తాత! కళ్యాణ కార్యములను చేసిన వాడెవడును దుర్గతి పొందలేదు.' అని శ్రీకృష్ణు డర్జునుని యూరడించెను.

శ్లో॥ త్రిభిర్వర్షై స్త్రిభిర్మాసై స్త్రిభిః పక్షై స్త్రిభిర్దినైః ।
అత్యుత్కటైః పాపపుణ్యై రిహైవ ఫలమశ్నుతే ।

మూడు వత్సరములలో, మూడు మాసములలో, మూడు పక్షములలో, మూడు దినములలో, యిప్పటనే,

యీ లోకములోనే నరుడు తన శుభాశుభ కార్యఫలము ననుభవించు చున్నాడు. అని యోగ ప్రమాణము కలదు. ఇవి తాతల నాటి వాక్యము లని హేళనచేయు చార్వాకు లుండవచ్చును. కాని వారుకూడ ఈ శాసనము ననుభవింపక తప్పదు.

మన విఘ్నములను, మన యుద్ధంకులను, మన పతనమును, మన వికారములను, మన చేతులతో మనమే సృష్టించుకొను చున్నాము. "ఈ చీనాదేశపు గోడలు" నువ్వియో నీ వెన్నడైన యోచించితివా? మన దురాశలు, దుశ్చింతలు, అల్పాశయములు, రాగద్వేషములు, ఇవియే సాలెపురుగు తనను బంధించు పాశములను తన పొట్టనుండి తానే యల్లుకొను చున్నది. మనమును నట్టి సాలెపురుగులమే. రంధ్రాన్వేషణ, దోషములనే యెంచుట, గుణమును గ్రహింపకపోవుట, విశ్వ సౌందర్యమును చూడజాలక మేయో కన్యను గురించి మహాత్ముడు వ్రాసినట్లు మురుగుకాల్వలను మాత్రమే వెలువరించు యుద్యోగమును మీద వేసికొనుట– ఈ చీనాగోడలు– తన చుట్టు తాను నిర్మించుకొను గోడలు. వీటిని దాటి చూచువాడెవ డైనను కలడా?

ఉన్నతాశయుడ వైనచో నీ జీవిత మున్నత స్థాయిలో నడచును. నీచాశయునకు నీచ జీవితమే ప్రాప్తించును. పురుగుల నేరికొని తిను కుక్కుటము పైకెగురజాలదు. దూరదృష్టి గల ఖగేంద్రుడు వినీలాకాశమున సంచరించును. మన యాశయ

మును మనము మఱుగుపరచ జాలము. నీ ప్రతి రోమకూపము, ప్రతి రక్తబిందువు, నీ జీవితములోని ప్రతి చేష్ట, నీ హావభావములు నీ సంభాషణ సరళి నిన్ను వ్యక్తము చేయుచునే యుండును. హరిశ్చంద్రుడు సత్యము కొరకు కాటికాపరి యయ్యెను. దధీచి తన వెన్నెముక నిచ్చివేసి తన దాతృత్వమును వ్యక్తపరచెను. శిబిచక్రవర్తి కండలుకోసి యిచ్చి యభయ ప్రదాత యని వన్నె కెక్కెను. మహాత్ముడు తన యాశయము కొరకై యాత్మార్పణ మొనర్చెను. విద్యచేతను, సంస్కృతి చేతను నొకడు ఘనుడు కావచ్చును. అంతమాత్రముచే జీవితము పూర్తి కాజాలదు. ఆశయముతో కూడిన ప్రవర్తన, చరిత్ర తదను గుణముగనే యుండవలెను. ఈ రెండును క్షీరశర్కరల వలె మిళితమై పోవలెను. కేవలము అక్షరపాండితి విద్య కానేరదు.

శ్లో॥ యథా ఖర శ్చందన భారవాహీ భారస్య వేత్తా నతు
చందనస్య ।
తథైవ శాస్త్రాణి బహూన్యధీత్య సారం నజానన్
ఖరవద్వహేత్సః ॥

చందనపుకట్టెలను మోయు గాడిదకు వాని బరువు తెలియునేగాని చందనజ్ఞాన మెక్కడిది? సారమెఱుగని చదువు బరువుచేటు. గాడిదబరువు. ఒక పండితుని కథ కలదు. ఆయన గొప్ప శాస్త్రవేత్త. కవిత్వము, జ్యోతిషము, సంగీతము, వేద వేదాంగములు— ఈ యన్నిటియందు కడుదిట్ట. ఈయన

యనేక వత్సరములు కాశికాపుర వాసముజేసి సరస్వతిని స్వాధీనము జేసికొనెను. కాని యీాయన జీవిత మెంతమాత్రము రాణింప లేదు. ఈయన జీవితములో నెట్టి యుదారతయు లేక నీచాశయుడై జనకంటకు డయ్యెను. ఈయన విద్య పరులను హింసించుటకే యుపయోగింపబడెను. ఈయన రసికత్వము పరస్త్రీలపై ప్రయోగింపబడి స్వస్త్రీని వర్జించెను. ఈయన పోయినపు డొక విద్యాపేటిక పోయిన దనుకొనిరేగాని మంచివాడు పోయినాడని దుఃఖించిన వారొక్కరును లేరు. పైగా నీయన మరణమునకు సంతోషించిన వారనేకులు గలరు.

మనల నణచివేయు పరిస్థితుల నుండియు, పరిసరముల నుండియు, ప్రకృతి నుండియు విముక్తి పొందుచుండుటయే, వికాసము జెందుచుండుటయే జీవితము. "అక్షర జ్ఞానమే విద్య కాదు. కొన్ని యాశయములను హృద్గతము, శల్యగతము జేసికొన వలెను. ఆ భావములు, ఆ యాశయములు నీ ప్రకృతిలో నైక్యమయిపోయి నపుడే, నీలో హత్తుకొని పోయినపుడే యవి సార్థకము లగును" అని వివేకానందుడు వచించెను.

అక్షర పాండిత్యముతో పాటు, దక్షత, శుచిత్వము, విశాలత, గంభీరత, సహనము, దాతృత్వము నలవడవలెను. తనకొరకే పరులు సృష్టింపబడి రనుకొనుట పశుత్వ చిహ్నము. "పరస్పరం భావ యంతః శ్రేయః పర మవాప్స్యథ" అను గీతావచనము గలదు. ఒకరి శ్రేయస్సు నొకరు కోరునపుడే పరమ శ్రేయస్సు చేకూరును. జీవితమును శక్తివంతము మధు

రసభరితము శాంతిరస పూరితము చేయజాలని విద్య విద్య కాదు. నీవు ధనవంతుడ వైతివా లేదా? నీ కృషి ఫలించెనా లేదా యను దానికిని నీ జీవితము చరితార్థత నొందెనా? నీవు ధన్యుడ వైతివా? యను దానికి చాల భేదము కలదు. విత్తవంతు డగుగాక, విత్తహీను డగుగాక! తన యాదర్శమును జీవితములో చూరగొనువాడే ధన్యుడు. అన్ని పరిస్థితులందు తన యావచ్ఛక్తి, ప్రతి యవకాశము చక్కగా వినియోగించినవాడు పరోపకారము, మైత్రి తప్పనివాడు, దయ, దాతృత్వము, యుదారత చూపువాడు ధన్యుడు. ఇవి లేని జీవితము పొల్లు జీవితము. జిత్తులు, ఎత్తులు, కుట్రలు పన్నువాడు పరద్వేషి, సమాన శూన్యుడు మానవులలో లెక్కకు రాడు. మానవులలో నాలుగు జాతులు గలవు. స్తబ్ధులు, మందమతులు, చైతన్యహీనులు రాతిజాతివారు. పెరుగుదల విరుగుదల మాత్రమే యెరిగినవారు వృక్షజాతివారు. "చిన్ని నా పొట్టకే శ్రీరామరక్ష" యని యితరులను కొట్టుకొని తినువారు పశుజాతివారు. మానవ నిజోన్నతిని పొందగోరువారు దానికై జీవితమును, వినియోగించుకొనువారు పురుషార్థ సాధకులని రామతీర్థస్వామి వర్ణించెను. ఉచ్ఛ్వాస నిశ్వాసములను విడుచుట, యన్న పానీయములతో తృప్తిపొందుట జీవితము కానేరదు. "మానవుడు తిండికొరకే పుట్టలేదు. అతడు తిండితోనే తృప్తి పడజాలడు." అని బైబిలు గ్రంథము జెప్పు

చున్నది. ప్రతి మానవుని జీవిత బైబిలు కూడ దీనినే చాటు చున్నది.

"ఆశయము కలవాడు వేయి తప్పులు చేయుచో నే యాశయము లేనివాడు యేబది వేల తప్పులు చేయునని నేను దృఢముగ జెప్పగలను. కనుక నాశయవంతుడగుటయే శ్రేయస్కరము." అని వివేకానందస్వామి వచించెను.

"ఆహా! మిమ్ము మీరు తెలిసికొను టెంత ముదావహము? మీ రాత్మస్వరూపులు, దివ్యులు. మిమ్ము దూషింప గోరదు నేను మీరు మానవులని చెప్పుటయే చాలును" అని యా హిమాలయ వేదాంతకేసరి నోట పలికిన పల్కులు సువర్ణాక్షరములు.

# అప్రధానములు.

ప్రపంచములో నున్న దుఃఖములకు, బాధకు, అశాంతికి నూటికి తొంభై వంతులు మానవులు ప్రధాన విషయములు విడిచి యప్రధానముల నాచరించుటయే కారణము. లేచినది మొదలు నిద్రించు వరకు మనము చేయు పనులను, ఆలోచనలను, ఆచార వ్యవహారములను పరీక్షించి చూచుకొందుమేని చాలవరకు స్వల్ప విషయములను, అల్ప విషయములను, అప్రధాన విషయములను, అనర్థక విషయములను మాత్ర మెక్కువగ పాటించు చున్నట్లు తెలుగలము. సాధారణముగ మన దైనిక క్రియా కలాప సందర్భములలో యంత్రవతుగ గుడ్డిగ చేసి కొనిపోవు చుండుటయే తప్ప ఏది ముఖ్యము? ఏది యముఖ్యము? ఏది యుక్తము? ఏది యయుక్తము? క్రియా తాత్పర్య మెట్టిది? ఏది యెట్లు సిద్ధింప గలదు? అను విచారణ యణుమాత్ర మైనను లేకుండుట శోచనీయము. వివేచనతో కార్యములను చేయు వారు తక్కువగ నుందురు. ఒక పని, ఒక యాచారము, ఒక యాహారము, ఒక విహారము, ఒక నడక లేక యోచన మన శరీర మానసిక పోషణకు నారోగ్యమునకు, పవిత్రతకు, నాత్మోన్నతికి తోడ్పడు చున్నదా లేదా యను నదే ప్రశ్న కాని భావము లేకుండ, నాంతర్యము నెరుగకుండ, నాత్మ లాభమును పొందకుండ, చేయు శుష్క క్రియ, దేశ, కాల, పాత్రల నెరుగకుండ సంప్రదాయముగ చేయు

క్రియాటోపము ఛాందసము, వెర్రి, నిరర్థకము, పత్రిచేటు. ఇండ్లలో తరచు ఛాందస స్త్రీ పురుషు లెందరో చిన్న చిన్న విషయములకు నప్రధాన కాండకు ప్రాధాన్యత నిచ్చి గృహ శాంతిని, యారోగ్యమును, సుఖమును, సంతోషమును పాడు చేసికొనుచు లేని చోట నొక నరకమును సృష్టించుకొందురు. ప్రతి విషయము, ఆచారము, సంస్కారము, సాంప్రదాయము, శరీర మానసిక క్రియ, సంఘము కొరకు మానవ యౌన్న త్యము కొరకు నేర్పడెను. సారాసార వివక్షత, భావ సంశుద్ధి లేక చేయబడు ఆచారములు కాగితపు పువ్వుల వలె నిర్గంధము లగును.

శ్లో॥ అల్పశ్చ కాలో బహవశ్చ విఘ్నాయత్సార భూతం
తదుపాసితవ్యం హంసో యథా క్షీర మివాంబు మిశ్రం॥

నీ జీవిత కాల మత్యల్ప మైనది. విఘ్నము లతి సాంద్ర మైనవి. హంస నీటిని పాలను విడదీయునట్లు నీవు సారాసార ములను వేరు పరచి సార విషయములనే యుపాసింప దగునని పై శ్లోకము యొక్క సారాంశము.

కాని సాధారణముగ మన మీ విషయమునే మరచి పోవుదుము. ఏమి భుజింప వలెను? ఎట్లు భుజింప వలెను? ఎన్ని సారులు తిన వలెను? ఎప్పుడు నిద్రింప వలెను? ఎంత కాలము నిద్రింప వలెను? సంఘములో నెట్లు ప్రవర్తింప వలెను? అను వానిని గూర్చి విచారించు వారెంతమంది గలరు? సమస్త మును గ్రుడ్డిగ యంత్రము వలె చేసుకొని పోవుటే మానవ

విషాదమునకు కారణ మగుచున్నది. అలవాటు చేతనే ప్రతిది చేసికొని పోవుదుము.

ఏకాదశి మున్నగు కొన్ని ప్రత్యేక తిథులయం దుపవసింతుము. చిత్తశుద్ధి, యారోగ్య రక్షణము, నిత్య సాంసారిక కృత్యములనుండి విశ్రాంతి, యున్నత భావములు మీదికి మనస్సును మరల్చుట మొదలగునవి యుపవాస లక్ష్యములు. కాని యెంతమంది యీ లక్ష్యములను గుర్తించి చేయుచున్నారు? శాంతికై యాహారమును మానుదురుగాని యీ దినమైనను భార్యను తిట్టుట, పిల్లలను, బూడిదెత్తి పోయుట, గరిటెలను, కర్రలను విసరుట, కొట్టుపని మానుట, కొంపలను కూల్చుపట్టి యాలోచనలను కట్టిపెట్టుట,- యిత్యాది శాంతికర సాత్త్విక క్రియలు చేయుదురా? లేదు. ఈ తంతు యథావిధిగ జరుగ వలసినదే. ఉపవాసానంతర మేమి తినవలెను? ఎన్ని పిండివంటలు శాస్త్రములో చెప్పబడినవి? చలిమిడి తినవచ్చునా? పిండిగూడ తినవలెనేమో? అన్నము నిషేధముగాని గోధుమ నిషేధముగాదు కదా! పోతెసా గోధుమపిండి రొట్టె నూనెల నేతితో తడిపి పంపు పంచదార యుద్ధము వేసి లఘువుగా తేల్చివేసినచో నుపవాసములోనే లెక్క. పిండివంట లగాయతు పిసినికవంట వరకు, శ్రాద్ధము లగాయతు పెండ్లి వరకు, స్నానము లగాయతు పానము వరకు, జన్మోత్సవము లగాయతు ప్రేతకర్మ వరకు,- సమస్తము యాంత్రిక కర్మయే! అర్థము లేకుండ చేసి కొని పోవుటయే! భావమును, ఆశయమును, జీవిత విలువలను విస్మరించుటయే జరుగుచున్నది.

శరీర శుచి, వస్త్రశుచి, భాండ శుచి, గృహ శౌచము, క్షేత్ర శుచి, యుండవలసినవే. "శుచియే దైవము" అను సామెత గమనార్హము, కాని స్నానముచేసి వచ్చి ఆటలాడు కొనుచు, కేరింతలు కొట్టుకొనుచుండు మనుమడు తగిలినా డనియో, త్రోవలో పడియున్న నూలుపోచ త్రొక్కెనియో, తనవంటి మరియొక వ్యక్తి యెదురుపడినాడనియో, రాకాసి కేకలు వేసికొనుచు, నోరు ముళ్ళగుత్తి జేసికొనుచు, తిట్టు కొనుచు, నన్నము తినే నోటితో "పిండాకుడులు, శ్రాద్ధముకు కుడుములు, గోతిలోపెట్ట, నువ్వు చచ్చిపోను, కాలిపోను" అని జరుపు వ్యవహార మే శుచిలో జేరును?

శ్లో॥ సర్వేషా మేవ శౌచానా మర్థశౌచం పరంస్మృతం।
యో అర్థేశుచి స్సశుచిః నమృద్వాం శుచిః శుచిః॥

అన్ని విధములగు శుచులలోను భావమెరిగి చేయు శుచియే యుత్తమ మైనది. అర్థమును గ్రహించి చేసినవాడే శుచివంతు డగును. నీటితోను, మట్టితోను తోమినంత మాత్రముచేత శౌచము గాదు. అర్థ మెరిగి చేయని యే క్రియకు సిద్ధి లేదు. ఒక్కొక్క కొంపలో తోమిన చెంబు తోముట, కడిగిన పీట కడుగుట, యలికినచోటనే యలుకుట, నిప్పు కూడ కడుగుట, చేసే దాని యందు శ్రద్ధ యుంచక పోవుట, చివర కే యొంటిగంటకో ఇంత యుడక వేసి పోయుట! ఇదేమి కర్మమో తెలియదు. పిల్లవాడు వేళ కన్నమునకు రాలే దనియో, భర్త చూడక సరియైన కూరగాయలు తేలేదనియో,

బాసి లాంతరులో కిరసనాయిలు పోయలేదనియో, చాకలి యొక గుడ్డపీలిక పారవేసినాడనియో, పిలువగానే భార్య హాజరు కాలేదనియో, మరి యే చిన్న కారణమునకో రోజంతయు జాడించుకొనుచు, ఘూము ధాము జేయుచు, గృహ రాజ్యమును చేపల బజారుగ చేయవలసినదేనా? ప్రమాదమున త్రాడు తెగి నూతిలో పడినందుకు బంగారమువంటి పిల్లను బాదవలసినదేనా? కర్మముజాలకొక పూట పోపు మాడిపోయి నందులకు బంధుగులున్నను, స్నేహితులున్నను, పెద్దలున్నను, పిన్నలున్నను, భార్యపై యన్నపుముద్ద లెగురుట శుచియేనా? నేతిగరిటె కాకి యెత్తుకొనిపోయి పొరుగు దొడ్డిలో వేసినందుకు చేసికొనుచున్న సంధ్యావందనము మానివేసి పొరుగువానితో పోట్లాడవలసినదేనా? ప్రతి చిన్న విషయమునకు, పెద్ద విషయమునకు నస్తమానము రాచి రాపాడించుట, విడుపు లేకపోవుట, సూచన మాత్రముగా వదలక, కొరడావలె, కమిచీవలె దిద్దిరలాడుచుండ యంటునట్లుగా చూడవలసిన విషయములలో నొడలంతా సున్నము చేసికొనుట, కట్టుదిట్టము, నిక్కచ్చి యుండవలసిన చోట జారిపోవుట, విమర్శనలను, కార్యములను, తనపై గురిపెట్టుకొనక నెదుటివానిపై గురిపెట్టుట— యివి జీవిత మర్మమును, జీవిత శాస్త్రమును జీవిత పరమార్థమును విస్మరించి చేయు పనులు. జీవితమున కెంతమాత్రము వన్నె నొసంగని యనేక స్వల్ప విషయములను, తేలిక విషయములను, అప్రధాన విషయములను, కేవల బాహ్యాడంబరములను

మనము లెక్క జేయరాదు. మనము వానిచే బాధపడక పొరుగువారిని బాధ పెట్టకపోవుటయే గాక వాని నుపేక్షింప వలెను. అల్ప విషయములపై నుదాసీనత సహగా విషయములకు పైగ నుండుటను ప్రకటింపవలెను. నీ జీవిత నౌకను ముంచి వేయు చెత్త చెదారములను విస్మృత సాగరములోనికే గెంటి వేయుము. నీకు చీమకాలంతయు సహాయపడక పోగా నిన్ను గంగవెర్రు లెత్తించు విషయలవములకు, నల్పాంశములకు స్వస్తి చెప్పుము.

కొంతమంది కంటిలోని నలుసువలె, చెప్పులోని రాయి వలె, చెవిదగ్గర దోమవలె, కురుపు నలుపు నట్లు స్వమానస మొక విషయమును గురించి నలుపుచుందురు. కొంతమంది తల్లి తండ్రులు కోమల శిశుహృదయ తంత్రుల క్రీడారహస్య మెరుగక నవి స్పందించునని, వికసించునని, ముకుళించునని, గ్రహింపక వాని సౌకుమార్యమును మొద్దుపరచెదరు. అనేకమంది యుపాధ్యాయులు విద్యార్థుల లోటుపాటుల నరసి, వారికి తెలియజెప్పక గనే వానిని చక్కజేయుటకు బదులు అడ్డదిడ్డ పద్ధతి నవలంబించి, గోరంతలు కొండంతలుచేసి, సవరించుకొను పాకము చెడ గొట్టుదురు,

ఒక స్నేహితుడు గలడు. ఆయన ప్రఖ్యాత పురుషుడే. ఎక్కువ దేశసంచారము జేసినవాడే. చక్కగా నుపన్యసించుట లోను, వ్రాయుటలోను శారదయే. బహువిధ శక్తులు గల వాడు, అనుభవజ్ఞుడు. కాని స్వల్ప విషయములను గురిం

యుక్తిని, యుదాసీనతను చూపక చేయవలసిన సంస్కారము
లను, సూచనలచే తెలిపి విడువక రాచి రాపాడుచు సిద్ధింప
వలసిన ఫలితమునకు వ్యతిరేక శక్తి నుద్రేకింపజేయుచు, తాను
చిందర వందర నొందుచు, తనకంటె పిన్నలైనవారిని యజ్ఞు
లైనవారిని చిందరలో దింపుచు, కనపడినవారందరితోను తన
చికాకు పురాణమును విప్పుచు, స్వజనమునే శత్రుజనముగా
భావించుచు చివరకిట్టి విషాద చరిత్రను సృష్టించుచుండును.
ఇది కడు శోచనీయము. సంస్కారము, హృదయ వికాసము
యీ పద్ధతిచే చేకూరనేరవు. ఏది ప్రధానమో, ఏది యప్ర
ధానమో, దేని కెంత విలువ యివ్వవలెనో, దేని నెంతవరకు
సాగదీయవలెనో, దేనికొరకు పరితపింపవలెనో, దేనికై ప్రాకు
లాడరాదో మొదలగు విషయములను తెలిసికొనుచు నట్టి
ఘట్టముల నైనను లీలగా నెదుర్కొనుటయే జీవిత కళ.
సుఖము, రసము, నెరుగని జీవితము యెడారిజీవితము వంటిది
యగును.

అప్రధాన విషయములను పాటించుటచే దేశము పాడై
పోయినదని వివేకానందుడు చాటుచున్నాడు.

"స్వభావముచేతనే యర్థరహితములు, వ్యర్థములునైన
విషయములను గురించి జరుపు పాత చర్చలకు వాగ్వివాదము
లకు స్వస్తి చెప్పుడు. గత యారేడువందల సంవత్సరముల
నుండి మన మొకవంక యవినీతి పాలగుచు కుడిచేతితో నీరు
త్రాగవలెనా? ఎడమ చేతితోనా? చేయి మూడుసారులు

కడుగుకొనవలెనా లేక నాల్గు సారులు కడుగుకొనవలెనా? మన మయిదు సార్లు పుక్కిలించవలెనా? లేక నాల్గు సార్లు పుక్కిలించవలెనా యని వత్సరముల తరబడి తర్కించుచు నిట్టి 'గొప్ప ప్రశ్నల'తో జీవితములను గడపువారి నుండి మన మేమి యాశింపగలము? పైగా వీనిమీద నిశిత వేదాంత గ్రంథములు వ్రాయుట! మన మతమునకు సాకళ్ళాల నాశ్రయించిన యుపద్రవము గూడ సంభవించెను. మనలో చాలమంది యిప్పుడు వేదాంతులమూ కాము! పౌరాణికులమూ కాము! తాంత్రికులమూ కాము! మనము కేవలము "నన్ను ముట్టుకోకు" యను తంతు లోనికి దిగితిమి." అని వివేకానందు డెలుగెత్తి చాటినాడు. మనలో వివేకము నశించినది. ఏది ముఖ్యము? ఏది యముఖ్యము? ఏది ముందు? ఏది వెనుక? యను విచారము శూన్య మయ్యెను. వివేకము, సారాసార పరిశీలనయే జీవిత పరిమళమును సాధింపగల దివ్యౌషధము.

# వాక్చాతుర్యము.

శ్లో॥ వాణ్యేకా సమలంకరోతి పురుషం యాసంస్కృతా ధార్యతే ।
క్షీయంతే౽ఖిల భూషణాని సతతం వాగ్భూషణం భూషణం॥

వాణి యొక్కటే పురుషుని చక్కగ నలంకరింపగల భూషణము. తక్కిన భూషణము లన్నియు నశించునవి. "వాగ్భూషణ మెల్లప్పుడు నుండు నొడవు." అని భర్తృహరి వచించెను. వాక్చాతుర్యము మానవున కమోఘశక్తిని ప్రసాదించును. సూదంటురాయి సూదె నాకర్షింపక పోవచ్చును. భూమియొక్క గురుత్వాకర్షణశక్తి తేలిక వస్తువులను తనవంకకు లాగికొనజాలక పోవచ్చును. పూర్ణిమ చంద్రుడు సముద్రమును కేరింతలు కొట్టింపజాలక పోవచ్చును. కాని ప్రజ్ఞగల్గు వాక్కు గలవాడు సముద్రములు దాటినను విధిచే ప్రపంచములో నేమూలకు విసరివేయబడినను ప్రకాశించుచునే యుండును.

వివేకానందు డమెరికా చేరుకొనుటే దుర్ఘటమయ్యెను. ప్రపంచ మత సభలో మాట్లాడుటకు పూర్వ మెంతయో తంతు జరుగవలసి యుండెను. అతని కది తెలియదాయెను. తెలిసిన తర్వాత నతని ప్రయాస వృధయైనట్లే కాన్పించెను. చివరకొక పుణ్యాత్మురాలి సహాయమువలన నతని కెట్లో నా సభలో ప్రవేశము దొరకెను. వందలకొలది ప్రతినిధు లదివరకే తమ యుపన్యాసములను మెరుగులు దీర్చి యుంచుకొని

సభలో చదివిరి. వివేకానందుని వంతు వచ్చెను. అతని యొద్ద చిత్తుకాగితమైనను లేదు. అతడు లేచి తన మృదు మధుర స్వరములో ప్రారంభించుసరికి సభయంతయు దిగ్భ్రమ జెంది చిత్తరుబొమ్మల వలె నుపన్యాసము ముగియువరకు కాలపరిమితితో నిమిత్తములేకుండ నట్లే నిలిచిపోయిరి. ఆ "హిమాలయ వేదాంతకేసరి" పాశ్చాత్య లోకమును దద్దరిల జేసెను. అతనికి జేకూరిన స్వాగతమునకు, విజయమునకు మేరయే లేదు. తర్వాత నతడు పాశ్చాత్య లోకమును తన వాగ్ధాటితో నింపివేసెను.

నీ భావములను, అభిప్రాయములను నిర్దుష్టముగ సరళమైన భాషలో తేటతెల్లముగ, హృదయంగమ మగునట్లు శ్రోతలను కట్టివేయునట్టి యాకర్షణశక్తితో చెప్పగలుగుట గొప్ప శక్తి. దీనికి తోడు ప్రతిభ, ప్రసాద గుణము యున్నచో నిక చెప్పవలసిన దేమున్నది?

మహాత్ముడు మాట్లాడినపుడు రాళ్ళు కరగును, పిరికి పందలు ధైర్యవంతులైరి. అవిశ్వాసులకు విశ్వాసము జనించెను. కుటిలాత్ములు పవిత్రులైరి. మహా భోగులు త్యాగులైరి, కొంతమంది జీవితమే పూర్తిగ మారిపోయెను. వాక్ఛక్తి ముందర నసాధ్యము సుసాధ్యమగును. ఇట్టి శకను యువకు లుపేక్షింప తగదు. ఇది గొప్పకళ, ప్రజలను రంజింప జేయు వలెననినను, వారిచే ఘనకార్యములను చేయింపవలెననినను, ప్రజానాయకుడు కావలెననినను యిట్టిశక్తి యవసరము. పాఠశాలలు, కళాశాలలు విశ్వ విద్యాలయములు నిట్టి యమోఘశక్తికి,

కళకు తగిన స్థానమీయకపోవుట, గాని నొక విద్యావిషయముగ గ్రహింపక పోవుట శోచనీయము. అనేక కలగాపులగ విషయములకు జీవితముతో ప్రత్యక్ష సంపర్కములేని విషయములకు తావిచ్చి నిత్యానుభవమునకు పనికివచ్చు కళను వర్జించుటుచితముగాదు.

మన మెక్కడ లేని విషయములను తెలిసికొనుటకు తాపత్రయ పడుదుము. ఆకాశ శాస్త్రము, భూగర్భ శాస్త్రము, రేఖాశాస్త్ర గణితాదులు నిత్యజీవితమునకు సంబంధించని యనేక జంత్రీలను గుణించు చుందుము. కాని ప్రతి నిముషము అవసరమగు భాషాశక్తి నొక కళవలె పోషించుకొని యభివృద్ధి జేసికొనము. సాధారణముగ మనము మాట్లాడుకొను భాష తీర్చి దిద్దుకొనము. అట్టి ప్రయత్నమును చేయము. తగిన మెళుకువ గలిగి యేపద మే ధాతువునుండి పుట్టెనో, దేని నెంతవరకు ప్రయోగింపవచ్చునో, సమానార్థము లెవ్వియో యను శాస్త్ర విచారణ యేదియు చేయబడదు. ఒక్కొక్కనికి పాండిత్య ముండును. శాస్త్రజ్ఞాన ముండును. ఎంతయో యనుభవము, లోతుగుండె కలవాడే యగును కాని పదిమందిలో మాట్లాడవలసి వచ్చినపుడు మూకీభావము వహించును. నోరువిప్పడు. ఇది యొక గొప్పలోటు.

ఒక స్నేహితుడు కలడు. అతడు గొప్ప పతితి. దేశసంచారి. అనేక విషయములను తరచినవాడు. కనిపెట్టినవాడు. బహుళ పరిశ్రమ చేసినవాడు. అతని గ్రంథము నొక విశ్వవిద్యా

లయము గుర్తించి ప్రచురించెను. కాని సభలో మాట్లాడమనిన మాట్లాడడు. నోరు విప్పి పదిమందిని రంజింపజేయ జాలడు... ......భాష సభాంతరాళమున బుద్ధుల వాక్చతురత్వము. ...అని భర్తృహరి సజ్జనాళి కిది యొక ప్రకృతిజన్య గుణమని వర్ణించినాడు. ఏ వృత్తిలో నున్నను, ఏ స్థితిలో నున్నను తన హోదాకు, వృత్తికి తగిన సమయానుకూలమగు భాషాశక్తి లేనిచో నెవడును మెప్పు పొందజాలడు.

తమ వక్తృత్వ శక్తిచేతనే ప్రజలను దిగ్భ్రమ నొందించి, మహానాయకులైన వారెందరో గలరు. శిశిరో, బర్కు, సురేంద్రనాథ బెనర్జీ, బిపినచంద్రపాలు, బిసెంటు, ఆంధ్రరత్న గోపాలకృష్ణుడు మొదలగువారీకోటిలోని వారే. ఇది మానవుని శక్తి నెన్నియో రెట్లు పెంచును. తమ గుణముచేతను, బుద్ధిబలముచేతను, యితర అర్హతలచేతను సంపాదింపజాలని పదవులను, జీతములను తమ భాషాశక్తిచేతనే సాధించుకొనిన వారెందరు లేరు? మాట పొందెరిగిన వారనే దేశములమధ్య రాయబారిగ నెన్నుకొనెదరు. అంగద, సంజయ కృష్ణ రాయబారముల నొక్కసారి చదివి చూచినచో వారి వాక్చాతుర్యము బోధపడ గలదు. ఎట్టివాడు రాయబారిగ నుండదగునో భారతము సూచించెను.

క. హితుడవు మతిమంతుడవు చతురవచన కోవిదుడవు
సమయజ్ఞుడవు
న్నత వంశవర్ధనుడ వింగితవేదివి నెచ్చెలివి సుకృతి వట్టగుటన్॥

రాచకార్యములందు నీచులను, స్వార్థపరులను, పరహిత ద్వేషులను, కుత్రదారులను, వదరుబోతులను, మదాంధులను, దోపిడి గాండ్రను ప్రయోగించుట దేశ దౌర్భాగ్యము. అట్టి వారు రాకుండ జేసికొను బాధ్యత, అట్టి ప్రజలయందే గలదు. పెద్దపెద్ద మాటలను, సూత్రములను, ప్రయోగించి ప్రజాస్వామికము పేర మోసగింప జూచు వంచకులను గూడ పసిపట్టవలసిన బాధ్యత, సంస్కారము ప్రజలలో నుండవలెను. మన నిత్య జీవితములలో గూడ కార్యములను చక్కబెట్టుకొనుటకు మాటయే కదా ప్రధానమైనది! కాలు జారిన కలిసి వచ్చును గాని నోరు జారిన కలిసివచ్చునా? ఒక ప్రధానమంత్రి పత్రికాధిపతుల గోష్ఠిలో "ఆంధ్రులకోర్కెలు జస్టిస్ కోర్కెలను మించినవి. నెల్లూరు, చిత్తూరు, తిరుపతి యెవనివే" అని యనవచ్చునా దెవరు? తెరువారి నిక్కదీసి యడిగినప్పు డామాటలను తినమన్న దెవరు? ప్రాణి. మాటనుగాక చెప్పనవో బలికొనుచుండును. రుక్మిణి శ్రీకృష్ణుని యొద్దకు, దమయంతి నలుని యొద్దకు నెట్టిన వారిని దూతలుగ బంపిరి? వారెంత సుగమముగ కార్యములను చక్కబెట్టిరి? మాట పొందు అద్భుత శక్తి గలది.

ఒక స్నేహితుడు దేశప్రసిద్ధి గాంచినవాడు. అనేక చోట్ల తిరిగి, భోగాట్టాచేసి గాలించి, కుమార్తెకు చక్కని సంబంధము తెచ్చెను. ఇక మాట యనుకొనుటే మిగిలెను. అంతయు కుదిరిన దనుకొనినది మాట రీతి తెలియక చెడిపోయెను.

మాటల తొందరలచే పీటలమీద పెండ్లిండ్లు చెడిపోయిన వెన్నియో కలవు. మాటపట్టింపు కంటె మాటపట్టింపు ప్రమాదమైనది. ఒక పురాణవిద్యా పారంగతుడు నాల్గువేల మాట పుచ్చుకొని మాట పట్టింపుచే కుమారునకు రెండవపెండ్లి చేయుట చోద్యము కాదా? మాటతీరు, సొంపులేని పెటుకు దనము పెళుసరిదనములచే గృహస్థాశ్రమ ఛాయలందనుభవింప వలసిన యానందము ననుభవింపక పోగా చేతులార కూలద్రోసి కొనబడిన సంసారము లెన్నియో కలవు.

చక్కగ మాట్లాడుట యనగా శుష్క వాగాడంబరము కాదు. చకచక శబ్దములను దొర్లించుటయు కాదు. మాటలు నేర్చిన నిఘంటువు కాదు. ఒక వక్త నిఘంటువులలో నున్న శబ్దముల నతిధారాళముగ విసరుచు నురుము చున్నట్లుండెడి వాడు. కాని యీ యురుముల వెనుక శారదాడంబర మేఘాడంబరమే తప్ప రసవృష్టి నేమియు నుండదు. ఆయన కొక వ్యక్తిత్వము, ఆదర్శము, విశ్వాసము, భావము, ప్రభావము లేవు. ఆయన నెవరైనను అద్దెకు మాట్లాడించుకొన వచ్చును. రాఘవా స్వస్తి యను నోటితోనే రావణా స్వస్తి యని యనగలడు. ఆయన కది యొక పని. కాని ప్రాణము లేని శరీరము వలె, విశ్వాసము లేని మాటలలో పసదన మెక్కడనుండి వచ్చును? హృదయము లేని భాషలో జీవ ముండజాలదు. మాటనేర్పరితనము, పస దనము ఘటిల్లుట కెన్నియో సుగుణము లలవడ వలెను. అధ్య యనము, గంభీరత, యనుభవము, నిదానము, యోచన, వివేకము, భాషకు వన్నె దెచ్చును. ముఖము మనోదర్పణ

మైనట్టే వాక్కు కూడ మనోదర్పణమే యని వేరుగ జెప్ప నక్కరలేదు. మాటను బట్టి కూపస్థ మండూకమా? లేక దేశానుభవము కలవాడా? సునిశిత పరిశోధన చేసినవాడా? లేక పైపై చూపరియా? సుశిక్షిత బుద్ధియా? లేక నడపతడప బుద్ధి కలవాడా? అత డే గ్రంథములను జదివెను? ఎట్లు జదివెను? అను విషయములు వాని మాటల వల్లనే తెలియగలవు.

సంభాషణను బట్టి మనిషియొక్క శీలసంపదలు తేటపడ గలవు. ఒక్కొక్కడు మాట్లాడ మొదలిడినచో చెవులు చిల్లులు పడునట్లు తన గొప్ప, తన ఘనకార్యములు, తన తెలివి, తన ప్రయోజకత్వము, తన విజయములు, తన వీర రక్తమును పొగ డుచు నితరులు బుద్ధిహీనులని, తుంటరులని దూరుచు నాత్మ స్తుతి పరనిందలతో నిన్ను సతాయించు చుండును. విషయ మేది? సభలోనున్న సభ్యులెవ్వరు? వారి కేవిధముగ మాట్లా డిన యర్థమగును? అనునవేమియు నతని కవసరము లేదు. ఉపన్యాసమును చీనాతో ప్రారంభించి పెరూతోనో లేక తన తోనో యంతము చేయును. ఒక్కొక్కప్పుడు దాని నెట్లంతము చేయవలెనో తెలియక తబ్బిబ్బై బాధపడు చుండును. మన లను బాధపెట్టును.

ప్రతి యువకుడు, ప్రతి యువతి, న్యాయవాది, పెద్ద యధికారి, గొప్ప యైశ్వర్యవంతుడు కాజాలక పోవచ్చును. కాని, సంఘములో నతడు ప్రతి నిత్యము తన వాక్సంపద నభి వృద్ధి చేసికొన వచ్చును. దానివలన గృహము లానంద

ధామము లగును. వాక్కులహముతో ప్రారంభింప బడని కలహము నెవడైన చూపగలడా? వాగ్వాదమే కలహద్వారము. హృదయములో మాధుర్య మున్నను నోటి చేదు దానిని చెడగొట్టి మధుపాకమును తిక్తమయము చేయును.

ఒక చిన్న యితిహాసము కలదు. ఒకనాడు తల బ్రహ్మ యొద్దకు పరుగెత్తి యతనిపై నిరసన తీర్మానమును తెచ్చెను. ఈ రోజులలో నెంతవానిమీద నైనను నాలుగు కోతులు కలిసిన నిట్టివి తేవచ్చును. "నీ సృష్టిక్రమము బాగుండ లేదు. ఒకరు చేసిన తప్పుకు మరియొకరు శిక్షింపబడుట యేటి న్యాయము? నాలుక వాగినదానికి నన్ను పగులగొట్టునట్లు చేసితివి. నాలుక నెచ్చటనో భద్రముగ ముఖమునందు దాచి యందరు తేరగ గొట్టునట్లు నన్ను బయట పెట్టితివి." అని వాపోయెను. బ్రహ్మ "ఎచ్చటనో దాచినను కొంతమంచి దానిని పని గిట్టుకొని బజాన వేసికొని బయలుదేరు చుండుటచే నీకీ యడపతడప బేరములు తగులుచున్నవి. నేను నాలుకను బయటనే సృష్టించి నచో నీకు దెబ్బలు నిత్యపంటయే యగును." అని యూరడించెనట. కనుక వాక్కు నిశితమైన కత్తి వంటిది. దానిని నీ మీదనే ప్రయోగించుకొన వచ్చును. బయటవాని మీద ప్రయోగించ వచ్చును. సుఖశాంతుల ననుభవించునట్లు ప్రయోగింప వచ్చును. ఎప్పుడు దుఃఖమునే తెచ్చిపెట్టుకొనునట్లు వాడవచ్చును. చివరకు నీ సంస్కార మంతయు జిహ్వాగ్రము నుండియే విదితము కాగలదు.

మనము మన పిల్లల శరీర పోషణకు వస్త్ర సౌకర్యములకు తాపత్రయ పడుదుము. పర్వదినములు, శోభా శుభ దినములు తిండి కొరకు వేషము కొరకు అగుచున్నవి. వారి కండరములు పెంచుటకు, శరీర బలుపులకు తగు నాటకముల కొరకు ఎగబడుదుము.

కాని, పిల్లల కాత్మసుఖము కలుగునట్లు వారినెన్నడైన మెచ్చుకొందుమా? వారి యంతరంగములను కరగించు మృదూక్తులతో, మధుర వాక్య సరణితో వారిని సంబోధింతుమా? పిల్లల యాత్మ గౌరవమును, గుణ సమ్మానమును చేయని రిత్త బాహ్య మర్యాదలు వృథాయాసములు.

# ముక్తసరి.

ముక్తసరి యనగా ముత్యాలహారమని యొక యర్థము. మురిపెమును గూర్చు ముత్యాల హారమును ప్రేమింపని వారెవరును యుండరు. ఈ సరములో, యీ హారములో మానోహరములగు, నమూల్యములగు ముత్యములే తప్ప యే గులకరాళ్ళు చేరవు. అందు యితర గులకరాళ్ళు చేరినచో దాని యందచందములే చెడిపోవును. దాని విలువయే తగ్గిపోవును. అట్టిది ముత్యాలహారము కాదు, యలంకారార్హము కాదు.

అట్లే జీవితములో ముక్తసరి యనునది యనగా సూటి, పరిశిత మానవునకు పెట్టని యలంకారము. నీ లక్ష్యమును, హారమును సునాయాసముగ జేరగలుగుట కింతకంటె గొప్ప యుపాయము లేదు. దీనిచే మానవుడు శోభించును. జీవితము బహు శాఖాసమన్వితము. ఈ యన్ని శాఖలలోను ముక్తసరి యవసరము. దీని వలన కాలము, శక్తి కూడివచ్చును. దక్షత, నేర్పరితనము యభివృద్ధి యగును. ఏకాగ్రత యలవడును. అనవసర ప్రసంగములు, ద్రావిడ ప్రాణాయామ పద్ధతి నశించును. శాఖా చంక్రమణము చేయకుండ సరాసరి విషయములోనికి ప్రవేశింప గలుగుదుము. భావములోను, మాటలలోను, చేతలలోను, నడవడికలోను ముక్తసరి యభ్యస్త మగు నేని జీవితము ధన్యమగును. నీ కాలము, శక్తి, ధనము, కూడివచ్చుట కింతకంటె వేరొక యుపాయము లేదు.

''ఒక గుణము నా కతి సుగమమైనదని నేను గుర్తించితిని. అదియే ముక్తసరి. నేను దానిని సాధించుటకు కృతనిశ్చ

యుడ నైతిని.'' అని జే యను నతడు చెప్పి తన జీవితమును అట్లు నడపికొని గొప్పవాడైనట్లు చరిత్ర చెప్పుచున్నది. దినములోని యిరువదినాలుగు గంటలలో మన మనేక పనులు చేయుచుందుము. నిద్రలో, జాగరణములో, తిండిలో, నడకలో, వ్రాతకోతలలో సర్వత్ర ముక్తసరి యవసరము. భగవద్గీతలో శ్రీకృష్ణుడు రెండు శ్లోకములలో దాని నిట్లభివర్ణించి యున్నాడు.

శ్లో॥ నాత్యశ్నతస్తు యోగోస్తి నచైకాన్త మనశ్నతః।
నచాతి స్వప్నశీలస్య జాగ్రతో నైవచార్జున॥
యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు।
యుక్త స్వప్నావబోధస్య యోగోభవతి దుఃఖహా॥

ఎక్కువగ తినుట, అసలు తినకపోవుట, అతినిద్ర, అసలు నిద్రింపకపోవుట పనికిరావు. దేనియందును నవ్యాప్తి కాని అతివ్యాప్తి కాని పనికిరాదు. జీవితమును పై సూత్రము ప్రకారము గడపినపుడు కాలముపై నీకు యాజమాన్యము సిద్ధించును. నీ వృథాప్రయాసలు, శుష్క-కలాపములు తగ్గిపోవును. నీ జీవితనే పాడవగును. నీ జీవితశక్తి యన్ని విధముల పరిరక్షితము, పుష్కలము నగును. అప్రస్తుతములు ననవసరములు నీ దరి చేరజాలవు. నీవు సిద్ధహస్తుడవు, విశుద్ధ జీవివి యగుదువు.

జీవితములో ముక్తసరి యనగా నేమి? ఆహారవిషయములో శరీరారోగ్యమునకు, పుష్టికి కావలసినవి తగినవి మాత్రమే తినుచు తక్కిన వానిని నిర్వీర్య వస్తువులను విసర్జింపవలెను, హితభుక్కు, మితభుక్కు చిరాయురారోగ్యముల

కర్హింగుదురు. వేషములో కూడ దేహశుచి కర్హమగు నంత వరకే ధరింపవలెను. తక్కిన "పీకి బిగింపులు", నడుము బిగింపులు, అంతర్వస్త్రములు, ఫ్యాషనులు మొదలగు వికారములు వేషాడంబరములు. ఇవి తరచు యితరులను మోసగించుటకే యుపయోగింపబడు చుండును. ఈ పెద్దవేష మున్నగాని పదిమంది దరికి జేరరు. అధికారులను, క్లయింటులను, సరసులను లాగుటకివి బాహ్యోపకరణములు. మన దేశములో నిట్టివి యవసరములు కావు. మన స్వేదకూపములను పూర్తిగా కప్పివేయరాదు. ప్రేమకవచమునోని శరీర మంతయు కప్పివేయబడిన యొక రాకుమారుడు వెంటనే చనిపోయినట్లు గ్రీకు పురాణములలో నొక కథ గలదు.

ఇట్లే యన్నిటియందు గుణము, కుదింపు యమూల్యములు. తట్టెడు రాళ్ళకంటె నొక ముత్యము మేలు. కడివెడు గాడిదపాల కంటె గరిటెడు గంగగోవుపాలు హృద్యము, పథ్యము. గంటన్నర నోటితుంపరల పసకంటె వజ్రములవంటి నాల్గు అనుభవ సూత్రాక్షరములు మేలు. ఈ జీవిత ఖేలనములో నీ వెంతకాలము దొంగ వగుదువు? పిల్లలు దాగుడు మూతలాట యాడుకొందురు. ఈ యాటలలో నొక పిల్ల 'తల్లి' యగును. ఒక పిల్ల 'దొంగ' యగును. ఈ తల్లి దొంగ కండ్లు మూయును. తక్కిన పిల్లలిటునిటు పారిపోయి దాగొనెదరు. తల్లిని ముట్టుకొనకుండ దొంగచే పట్టుపడిపోవు పిల్ల 'దొంగ' యగును. తక్కిన వారంపరు పడిపోవుదురు. ఒక్కొక్క పిల్ల

గిరగిర గిరగిర తిరిగి తిరిగి తిరిగినచోటనే యుండిపోయి పట్టుపడి పోవును. నీ జీవితములో 'పండి' పోవలెనన్న ఈ తిరుగుడు వ్యాపారము మానవలెను. లేనిచో నీవే 'దొంగ' వగుదువు. కాలము నిన్ను పట్టి యిచ్చును. అంతయు మించిపోయిన తరువాత నీవు చేయునది లేక తెల్లపోవుదువు. నీ దొంక తిరుగుడు జీవితమునకు నిన్ను నీవు నిందించుకొందువు.

భాషలోను, వ్రాతలోను యిస్లీ ముక్తసరిగ నుండవలెను. విషయములో సూటిగ ప్రవేశింపవలెనే గాని ముక్కు చూపింపమనిన త్రిప్పి త్రిప్పి చూపించుట తగదు. మితభాషిత్వము హితభాషిత్వమునకు దారితీయును. ఒక్కొక్కడు వ్యాసమునో, కథనో, చరిత్రనో వ్రాయ ప్రారంభించి కథాభాగములోనికి వచ్చుసరికి తాతలు దిగివత్తురు. కథకంటె, విషయముకంటె పూర్వభాగమే భారమై విసుగు పుట్టించును. చద్దికంటె నంజుడు హెచ్చైనట్లుండును. కొందరు విషయము చుట్టు గిరగిర తిరుగుచు విషయమును విడిచివేతురు. ఒక స్వాములు భగవద్గీతను చెప్ప ప్రారంభించి గంటసేపు మాట్లాడి మాట్లాడి శ్రోతలను విసిగించి గీతావిషయమును గురించి చెప్పక నూకదంపు కాలక్షేపముచేసి చివరకు బలవంతముగ బల్ల దిగెను. హరికథ చెప్పు కొందరు హరిదాసులు కలరు. అసలు కథకంటె వీరి పిట్టకథలు ఘనమై వీరి హరికథయే పిట్ట తల వేయును. దానితో ప్రజలందరు 'రమా రమణ గోవిందో హరి' యని గోలచేయుచు లేచిపోవుదురు. శ్రోతలు లేచిపోవు

చుంత హరిదాసు తన గోలలోనే యుండి వెళ్ళిపోవు వారిని తిట్ట నారంభించును. దానితో మిగిలినవారు కూడ లేచిపోవుదురు. చివర కాయనయే దాసు, ఆయనయే శ్రోత. ఇట్టి యుపన్యాసకులను కూడ తరచు చూచుచునే యుందుము. "శేషం కోపేన పూరయేత్" అను నట్లే యుపన్యాసకులు సభ్యతను వీడి సభాదూషణకు దిగుదురు.

సూటిగ విషయము నెత్తుకొనక నొక చాటభారతమును తయారుచేసి మధ్యలో నెచ్చటనో బంగారమును పాదిగినను లాభమేమి? ఎత్తుగడ సూదంటురాయివలె నాకర్షింపక పోవుటచే పాఠకుడు పది పేజీలు చదివి మూల పారవేయుచు తీసినపుడెల్ల నిట్లే జరుపు కథలు మనము వినుచుందుము. తెరచిన పుస్తకము నాకలిదప్పులు మరచియైనను చదివించు శక్తి తిరుగుడు వ్రాతలలో నుండజాలదు. సూటిగల పుస్తకమును పాఠకుడు విడువడు. ప్రారంభమువలె నుపసంహారము కూడ విషయముతో ముగియవలెను. బాణప్రయోగోప సంహారము వలె భాషాప్రయోగోప సంహారశక్తి కూడ చిత్రమైన ఫలితముల నీయగలదు.

సూటిలేనిచో నిత్యవ్యవహారము, నిత్యజీవితము కూడ గజిబిజి యగును. ఈ రోజులలో కాల మమూల్యమైనది. కాలమే బంగారము. కాలము, కెరటములు నీ కొరకు వేచి యుండవు. నీ వే యధికారి యొద్దకు పోయినను ముక్తసరిగ నీ పని చెప్పి వెంటనే ముగించుకొనవలెనే గాని లేనిపోని సోది

ప్రారంభింతువేని వెళ్ళినట్లే రిక్త హస్తములతో రావలసి యుండును. కోర్టులలో నొక్కొక్కడు సాక్ష్యము చెప్పుచుండును. ప్లీడరు తల బ్రద్దలుకొట్టుకొనినను, జడ్జీలు లబలబలాడుచు మాట యందించినను యీ సాక్షి కావలసిన ముక్కయెన్నడు చెప్పడు. చివర కట్టి సాక్ష్యము వదలుకొనవలసి వచ్చును. బజారులో కూడ నీకు కావలసినవి చకచక యడిగి తెచ్చుకొనక సంగిసంగి మాటలాడుచుందువేని గంటలకొలది వేచియుండ వలెను. ఒక్కొక్కప్పుడు మరియొక దుకాణమునకు బొమ్మని దుకాణదారు కసరికొట్టుచుండును. నీకు నీవొక్కడవే గాని యతడు గంటకు నూరుమందికి సమాధానము చెప్పవలయును. ఒకని చాదస్తము, సోదె యతని యుత్తర ప్రత్యుత్తరములలో తెలిసిపోవును. మొదటి వాక్యములోనే యతని బండారము బయట పడును. ఇతడు రెండు మూడు పేజీలలో నింపు విషయము నే పది పంక్తులలోనో పూర్తిచేయ వచ్చును. నీ వెన్నడు చూచియుండని యొక్కొక్కని మనఃప్రవృత్తిని దెల్పుటకు వాని యుత్తర మొకటి చాలును. ఆ యొక్కయుత్తరములో నతని జిగిబిగి, లోతుపాతు, లేక పేలవతనము బయట పడును.

కనుక వ్రాయునపుడు, మాట్లాడునపుడు బాగుగా యోచించి క్లుప్తపదములనే వాడవలెను. వ్రాసినదానినే తిరిగి తిరిగి చదివి దొరికిన యనవసర పదములను తీసివేసి దిద్ది యేర్చి కూర్చి పోత పోయుము. ఇట్లు చేయుటవలన నస్తవ్యస్తముగ

వ్రాయు వ్రాత తగ్గుటయేగాక భావగరిమ కూడ వృద్ధిజెందును. వృధాజల్పము, వృధాపదప్రయోగము లేని సత్తువ తెచ్చి పెట్టవు. ఉన్నదానికి తేజ మొసగవు.

శ్లో॥ అగాధ జల సంచారీ వికారీ నైవరోహితః।
గండూష జల మాత్రేన శబరీ పర్పరాయతే॥

అతిలోతైన నీటిలో సంచారముచేయు రోహిత మనెడు పెద్దచేప యెట్టి ప్రగల్భములు కొట్టదు. వికారచేష్టలు చేయదు. పురిసెడు నీళ్ళున్నంత మాత్రముననే శబరి యను చిరుచేప మిట్టిపడుచు రెప రెపలాడును. టపటప ధ్వని చేయును. యదార్థ జీవితమున కిట్టి భేషజము లవసరము లేదు. సరళత్వము, సూటిదనము సుఖమునే ప్రసాదించును. జీవితమును షోడిగించును.

# కృపణత్వము - ఆత్మదైన్యము.

"తనను తాను నిందించుకొన ప్రారంభించినవాడు తన గోతిని తానే త్రవ్వుకొనిన వాడగుచున్నాడు. అట్లు చేయు జాతికి కూడ నాగతియే పట్టును. ఆత్మనింద జేసికొనక పోవుటయే మన ప్రథమ కర్తవ్యము. మన నిజోన్నతి పొందుటకు దొలుత మన కాత్మవిశ్వాస ముండవలెను. తరువాత భగవంతుని యందు విశ్వాస ముండవలయును. ఆత్మ విశ్వాసము లేనివానికి భగవద్విశ్వాస మెన్నటికి గలుగనేరదు. అట్టిది శశవిషాణమే యనుగు." అని వివేకానందుడు కర్మయోగ రహస్యమును చెప్పెను.

భారతీయుడా! ఈ సువర్ణాక్షరములను గుర్తింపుము. మననము జేయుము. జీర్ణము చేసికొనుము. జీవింపుము. భారతమా! నీ ముద్దుబిడ్డ, నీ యనుంగు తనయుడు శ్వేత ప్రపంచము నుఱ్ఱూత లూగించిన మోహనమూర్తి వివేకానందుడు వచించిన యీ వాక్యరత్నములను నీనోదోంతరాళములందు గిరిగహ్వర కందరసీమలందు, చతుష్పథములందు నెల్లపుడును మారుమ్రోగునట్లు చేయుము. తల్లీ! కృపణత్వము! ఈ భారత కృపణత్వ మెచ్చటనుండి దాపురించెను. ఇది యార్య జాతికి, తన కళ్యాణమును కోరు జాతికి తగినది కాదు. శ్రీకృష్ణు డర్జునుని కృపణత్వమును పారద్రోలి యాత్మవిశ్వాసమును, ఆత్మజ్ఞానమును పురిగొల్పెను. తక్కిన కథ జగద్విదితము.

ఈ యిరువదవ శతాబ్దములో నవనాగరికత, నూత్న భావములు "మరో ప్రపంచము" అను వెలుగులు నూరు మ్రోగు యీ ప్రపంచములో నయిదేండ్ల ప్రణాళిక, పదేండ్ల ప్రణాళిక, ప్రపంచజాతి, ప్రపంచ కారిక్మ్రదు, సామ్రాజ్యతత్వ విధ్వంసము, నాజీ, ఫాసిస్టు నాశనము, అట్లాంటిక్ ఛార్టరు అని యెవరిబాకా వారూదుకొను యీ రోజులలో భారతదేశ మెవరివైపు చూడవలెను? ఎవరి ననుసరింపవలెను? ఎవరిని దేవురింపవలెను? ఎవరిని ప్రార్థేయపడవలెను? దాస్యము పనికి రాదని యొక వంక పలుకుచు రష్యాను కొలువవలె ననువారు కొందరు, అమెరికాను మ్రొక్కవలె ననువారు కొందరు, ఇంగ్లండునే యాశ్రయింపవలె ననువారింక కొందరు. ఇట్లింకను పైచూపే కాన్పించుచున్నది. ఆశ వదలుకొనినవాని చూపుపై చూపు పడును. లోచూపు నిలిచిపోవును.

భారతదేశమున కింకను అట్టి దుర్గతి పట్టలేదు. ఈ దృష్టి యమానుష దృష్టి. భారతదేశమే భారతదేశము నుద్ధరించుటకు మొదట పూనుకొన వలయును. ఆత్మవిశ్వాసము లేని దేశ మితరుల పంచలకు పోయినపుడు తలవంపులు జరుగును. కనుకనే మన కిపుడు కట్టెలు కొట్టు జాతి, నీళ్ళు చేదు జాతి, కూలీల జాతి, యని పిలువబడు దుర్గతి పట్టినది. గాంధీజీ భారత దేశవాసి యగుటచేతనే 'కూలీ ప్లీడరు' అని పిలువ బడెను. నీ యన్నమును నీవు తిని జీర్ణించుకొని రక్త మాంస మజ్జాదులను సేకరించుకొనవలె గాని నీ కొరకితరులీ పని

చేయగలరా? నీ సమస్యను నీవే పరిష్కరించు కొనవలెను. అట్టి విశ్వాసము, ప్రయత్నము గల వానికెతరులును తోడ్పడుదురు. తోడ్పడకపోయినను వానికి విజయము తప్పదు.

ఆత్మవిశ్వాసము గల సింగపు కొదమ మదమలిన మత్తేభ కుంభముపై కుప్పించుచున్నది. ఈ సింగపు కొదమ కరణ్య ప్రాణులపై రాజ్యాభిషేక సంస్కారము నే మృగములు చేసెను? ఇతడు మృగేంద్రు డెట్లయ్యెను? ఆత్మవిశ్వాసము, తజ్జన్యమైన శక్తి, దీనికి కారణములు. ఆత్మ విశ్వాసము లేనియా చీకటి పర్వతములు పిక్కాపికలై పారిపోవు చున్నవి. ఆత్మ విశ్వాసము గల పండుగొతి పెద్ద కొండముచ్చుల దండును తరిమివేయు చున్నది. ఆత్మహత్య యుక్తము కాదని ప్రతి మతము, ప్రతి దేశము, ప్రతి మనుజుడు నిందించును. అట్టి ప్రయత్నము చేయు వానిని చట్టము శిక్షించును. సంఘములో నట్టివా డమర్యాదకు పాల్పడును. ఆత్మనింద యింతకంటె నికృష్టమైనది. ఆత్మహత్య చేసికొనువా డొక్కసారియే చనిపోవు చున్నాడు. ఆత్మనిందకుడు జీవన్మృతు డగుచున్నాడు. ఇది యాజీవ మరణము. ఇట్టి జీవితము శోభింపదు.

"నేను దీనుడను, మూర్ఖుడను, పాపిని, దుఃఖితుడను," అను నీరస నిర్వీర్య భావములతోను, పదములతోను, తమ్ము తాము నిందించుకొందురు. "దుమ్ముకంటె ధూళి కంటె పురుగుల కంటె నికృష్టులము" యని చెప్పుకొందురు. "భగవంతుని యందు విశ్వాసము లేనివాడు నాస్తికుడని పాత మతములు

చెప్పెను. ఆత్మవిశ్వాసము లేనివాడు నాస్తికుడని నూతన మతము చెప్పుచున్నది" యని వివేకానందుడు ఘోషించు చున్నాడు.

నీవు, యీ జీవితము గాలికి కొట్టుకొనివచ్చినవి కావు. గాలిచే నెగుర గొట్టబడు రజోలేశమును గావు. సమస్త విశ్వము నేలు దొరచే నతని రూపములో సృష్టింపబడి యాత్మ సామ్రాజ్యమున కధిపతిగ, రాజుగ లేక రాణిగ, నర నారీ రూపములలో తేజరిల్లగల వ్యక్తి బెండుపడి, దైన్యము వహించి, కృశత్వము, కృపణత్వము జెందుట పాడిగాదు. అది మానవ లక్షణము గాదు. దైవలక్షణ మంతకు మునుపే కాదు.

లేచి నీ పరిసరముల నొక్కసారి తిలకించి చూచినచో మానవయంత్ర మసామాన్య మైనదని నీకే తెలియగలదు. ఇట్టి యంత్రము నీ కూరకే చేకూరినదా? దీనిని వ్యర్థముచేయు టకే నీకు ప్రసాదింపబడినదా? చివర కిది యెట్లు చేకూరినను దీని పరమార్థమును పూర్ణత్వమును చేరవలెనా? లేక గ్రుడ్డి వాని ముందు చంద్రోదయమువలె నిది ప్రమగ్గిపోవలెనా? వెన్ను విరిచి, యూపిరి బిగించి, రొమ్ము పెంచి, పిడికిలి బట్టి, ధైర్యము వహించి నీ నిజోన్నతి నొందవలసిన నీవు వెన్నముక లేనివాని వలె, క్రిమికీటకము వలె నేలపడి దొర్లుట దైవ దూషణమా? లేక దైవ భూషణమా? దేవతలు కూడ పుణ్యము, క్షీణ్యి మగుచు రాగా రాగా మానవజన్మ మెత్తియే తరింపవలసి యుండగా మానవుడు దైన్యము ననుభవించుట భక్తి యను

కొందురేమో! 'నరులలో పౌరుషమును, నరోత్తముడను; మృగములలో మృగేంద్రుడను; తేజోవంతులలో తేజస్సును; రాక్షసులలో ప్రహ్లాదుడను; ధేనువులలో కామధేనువును; నేను వ్యవసాయమును. జయమును. ఇది యది యననేల? మూర్తివంతము, సకలైశ్వర్య సంపన్నము, యుత్సాహవంతము నగు ప్రాణిసమూహ మాతయు నా యంశ జనితములనియే తెలిసికొనుము.'' అని శ్రీకృష్ణు డర్జుననకు వీరోచిత గుణము నాదేశింపగా దైన్యత నారాధింపనేల? పౌరుషము లేనిచోట దైవసమృద్ధియు నుండజాలదు.

అలెగ్జాండరు ప్రపంచమును జయింపవలెనని బయలుదేరెను. అతడు దిగ్విజయ యాత్ర జేయుచు భారతదేశమునకు వచ్చెను. సింధునది యొడ్డున పురుషోత్తము డతని నెదుర్కొని ఘోర సంగ్రామము సల్పి యోడిపోయెను. అలెగ్జాండరు యొద్ద కతనిని ఖైదీగా తీసికొనిపోయి, ''నిన్నెట్లు చూడగోరుదువు?'' యని యడుగగా నతడు "నన్ను రాజువలెనే చూడవలెను. నేను రాజును.'' అని బదులుచెప్పగా యతని ధైర్య సాహసములకు, వీరాలాపములకు మెచ్చి యతని రాజ్య మతని కిచ్చివేయుటయే గాక యలెగ్జాండరు తన సామ్రాజ్యమునకు గూడ నతనినే ప్రతినిధిగ యేర్పాటుచేసెను.

రాణాప్రతాపును స్మరించుట యనగా రాజస్థానమును స్మరించుటయే! అతడు రాజస్థాన చరిత్రకారుడు. అక్బరుకా ప్రక్కలోని బల్లెము. అతనిపైకి దండెత్తుకొని వచ్చిన మీరా

ఖాన్ అతనిని మెచ్చుకొనుచు తన భాష నతని నిట్లు వర్ణించెను. "ఈ ప్రపంచములో సర్వము నశించునదే. అధికారము, ఐశ్వర్యము హారతికర్పూరము వలె హరించిపోవును. కాని నీవంటి విఖ్యాత పురుషుని కీర్తిచంద్రిక లాచంద్ర తారార్కము నిలిచి యుండును." ఇతనిని గురించియే యాంగ్ల చరిత్రకారుడైన స్మిత్ ఇట్లు వ్రాసెను. "ఓడినవారే గెల్చినవారి కంటె నధికులు. వారి జీవితములు, వారి యాదర్శములు జీవితమునకు వన్నె దెచ్చును. అవి చరిత్ర కెనలేని యలంకారములు. వారు భీరుల సాదృశ్యము నొల్లక రాజస్థాన గౌరవము కొరకే పోరిరి. తమజాతిలోని భీరులవలె గాక వీరు దారిద్ర్య ప్రవాసమునే వరించిరి. జాతి యిట్టి యుదార మానసులకు, ధీర హృదయులకు ఋణపడి యుండును. వీరి శత్రువులు సామ్రాజ్య కీర్తిని చాటిరి! వీరో! ఏ మహోదార గుణములు, ఏ లలిత భావములు లేనిచో నైశ్వర్యాధికార మదములు మానవుని పశుప్రాయుని చేయునో వానికి ప్రోదిచేసిరి. ఏ వంక చూచినను నైచ్యము, దైన్యము కాన్పించుచుండ, వీరు తమ విశ్వాసముల కొరకు, తాము వరించిన ధర్మము కొరకు, ఆత్మార్పణ మొనర్చిన గ్రీకులను, రోమనులను మరపించిరి. ఇట్టి వీరుల వీరకలాపమే చరిత్ర కలంకారము. మానవలోకము మహాదాశయములను, వానిని సాధించు పౌరుషమును శ్లాఘించునంత కాలము వీరి సంస్మరణ మనజాతి కమూల్యమైన పెన్నిధానమే యగును."

మరియొక విధముగ పౌరుష సాంప్రదాయము కలదు. ఒక బాలుడు ధృవ స్థానమునే యలంకరించెను. ఒక యరుంధతి తారయై మాతృవధువు కాదర్శముగ చూపబడు చున్నది. ఒక సావిత్రి మృతినొందిన భర్తను బ్రతికించుకొనెను. ఇంకొక స్త్రీ సూర్యాగమమునే యరికట్టెను. సీతమ్మతల్లి కగ్ని చందన శీతలత వహించెను. పౌరుషము సాధింపని దేది కలదు?

మానవ చరిత మిట్టి యుదార జీవితములతో రాణించు చుండ దైన్య మెందులకో తెలియ రాకున్నది? ఆత్మవిస్మృతి, యాత్మనింద, యాత్మనాశము మానవున కౌన్నత్యము ప్రసాదించిన సాదృశ్యము లెచ్చటను కానరావు. గౌరవ, ధైర్యము, సాహసము, పరిస్థితుల నతి సంతోషముతో సునాయాసముగ నెదుర్కొనుట, జీవిత సంగ్రామమును లీలగా భావించుట మొదలగునవి మానవోచిత ధర్మములు. తన వ్యక్తిత్వమును, తన ధర్మమును నిలుపుకొను వానినే ప్రపంచ మాదరించును. "జీవితములో తన్ను తాను వంచన చేసికొనని వానిని మరెవ్వరు వంచన చేయజాలరు." అని ఎమర్సన్ కవి వర్ణించి యున్నాడు. నీ కాత్మవిశ్వాస మున్నచో నిన్ను నీవు వంచించుకొనవు. ఆత్మశక్తి ననాదరణ చేసికొనకుము. నిన్ను నీవు చులకన చేసికొనకుము.

"బలమే జీవితము. దుర్బలత్వము మృత్యువు. బలమే సుఖము, అమరత్వము. దుర్బలత్వ మనవరత ఖేదము, దుఃఖము. శైశవము నుండియు నీ మనఃఫలకమున నుత్సాహ

ప్రభుమంత్రి శక్తియుతములగు భావములే హెత్తుకొనుగాక ............ మన దుఃఖములకు దుర్బలత్వమే కారణము. మనము దుర్బలుల మగుటచేతనే దుఃఖగ్రస్తుల మగుదుము. దుర్బలుల మగుటచేతనే మనము దొంగతనములు, అబద్ధములు, హత్యలు, ఇతర నేరములు చేయుచుందుము. దుర్బలత్వము చేతనే మనము చనిపోవుదుము."

"మనము చాలకాలమునుండి శోకించు చుంటిమి. ఇక యీ యధ్యాయమును కట్టిపెట్ట వలెను. మన మిక మన పాదములపై నిలిచి మనుష్యులము కావలెను. మనకు మానవులను తయారుచేయు మతము కావలెను. మానవులను తయారు చేయు సిద్ధాంతము కావలెను. సత్యమున కొక్కటే పరీక్ష కలదు. నిన్ను శారీరికముగ, మానసికముగ, నాధ్యాత్మికముగ దుర్బలపరచు దానిని దేనినైనను విషమువలె వర్జింపుము. అందులో జీవిత ముండదు. అది సత్యము కానేరదు. సత్యము బల సమృద్ధి కలది. సత్యమే పవిత్రత. సత్యము జ్ఞానములో నుత్తమమైన జ్ఞానము. సత్యము విజ్ఞానదాయక మైనది. వీర్య వంతమైనది." ఇది వివేకానందుని వాణి. నిక్కమైన వాణి. నవభారతము కృపణత్వము వీడి పై దివ్యసూక్తులలోని పరమార్థమును చూఱగొనును గాత!

హే వీర! కురు పౌరుష మాత్మనః । ఉపేక్షిత వ్యాజనాః

సుకృపణాః॥

శ్రీ దేవులపల్లి శ్రీరామమూర్తిగారు, ఆకిరిపల్లి
శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణగారు, పిప్పర
శ్రీ తటవర్తి కృష్ణమూర్తిగారు, భీమవరం
శ్రీ నూలి వెంకటరత్నంగారు, తణుకు
శ్రీ చాడ నారాయణమూర్తిగారు, తొండంగి
శ్రీ తుమ్మలపల్లి వీరభద్రరావుగారు, పిప్పర
శ్రీ పత్సవాయి వెంకట్రామరాజుగారు, మంచిలి
శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణ
వరప్రసాదరావుగారు, పోతునూరు
శ్రీ అల్లూరి బాపినీడుగారు, కొవ్వూరు
శ్రీ మన్నె బుల్లితిరుపతిరాయుడుగారు, దేవ
శ్రీ కొమ్మారెడ్డి రామనాథంగారు, పోతునూరు
శ్రీ కొమ్మారెడ్డి కృష్ణమూర్తిగారు, పోతునూరు
శ్రీ కొమ్మారెడ్డి వెంకట్రామయ్యగారి కుమార్డు
ఆంజనేయులుగారు, పోతునూరు
శ్రీ ముడింబి వెంకటరంగఅనహరాచార్యులుగారు, గూటాల
శ్రీ గొట్టుముక్కల సుబ్బరాజుగారు, మంచిలి
శ్రీ డాక్టరు బొమ్మకంటి నరసింహశాస్త్రి, నిడదవోలు
శ్రీ పసల సూర్యచంద్రరావుగారు, తాడేపల్లిగూడెం
శ్రీ మావులేటి సోమరాజుగారు, గుండుగొలను
శ్రీ కళ్ళ వెంకటేశ్వరరావుగారు, పూళ్ళ
శ్రీ నూలు లక్ష్మీనారాయణగారు, పెనుగొండ
శ్రీ వినపాముల శేషారామయ్యగారు, గుంటూరు